కేంద్రం మార్గదర్శకాల మేరకే!

- రాష్ట్రపతికి గడువు విధించడంపై సుప్రీంకోర్టు తీర్పులోనే వివరాలున్నాయి
- 201వ అధికరణ లక్ష్యాలు, ఉద్దేశాలకు అనుగుణంగానే తీర్పు

7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 284 | విజయవాడ, ఆదివారం 18 మే 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 18 May 2025 | Rs



కొత్త కెప్టెన్ ఎవరు?

- రేసులో శుభ్‌మన్, జస్‌ప్రీత్ బుమ్రా
- సోమవారం భేటీ కానున్న సెలక్షన్ కమిటీ

8



ప్రపంచానికి 'సిందూర్' సందేశం

- అఖిలపక్ష ప్రతినిధులతో విదేశాలకు ఏడు బృందాలు
- కాంగ్రెస్ జాబితాలో లేకున్నా శశిథరూర్ ఎంపిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆపరేషన్ సిందూర్‌పై ప్రత్యేక పార్లమెంటు సమావేశం నిర్వహించి, దేశ ప్రజలకు పూర్తి స్థాయి వివరాలు వెల్లడించడానికి ససేమిరా అంటున్న కేంద్ర ప్రభుత్వం, వివిధ దేశాలకు వివరించడానికి మాత్రం సిద్ధమౌతోంది. ఈ మేరకు ఏడు అఖిలపక్ష ప్రతినిధుల బృందాలను శనివారం ఏర్పాటు చేసింది. అంతర్జాతీయ స్థాయిలో ఇదో మంచి ప్రయత్నమైనప్పటికీ ఈ ప్రక్రియలో సైతం రాజకీయాలకు పాల్పడటంతో కేంద్ర తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అఖిలపక్ష బృందాలకు ఎంపిల పేర్లు సూచించాలని కొద్దిరోజుల క్రితమే కేంద్రం వివిధ పార్టీలను కోరింది. దీంతో కాంగ్రెస్ పార్టీ కొందరి పేర్లను సూచించింది. అయితే, ఆ జాబితాలో లేని శశిథరూర్‌ను కేంద్రం ఎంపిక చేయడం, ఒక బృందానికి నాయకత్వ బాధ్యత అప్పగించడం వివాదాస్పదంగా మారింది. తాము సూచించిన పేర్లలో ఒక్కటికూడా కేంద్రం విడుదల చేసిన తుది జాబితాలో లేదని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. మరోవైపు ఆపరేషన్ సిందూర్ సందేశాన్ని ప్రపంచ దేశాలకు వివరించేందుకు, అలాగే పాకిస్తాన్ కుట్రలను అంతర్జాతీయంగా తెలియజేసేందుకు ఈ అఖిలపక్ష ప్రతినిధుల బృందాలను ఏర్పాటు చేసినట్లు కేంద్రం తెలిపింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం ఎంపిలు శశిథరూర్ (కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్ (బిజెపి), వైజయంత్ పాండా (బిజెపి) సంజయ్ కుమార్ ఝా (జెడియు), కనిమొళి (డిఎంకె), సుప్రియా సూలే (ఎన్‌సిపి - సిపి), శ్రీకాంత్ శిండే (శివసేన) ఈ బృందాలకు నాయకత్వం వహించనున్నారు. ఈ బృందాలు ఈ నెల 22 బయలుదేరి, జూన్ మొదటి వారంలో తిరిగి వస్తాయి. ఆరు నుండి ఏడుగురు ఎంపిలు ఉన్న ప్రతి ప్రతినిధి బృందం నాలుగు నుండి ఐదు దేశాలను సందర్శిస్తాయని అధికార వర్గాలు తెలిపాయి.

ఏ బృందం ఎక్కడికి...?

అమెరికాకు వెళ్లే ప్రతినిధి బృందానికి శశిథరూర్, రష్యా ప్రతినిధి బృందానికి కనిమొళి, దక్షిణాఫ్రికా (ఒమన్, కెన్యా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్) ప్రతినిధి బృందానికి సుప్రియా సూలే, ఆఫ్రికా ప్రతినిధి బృందానికి శ్రీకాంత్ షిండే, గల్ఫ్ దేశాల (సౌదీ అరేబియా, కువైట్, బర్మన్, అల్జీరియా)కు రవిశంకర్ ప్రసాద్, జపాన్ సింగపూర్, దక్షిణ కొరియా, మలేషియా, ఇండోనేషియాలకు సంజయ్ కుమార్ ఝా నేతృత్వం వహిస్తారు. కాంగ్రెస్‌కు చెందిన సల్మాన్ ఖుర్షీద్, మనీష్ తివారీ, అమర్ సింగ్, సిపిఎంకు చెందిన జాన్ బ్రిట్టాస్, టిఎంసికి చెందిన సుదీప్ బందోపాధ్యాయ, ఎంఐఎంకు చెందిన అసదుద్దీన్ ఒవైసి, బిజెడికి చెందిన సస్మిత్ పాత్రా, ఐయుఎంఎల్‌కు చెందిన ఇటి మొహమ్మద్ బషీర్, శివసేనకు చెందిన ప్రియాంక చతుర్వేది, జెఎంఎంకు మిగతా 7లో

ఆగస్టు 15 నుంచి మహిళలకు

ఉచిత బస్సు ప్రయాణం

పాఠశాలల ప్రారంభానికి ముందే 'తల్లికి వందనం'

- డ్వాక్రా మహిళలకు చెత్త నుండి సంపద బాధ్యతలు
- 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర'లో ముఖ్యమంత్రి చంద్రబాబు



రైతు బజారులో దోసకాయలను కొనుగోలు చేస్తున్న చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

రాష్ట్రంలోని మహిళలందరికీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. పాఠశాలల ప్రారంభానికి ముందే తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. శనివారం ఆయన కర్నూలులో పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ఓర్వకల్లు విమానాశ్రయానికి వచ్చి చంద్రబాబు అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సి-క్యాంప్ రైతు బజారుకు చేరుకున్నారు. రైతు బజారును పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతు బజారులో దోసకాయలను కొనుగోలు చేశారు. అనంతరం ధనలక్ష్మి నగర్‌లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర పార్కుకు శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ప్రజావేదిక వద్దకు చేరుకున్నారు. ఇల్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుతామని ప్రజలందరితో తొలుత స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పచ్చదనం పెంచాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి నెల మూడో శనివారం ఇళ్లు, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. డ్వాక్రా మహిళలకు చెత్త నుండి సంపద సృష్టి బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. తద్వారా మహిళలకు ఆదాయం సమకూరుస్తామన్నారు. గత ప్రభుత్వం పట్టణాల్లో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త వదిలిపెట్టిందని, అక్టోబర్ రెండు నాటికి చెత్త లేకుండా చేయాలని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఈ సంవత్సరం లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేస్తామన్నారు. తడి చెత్తను కంపోస్టుగా మార్చాలని, డ్వాక్రా మహిళల ద్వారా అది ఉద్యమంగా మారుతుందని, ప్రపంచానికే ఆదర్శం అవుతుందని తెలిపారు. పొడి చెత్తను రీసైక్లింగ్‌కు పంపిస్తామని, దీనితో అనేక వస్తువులు తయారు చేయవచ్చని తెలిపారు.

లేపాక్షి-ఓర్వకల్లు పారిశ్రామిక హబ్ ఏర్పాటు

రాయలసీమను రతనాలసీమగా మారుస్తామని, హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని చంద్రబాబు అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షి నుండి ఓర్వకల్లు వరకు పారిశ్రామిక హబ్ ఏర్పాటు చేసి ఎలక్ట్రానిక్స్, ఆటో మొబైల్, డిఫెన్స్, ఏరోస్పేస్ పరిశ్రమలు తీసుకొస్తామని తెలిపారు. రాష్ట్రం గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తయారవుతుందని, రాయలసీమ కేంద్రంగా పని చేస్తుందని అన్నారు. పోలవరం నుండి బనకచర్లకు నీళ్లు తెస్తే రాయలసీమ గేమ్‌చేంజర్‌గా తయారవుతుందని, ప్రతి ఎకరాకు నీళ్లిచ్చే పరిస్థితి వస్తుందని తెలిపారు.

ప్రతి నియోజకవర్గంలో రైతు బజారు

ప్రతి నియోజకవర్గంలో రైతు బజారు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని రైతు బజార్లనూ అభివృద్ధి చేస్తామన్నారు. ప్రపంచం మెచ్చుకునేలా విశాఖలో యోగా డే నిర్వహిస్తామని, దీనికి ప్రధాని మోడీ వస్తున్నారని తెలిపారు. 15,995 గ్రామాలను ఒడిఎఫ్ ప్లస్ గ్రామాలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, రైతులకు అన్నదాత సుఖీభవ, డ్రిప్ ఇరిగేషన్ ఇస్తామని తెలిపారు. 2029 నాటికి పేదరికం లేకుండా చేస్తామని, పేదలకు చేయూతనిస్తే బంగారు కుటుంబాలు అవుతాయని అన్నారు. వారికి మార్గదర్శిగా ఉండేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు. అంతకుముందు సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ స్థాపకులు సుధారాణి, ఆర్థా గ్లోబల్ సిఇఒ కరణ్ షా, ఐసిఎస్ఐసి డైరెక్టర్ సౌమ్య చతుర్వేదుల, గ్రీన్‌కో ప్రతినిధి శ్రీనివాసరావుతో చంద్రబాబు ముఖాముఖిగా మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మిద్దె తోటల పెంపకంపై శ్రద్ధ పెట్టాలని ప్రజలను ఆయన కోరారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు బిసి జనార్దన్ రెడ్డి, ఎన్ఎండి ఫరూక్, పి నారాయణ, టిజి భరత్, ఎంపిలు బైరెడ్డి శబరి, బస్తిపాటి నాగరాజు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, కలెక్టర్లు పి.రంజిత్ బాషా, రాజకుమారి గణియా, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.



ప్రధాని మోడీతో లోకేష్ కుటుంబం

ప్రధాని మోడీతో లోకేష్ కుటుంబం భేటీ


ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో రాష్ట్ర విద్యా, ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్‌టిజి శాఖల మంత్రి నారా లోకేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కుటుంబ సమేతంగా ఢిల్లీకి రావాలని లోకేష్‌ను మోడీ ఆహ్వానించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో లోకేష్, ఆయన భార్య బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ తో కలిసి శనివారం ఢిల్లీలోని ప్రధానమంత్రి నివాసానికి వెళ్లి మోడీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 2024 ఎన్నికలకు ముందు 'యువగళం' పేరుతో లోకేష్ చేపట్టిన 3,132 కిలోమీటర్ల పాదయాత్రకు మిగతా 5లో

ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలకు

20వ తేది వరకు రిమాండ్

ముడుపులు ఎక్కడకు వెళ్లాయో వారికే తెలుసు : రిమాండ్ రిపోర్టులో సిట్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మద్యం ముడుపుల కేసులో అరెస్టయిన మాజీ సిఎం కార్యదర్శి ధనుంజయరెడ్డి, ఓఎస్‌డి కృష్ణమోహన్‌రెడ్డికి ఎసిబి కోర్టు 20వ తేదీ వరకూ రిమాండు విధించింది. మూడు రోజుల విచారణ అనంతరం వారిని అరెస్టు చేసిన సిట్ అధికారులు శనివారం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎసిబి కోర్టులో వారిని హాజరు పరిచారు. నిందితుల తరుపున మాజీ అడ్వకేట్ జనరల్ శ్రీరామ్ వాదనలు వినిపించారు. ఒక్క సరైన ఆధారం కూడా లేదని ఆయన కోర్టుకు తెలిపారు. అయితే రిమాండు రిపోర్టులో సిట్ అధికారులు కీలక విషయాలు ప్రస్తావించారు. ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి మద్యం వ్యాపారులతో కలిసి సిండికేట్‌గా ఏర్పడ్డారని, దీనిలో ఉన్నతాధికారులతోపాటు వ్యాపారులూ, రాజకీయ నేతలు భాగస్వాములుగా ఉన్నారని తెలిపారు. వీరిద్దరూ కేసులో ఎ1 నిందితుడు రాజ్ కేసిరెడ్డికి అత్యంత సన్నిహితులనీ పేర్కొన్నారు. ముడుపుల వసూళ్లు, బదిలీలో వీరిద్దరూ కీలకపాత్ర పోషించారని, నిధులు ఎక్కడకు వెళ్లాయో వారిద్దరికే తెలుసని పేర్కొన్నారు. ఇందులో కీలక నిందితుల నుండి పెద్దఎత్తున సొమ్ము వసూలు చేశారని, అవి ఎక్కడికి వెళ్లాయో తెలియాలంటే లోతైన విచారణ అవసరమని అందులో పేర్కొన్నారు.

రాజ్ కేసిరెడ్డి, మిధున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, సత్యప్రసాద్‌తో కలిసి అనేక సమావేశాలు నిర్వహించారని, ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ మద్యం సిండికేట్ సమావేశాల్లో పాల్గొన్నారని తెలిపారు. ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లి ముడుపుల వ్యవహారాన్ని నిరంతరం పర్యవేక్షించారని వివరించారు. అవినీతి డబ్బుతో ఖరీదైన కార్లు, వస్తువులు కొన్నారని, అవి ఎక్కడున్నాయో తెలియాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమగ్ర దర్యాప్తు కోసం ఏడు రోజుల విచారణకు ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

దురదృష్టకరం

పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి తిరస్కరించడం పై సిపిఎం

న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్ర దాడిని, తదనంతరం చోటు చేసుకున్న పరిణామాలను చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడానికి ప్రధాన మంత్రి, ఆయన నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తిరస్కరించడం దురదృష్టకరమని సిపిఎం పేర్కొంది. ఈ మేరకు సిపిఎం పొలిట్‌బ్యూరో శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, దేశ ప్రజలకు వివరాలు తెలియచేయాలని, ఒకవేళ ఎవరన్నా వివరణలు కోరాలనుకుంటే అందుకు అవకాశం కూడా కల్పించాలని ఈ ప్రకటనలో సిపిఎం కేంద్రాన్ని కోరింది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి బదులుగా, కేవలం బిజెపి, ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి, వారికి ఆపరేషన్ సిందూర్ గురించి తెలియజేశారని, జాతీయ ప్రాముఖ్యత కలిగిన విషయాల్లో ఇది వివక్షను ప్రదర్శించడమేనని తెలిపింది. ఇటువంటి వివరాలను తెలియచేయడానికి ప్రతిపక్ష పార్టీల పాలనలోని రాష్ట్రాల ముఖ్యమంత్రులుసహా అందరు ముఖ్య మంత్రులనూ సమావేశానికి పిలవాలని డిమాండ్ చేసింది.

'ప్రభుత్వం ముందుగా దేశ ప్రజలకు జవాబుదారీగా వుండాలి, ఆ తర్వాత తన చర్యల్లో పారదర్శకంగా వ్యవహరించాలి' సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది. మతతత్వాన్ని రెచ్చగొట్టే చర్యలను పాలకపార్టీ నేతలు, రాష్ట్రాల మంత్రులు తక్షణమే ఆపాలని కోరింది.

అభ్యంతరాలున్నప్పటికీ... బాధ్యతగా

దౌత్య స్థాయిలో ఆపరేషన్ సిందూర్ గురించి వివిధ దేశాలకు వివరించడానికి వేర్వేరు దేశాలకు వివిధ ప్రతినిధి బృందాలను పంపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ విషయం రాజ్యసభలో సిపిఎం పక్ష నాయకుడిని పిలిచి తెలియజేసిందని పొలిట్‌బ్యూరో ఆ ప్రకటనలో పేర్కొంది. పైన పేర్కొన్న అభ్యంతరాలు తమకు వున్నప్పటికీ, తమ డిమాండ్లు గురించి పునరుద్ఘాటించినప్పటికీ, జాతి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అటువంటి ప్రతినిధి బృందాల్లో భాగం కావడం తమ బాధ్యతగా భావించామని పొలిట్‌బ్యూరో ఆ ప్రకటనలో పేర్కొంది.

ఉపాధిహామీ కుంభకోణంలో

గుజరాత్ మంత్రి కుమారుడి అరెస్టు

దాహోద్ : ఉపాధి హామీ చట్టం సక్రమంగా అమలయ్యేలా చూడాల్సిన వ్యవసాయ, పంచాయతీ శాఖల మంత్రి కుమారుడే అడ్డంగా అందిన కాడికి దోచుకున్న కేసులో అరెస్టయిన ఉదంతం బిజెపి పాలిత గుజరాత్‌లో చోటుచేసుకుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనుల్లో రూ.71కోట్ల కుంభకోణానికి పాల్పడిన కేసులో గుజరాత్ మంత్రి బచ్చూభాయ్ కుమారుడు బల్వంత్ ఖాబాద్‌తోపాటు దాహోద్ జిల్లాలో పనిచేసిన అప్పటి తాలూకా అభివృద్ధి అధికారి (టిడిఒ) దర్శన్‌పటేల్‌ను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటివరకూ ఈ కేసులో ఏడుగురిని అరెస్టు చేశారు.

డిఆర్‌డిఎ ఫీల్డ్ విజిట్లతో బయటపడ్డ కుంభకోణం

దాహోద్ జిల్లాలోని రెండు తాలూకాల్లో కాంట్రాక్టర్లు రోడ్లు, చెక్ వాల్స్ తదితరాలు నిర్మించనప్పటికీ నిర్మించినట్లు కాగితాలపై చూపించి, రూ.71 కోట్ల నిధులు స్వాహా చేసినట్లు డిఆర్‌డిఎ ఫీల్డ్ విజిట్ల సమయంలో వెలుగుచూసింది. టెండర్లలో పాల్గొనని ఏజెన్సీలకు కూడా చెల్లింపులు జరిగాయని విచారణలో తేలింది. 2021 నుంచి 2024 వరకూ 35 ఏజెన్సీల యజమానులు, ప్రభుత్వ అధికారులు కలిసి ఈ నిధులు స్వాహా చేశారు. పని పూర్తి కాకుండానే పూర్తయినట్లు తప్పుడు సర్టిఫికెట్లు, ఆధారాలను సమర్పించి ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారు. ఒక ఏజెన్సీ నిర్వహించిన మంత్రి కుమారుడు బలవంత్ ఖాబాద్ దేవఘడ్ బరియా, ధన్పూర్ తాలూకాల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించి అవకతవకలకు పాల్పడినట్లు డిఎస్‌పి జయదీష్‌సింహ్ భండారి తెలిపారు. ఇంతకుముందు ఈ కేసులో ఐదుగురిని అరెస్టు చేశామని, తాజాగా మంత్రి కుమారుడిని, అప్పటి టిడిఒ దర్శన్ పటేల్‌ను అరెస్టు చేశామని చెప్పారు. దర్యాప్తును కొనసాగిస్తున్నట్లు డిఎస్‌పి వివరించారు.

అప్పుల ఊబిలో జెన్‌కో

- కోల్ కంపెనీలకు పేరుకుపోయిన బకాయిలు
- ప్లాంట్లకు సక్రమంగా అందని బొగ్గు
- ఆర్‌టిపిపిలో అడుగంటిన నిల్వలు

APGENCO

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ(జెన్‌కో) అప్పుల ఊబిలో కూరుకుపోయింది. బొగ్గు అందించే సంస్థలకు, సరఫరా చేసే కంపెనీలకు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉంది. తీసుకున్న అప్పులకు వడ్డీలు కూడా చెల్లించలేని స్థితికి చేరుకుంది. జెన్‌కో నుంచి విద్యుత్‌ను వాడుకుంటున్న డిస్కంలు నిధులను మాత్రం సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో అప్పులతోనే సంస్థను నెట్టుకొస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ ప్రభావం విద్యుత్ ఉత్పత్తిపై పడుతోందని అధికారులు చెబుతున్నారు. సుమారు రూ.30 వేల కోట్ల వరకు జెన్‌కో అప్పుల్లో ఉంది. రాష్ట్రంలో మూడు విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు జెన్‌కో ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. విజయవాడలోని నార్లా తాతారావు థర్మల్ పవర్ ప్లాంట్(ఎన్‌టిటిపిఎస్), నెల్లూరులోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ ప్లాంట్(ఎస్‌డిఎస్‌టిపిపి), కడపలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్(ఆర్‌టిపిపి) ఉన్నాయి. వీటికి తెలంగాణలోని సింగరేణి, ఒడిశాలోని మహానది బొగ్గు గనుల నుంచి బొగ్గు రావాలి. రైల్వే లైన్ల ద్వారా, షిప్‌ల ద్వారా గానీ బొగ్గు చేరుతోంది. ఈ సరఫరా చేసే కంపెనీలకు జెన్‌కో వేల కోట్లలో బకాయిలు ఉంది. ఏ రాష్ట్రం కూడా ఇంత పెద్దమొత్తంలో బకాయిలు పెట్టలేదని అధికారులు చెబుతున్నారు. కోల్ కంపెనీలతో పాటు గనుల నుంచి సరఫరా చేసే కాంట్రాక్టర్లకు కూడా పెద్ద మొత్తంలో బకాయి పడింది. దీంతో ప్లాంట్లకు చేరాల్సిన బొగ్గు ఆలస్యమవుతోంది. నెల్లూరులోని కృష్ణపట్నం పోర్ట్ నుంచి ఆర్‌టిపిపికి సరఫరా చేసే ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు సుమారు రూ.200కోట్ల వరకు జెన్‌కో బకాయి పడి ఉంది. ఈ బకాయి పేరుకుపోవడంతో ఆ కాంట్రాక్టర్ సరఫరా నిలిపివేశారు. దీంతో ఆర్‌టిపిపికి సరఫరా తగ్గడంతో ప్లాంట్‌లో బొగ్గు నిల్వలు అడుగంటిన పరిస్థితి నెలకొంది. విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లలో కనీసం 15 రోజులకు సరిపడా బొగ్గు నిబంధనల ప్రకారం ఉండాలి. ఎన్‌టిటిపిఎస్‌లో 10 రోజులకు, ఎస్‌డిఎస్‌టిపిఎస్‌లో 6 రోజులకు సరిపడ బొగ్గు ఉంది.ఆర్‌టిపిపిలో ఒక్క రోజుకు కూడా సరిపోయే బొగ్గు లేకపోవడం గమనార్హం. ఈ ప్లాంట్‌లో మొత్తం ఆరు యూనిట్లు ఉన్నాయి. 210 యూనిట్లు 5తో పాటు 600 యూనిట్ ఒకటి ఉంది.ఒక రోజుకు 28,500 మెట్రిక్ టన్నుల బొగ్గు ఇక్కడ అవసరం. కానీ అక్కడ కేవలం 17,109 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది. గనుల నుంచి వచ్చిన బొగ్గును కోల్ స్టోరేజ్‌లో ఉంచి ప్లాంట్లలో వాడతారు. కానీ బొగ్గు లేకపోవడంతో వచ్చింది వచ్చినట్లే నేరుగా ఉపయోగిస్తున్నారు. ప్లాంట్ అధికారులు మాత్రం రైల్వే ర్యాకులు వస్తున్నాయని, బొగ్గు పరిస్థితి మెరుగుపడుతుందని మిగతా 7లో

అంతర్జాతీయ కనెక్టివిటీ కల్పించండి

- కేంద్ర మంత్రికి ఎపి ఛాంబర్స్ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి విమానాశ్రయాల నుండి అంతర్జాతీయ కనెక్టివిటీని పెంచాలని ఎపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఎపి ఛాంబర్స్) కోరింది. ఈ మేరకు కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడుకు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొట్లూరి భాస్కరరావు, బి రాజశేఖర్ శనివారం లేఖ రాశారు. ఎపిలోని మూడు విమానాశ్రయాల్లో అంతర్జాతీయ హోదా ఉందని, పెద్ద విమానాలు దిగగలిగే సదుపాయాలున్నా వాటికి నేరుగా కనెక్టివిటీ కల్పించలేదని పేర్కొన్నారు. ఎపిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న విజయవాడ ఆర్థిక కార్యకలాపాలు, వ్యాపారాలు, పర్యాటక రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధిస్తోందని పేర్కొన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం మొదలైన నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణాలు పెరిగాయని పేర్కొన్నారు. దుబాయ్ అన్ని గమ్యస్థానాలకు కేంద్రంగా మారిందని, ఈ నేపథ్యంలో విజయవాడ నుండి దుబాయ్‌కు నేరుగా విమాన సర్వీసు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే సింగపూర్, సౌత్ ఈస్ట్ ఆసియా దేశాలకూ కనెక్టివిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం నుంచి అంతర్జాతీయ సర్వీసులు ఏర్పాటు చేయాలన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.



ఆరోగ్యకరమైన సమాజానికి పచ్చదనం పరిశుభ్రత ముఖ్యం

- డిజిపి హరీష్ కుమార్ గుప్తా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పరిశుభ్రత, పచ్చదనం ఎంతో ముఖ్యమని డిజిపి హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. పోలీస్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో 'పరిశుభ్రత - పచ్చదనం' ఇతివృత్తంగా ప్రభుత్వం పేర్కొనడంతో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్‌లలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2047 నాటికి దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనానికి సిఎం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. 30 శాతం పచ్చదనంతో రాజధాని అమరావతి నిర్మాణం ఉంటుందన్నారు. భూమిపై కాలుష్యాన్ని నియంత్రించేందుకు, పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ కృషి చేయాలన్నారు. మొక్కలు నాటడం ప్రజలందరూ సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసు రాష్ట్ర కార్యాలయంలో ఉన్న అన్ని సెక్షన్లలో నిరుపయోగంగా పడి ఉన్న 18,298 ఫైళ్లను రికార్డు రూమ్‌లో భద్రపరిచారు. పెద్దయెత్తున చెత్త, వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఐజిపిలు హరికృష్ణ, రవిప్రకాష్, పాలరాజు, రాజకుమారి, డిఐజిలు అమ్మిరెడ్డి, సెంథిల్ కుమార్, పకీరప్ప, ఎస్‌పిలు శ్రీకాంత్, బి ఉమామహేశ్వర్, కమాండెంట్ నగేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీలు ప్లాంటు కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోండి

- సమ్మె నివారణ చర్యలు చేపట్టండి
- ముఖ్యమంత్రికి వి.శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ స్టీలు ప్లాంటు కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుని, సమ్మె నివారణకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శనివారం ఆయన సిఎంకు లేఖ రాశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రివైవల్ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీవల్ల సంస్థ, కార్మికుల కీలక సమస్యలు పరిష్కారమవుతాయని విశాఖ ఉక్కు కార్మికులు భావించారని కానీ, ఈ నిధులు సంస్థ ఉత్పత్తికి అవసరమైన రామెటీరియల్, కొత్త యంత్రాలు, పాత యంత్రాల మరమ్మతులు, కార్మికుల జీతభత్యాలకు వినియోగించరాదని కేంద్రం ఆంక్షలు పెట్టిందని తెలిపారు. జిఎస్‌టి, బ్యాంకుల రుణాలు, పాత బకాయిలకు రూ.9,346 కోట్లు జమచేసిందని, ఉద్యోగులు, కార్మికులకు ఎనిమిది నెలలుగా సగం జీతాలు మాత్రమే చెల్లిస్తోందని పేర్కొన్నారు. హెచ్‌ఆర్‌ఎ వంటి సదుపాయాలు నిలిపివేసిందని, వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులకు జీతాల బకాయిలున్నాయని తెలిపారు. ప్రభుత్వ చర్యలు ఉత్పత్తికి కారకులైన కార్మికులను, వారి కుటుంబాలను మరింత ఆర్థిక కష్టాల్లోకి నెడుతున్నాయని, ఈ చర్యలను నివారించాలని, కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. సంస్థలో 3వ బ్లాస్ట్ ఫర్నేస్‌ను ప్రారంభించి పూర్తి ఉత్పత్తి సామర్ధ్యంతో ప్లాంట్‌ను నడిపించి లాభాల బాట పట్టిస్తామని కేంద్రం ప్రకటించింది. విశాఖ ఉక్కు లాభాల బాట పట్టాలంటే స్వంతగనులు కేటాయించాలని, దేశంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగ స్టీల్‌ప్లాంట్లకు కేంద్రం స్వంత గనులు కేటాయించిన సంగతి సిఎంకు తెలుసని లేఖలో పేర్కొన్నారు. కేంద్రం కేవలం విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై మాత్రమే వివక్షత చూపుతోందని తెలిపారు. స్వంత గనులు లేక విశాఖ ఉక్కు ప్రతి టన్ను ఉత్పత్తికి రూ.4 నుండి 6 వేలు అదనపు ఖర్చు భరించవలసి వస్తోందని, నష్టాలకు కారకమవుతోందని పేర్కొన్నారు. విశాఖ ఉక్కుకు స్వంత గనులు సాధించాలని సూచించారు. సంస్థ 7.3 మిలియన్ టన్నుల పూర్తి ఉత్పత్తి సాధించాలంటే 19,000 మంది పర్మినెంట్ కార్మికులు అవసరమని, కానీ నేడు 10,900 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. వీరి సంఖ్యను కూడ 9,500 మందికి తగ్గించడానికి పూనుకున్నారని సిఎం దృష్టికి తీసుకువచ్చారు. సంస్థ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను చట్టాలను పూర్తిగా ఉల్లంఘించి సుమారు 3,000 మందిని అమానుషంగా తొలగించారని తెలిపారు. మరో 2,600 మందిని తొలగింపునకు సిద్ధపడ్డారని, ఉత్పత్తిపై దీని ప్రతికూల ప్రభావం ఉంటుందని డిపార్ట్‌మెంటు స్థాయి అధికారులు మొరపెట్టుకుంటున్నా కేంద్ర ఆదేశాలంటూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కార్మికులను తొలగిస్తోందని పేర్కొన్నారు. ఇది ప్లాంట్ ఉత్పత్తికి విఘాతం కలిగించే చర్యని, కార్మికుల తొలగింపులను నిలుపుచేయించాలని కోరారు. తమ సమస్యలపై మీటింగ్‌కు హాజరయ్యారని నలుగురు పర్మినెంట్ కార్మికులను యాజమాన్యం సస్పెండ్ చేసిందని, ఏడుగురు యూనియన్ నాయకులకు షోకాజ్ నోటీసులు ఇచ్చిందని, కాంట్రాక్ట్ కార్మికుల నాయకులను అక్రమంగా తొలగిస్తోందని తెలిపారు. పరిశ్రమ లోపల డిపార్ట్‌మెంట్ స్థాయివరకు రాష్ట్ర పోలీసులను నియమించి కార్మికులపై నిర్బంధం ప్రయోగిస్తున్నదని, రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా స్టీల్‌ప్లాంట్ లోపల ఏనాడూ ఇటువంటి నిర్బంధచర్యలు లేవని, వీటిని వెంటనే నిలిపివేయాలని సూచించారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం భూములు, ఆస్తులు త్యాగాలు చేసిన 8,500 మంది నిర్వాసితులకు నేటికి పర్మినెంట్ ఉపాధి లభించలేదని,వీరి జీవితాలు కడుదుర్భరంగా ఉన్నాయని తెలిపారు. సంస్థలో సుమారు 6,000 ఉద్యోగాల ఖాళీలున్నాయని, వీటిని భర్తీ చేయడం ద్వారా నిర్వాసితులకు పర్మినెంట్ ఉపాధి కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పూనుకుంటే 20 మిలియన్ టన్నుల ఉత్పత్తికి విస్తరించేందుకు అన్ని అవకాశాలు, నైపుణ్యం గల కార్మికులు విశాఖ ఉక్కుకు ఉన్నాయని వివరించారు. ఈ విస్తరణ జరిగితే మరో 20,000 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, విశాఖ ఉక్కు ఏర్పాటుతో 1,00,000 మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉపాధి లభిస్తుందని శ్రీనివాసరావు తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇంతవరకు పన్నులు, డివిడెండ్ల రూపంలో సుమారు రూ.54,000 కోట్లు ఆదాయం సమకూర్చిందని, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం అందిస్తోందని, విశాఖ పట్నం, రాష్ట్ర అభివద్ధికి తలమానికంగా ఉందని పేర్కొన్నారు. 'విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కాపాడుకొని అభివద్ధి చేయడం రాష్ట్ర ప్రయోజనాలకు అత్యంత అవసరం. కేంద్ర ప్రభుత్వంలో కీలకపాత్ర పోషిస్తున్న మీ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దీనికి అనుగుణంగా చర్యలు చేపట్టాలి. కార్మికులు, ప్రజలు కూడా ఇదే ఆశిస్తున్నారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా మీ ప్రభుత్వ పాత్ర ఉండాలి' అని ముఖ్యమంత్రికి లేఖలో శ్రీనివాసరావు సూచించారు.

కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను, కార్మికులకు అభివద్ధిచేసే బదులు మరింత అగాధంలోకి నెడుతోందని, రాష్ట్ర కూటమి ప్రభుత్వం తాము ఆశించిన విధంగా అండగా నిలవడం లేదనే భావన కార్మికులలో నెలకొందని తెలిపారు. దీంతో స్టీల్‌ప్లాంట్ పర్మినెంట్ కార్మికులు మే 20న ఒక రోజు సమ్మెకు, కాంట్రాక్ట్ కార్మికులు మే 20 నుండి నిరవధిక సమ్మెకు సిద్ధపడుతున్నారని పేర్కొన్నారు.

తమను సమ్మెలోకి ప్రభుత్వాలే నెడుతున్నాయని కార్మికులు ఆందోళనతో ఉన్నారని వివరించారు. దీనిపై ముఖ్యమంత్రిగా వెంటనే కలుగజేసుకొని కేంద్రంతో చర్చించి స్టీల్‌ప్లాంట్ మరియు కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించి సమ్మె నివారణకు చర్యలు చేపట్టాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.



గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి

- మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను గడువులోపు పూర్తి చేయాలని అధికారులను గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం నిర్దేశించిన 3 లక్షల ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందించాలని సూచించారు. విజయవాడలోని గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లా అధికారులు నిత్యం లేఅవుట్లలో ఉండి లబ్ధిదారులతో నిర్మాణాలను పూర్తి చేయించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన ఇసుక, సిమెంట్ లబ్ధిదారులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేఅవుట్‌లలో రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. సమావేశానికి హాజరైన అన్ని జిల్లాల గృహ నిర్మాణశాఖ అధికారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణశాఖ ఎమ్‌డి శివప్రసాద్ రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణాల తీరును పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో సిఇ వేణుగోపాల్, సూపరింటెండెంట్ జయరామాచారి, జిఎం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ, వార్డు సచివాలయాలకు పోస్టుల కేటాయింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రేషనలైజేషన్‌లో భాగంగా సచివాలయాల్లో జనాభా సంఖ్య, స్థానిక పరిస్థితుల ఆధారంగా ఆయా సచివాలయాలకు కేటాయించిన పోస్టుల వివరాలను ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాలశాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 15,004 సచివాలయాలను 7,715 గ్రూపు సచివాలయాలుగా రూపొందించారు. పట్టణ ప్రాంతాల్లో వార్డు సచివాలయాలు 4,039, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సచివాలయాలు 10,965 ఉండగా, ఒక్కో గ్రామ సచివాయానికి కనిష్టంగా 4, గరిష్టంగా 7 పోస్టులను, ఒక్కో వార్డు సచివాలయానికి కనిష్టంగా 4, గరిష్టంగా 6 పోస్టులు కేటాయించారు.

అదేవిధంగా ప్రతి గ్రామ సచివాలయానికి ఒక ఎఎన్‌ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లేక ఎనర్జీ అసిస్టెంట్, విఆర్‌ఒ లేక సర్వే అసిస్టెంట్, ప్రతి గూపు సచివాలయానికి ఒక వ్యవసాయ/ఉద్యాన/సెరీకల్చర్ అసిస్టెంట్ (సాగు ఆధారంగా), ఫిషరీస్/వెటర్నరీ అసిస్టెంట్ (లైవ్ స్టాక్ పాపులేషన్ ఆధారంగా) పోస్టులను కేటాయించారు. వార్డు సచివాలయాలకు ప్రతి సచివాలయానికి ఒక ఆరోగ్య కార్యదర్శి, వార్డు ఎమినిటీస్ కార్యదర్శి లేక వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేన్ కార్యదర్శి, వార్డు రెవెన్యూ కార్యదర్శి లేక ఎనర్జీ కార్యదర్శి, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శి పోస్టులను కేటాయించారు.

జిల్లా కలెక్టర్లు రేషనలైజేషన్‌లో ఈ మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రూపు సచివాలయాల వివరాలు, సచివాలయాల వారీ కేటాయించిన పోస్టుల వివరాలను ఉత్తర్వుల్లో పొందుపరిచారు. గ్రామ, వార్డు సచివాలయాలశాఖ కమిషనర్ ప్రతిపాదనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ప్రధాని విశాఖ పర్యటనకు మంత్రులతో కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న విశాఖకు ప్రధాని మోడీ హాజరుకానున్న నేపథ్యంలో, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మంత్రులతో ఆర్గనైజింగ్ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలనాశాఖ ముఖ్యకార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రుల కమిటీలో సభ్యులుగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, వైద్యారోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్, హోంమంత్రి వంగలపూడి అనిత, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ఉన్నారు. మంత్రుల కమిటీకి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు కన్వీనర్‌గా వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రీశాట్ - 1బి కౌంట్‌డౌన్ ప్రారంభం

- నేడు ప్రయోగం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

దేశ సరిహద్దుల్లో నిఘా సామర్థ్యాన్ని, దేశ భద్రతను పెంచే అత్యాధునిక రాడార్ ఇమేజింగ్ ఉపగ్రహం రీశాట్ -1బి ప్రయోగానికి ఇస్రో సన్నద్ధమైంది. పిఎస్‌ఎల్‌వి-సి 61 ద్వారా ఇఒఎస్-09 (రీశాట్-1బి) ఉపగ్రహాన్ని కక్ష్యలోకి మోసుకెళ్లనుంది. ఇందుకు సంబంధించి శనివారం ఉదయం 7.59 గంటల నుంచి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. 22 గంటల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఆదివారం ఉదయం 5.59 గంటలకు ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. ఈ ప్రయోగానికి సంబంధించి శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు శాస్త్రవేత్తలు సుదీర్ఘ సమీక్షలు జరిపారు. జనవరిలో రోదసిలోకి పంపిన ఎన్‌విఎస్-02 ఉపగ్రహం సాంకేతిక సమస్యలు ఏర్పడి నిర్ణీత కక్ష్యలోకి వెళ్లలేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పిఎస్‌ఎల్‌వి-సి61 ప్రయోగంలో ప్రతి అంశాన్ని శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా పరిశీలించారు.



పిఎస్‌ఎల్‌వి - సి61 ఉపయోగాలు

రీశాట్ -1బి ఉపగ్రహంలో అమర్చిన సి-బ్యాండ్ సింథటిక్ అపార్చర్ రాడార్ (సార్) ప్రత్యేకత. ఈ రాడార్ సహాయంతో పగలు, రాత్రి ఎలాంటి వాతావరణ పరిస్థితులైన భూ ఉపరితలాన్ని హై రిజల్యూషన్ ఫొటోలు తీసి పంపనుంది. భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పరిస్థితుల విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితులు నెలకొన్న సమయంలో భారత్ సైనిక దళాలకు వ్యూహాత్మకంగా ఈ రాడార్ ఉపయోగపడనుంది.

ఏలూరు, తిరుమలలో భారీ వర్షం

ప్రజాశక్తి - యంత్రాంగం

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఒక్కసారిగా ఆకాశం మేఘావృత్తమై ఈదురుగాలులతో కూడిన వర్షం ఏలూరు జిల్లా పోలవరం మండలంలో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు పలుచోట్ల భారీ వృక్షాలు రహదారిపై నేలవాలడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ వైర్లు తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు యుద్ధ ప్రాతిపాదికన విద్యుత్‌ను పునరుద్ధరించారు. నేలవాలిన చొట్లను అడ్డుతొలగించారు. తిరుమలలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దాదాపు రెండు గంటలు పాటు వర్షం కురవడంతో యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులు తీవ్రత దృష్ట్యా యాత్రికులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని టిటిడి అధికారులు సూచనలు చేస్తున్నారు. చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, పలమనేరు, గంగవరం, వెదురుకుప్పం, జీడీ నెల్లూరు మండలాల్లోనూ ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం వలన చిన్నచిన్న కుంటలు, చెరువులు నిండాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అల్లూరి జిల్లా చింతపల్లి మండలంలోని చింతపల్లి, లంబసింగి, కొయ్యూరు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. లంబసింగిలో పర్యాటకుల గుడారాలు గాలికి ఎగిరిపోయాయి. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కర్నూలులో సాయంత్రం 5-40 నుంచి గంటల వరకు గంటకు పైగా ఒక మోస్తారు వర్షం పడింది. గుంటూరు జిల్లా తాడేపల్లి, మంగళగిరిలో జల్లులుపడ్డాయి.

20న రాష్ట్ర వ్యాప్త నిరసన, రాస్తారోకో

- పొగాకు, కోకో రైతులకు న్యాయం చేయాలి
- రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 20న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ, మండల కేంద్రాల్లో ర్యాలీలు, నిరసన, రాస్తారోకో కార్యక్రమాలకు విజయవంతం చేయాలని రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల నాయకులు ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. విజయవాడ ఎంబివికెలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎపి రైతు సంఘం నాయకులు వై కేశవరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దడాల సుబ్బారావు, వి శివనాగరాణి, ఎపి కౌలు రైతు సంఘం నాయకులు ఎం హరిబాబు మాట్లాడారు. రాష్ట్రంలో పొగాకు, కోకో పండించిన రైతులకు న్యాయం చేయాలన్నారు. 11 సంవత్సరాలుగా మోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకంగా అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా పాలన చేస్తోందని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానికి ముందే బ్రిటీష్ పాలకులపై పోరాడి సాధించుకున్న హక్కులను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్పొరేట్ కంపెనీలకు కార్మికులను బానిసలుగా మారుస్తోందని విమర్శించారు. రైతులు పండించే అన్ని పంటలకూ సి2ప్లస్50 శాతం ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలకు చట్టం చేయాలని కోరారు. ఎరువులు, విత్తనాలు, డీజిల్, వ్యవసాయ పనిముట్ల ధరలు తగ్గించాలని, వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడి పెంచాలని, రెండు లక్షల వరకూ రైతులకు బ్యాంకు రుణాలు రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత పెట్టుబడి సాయం రూ.20 వేలు తక్షణమే రైతు, కౌలు రైతుల ఖాతాల్లో వేయాలని కోరారు. రాష్ట్రంలో మిర్చి, పత్తి, మినుములు, ధాన్యం, జొన్నలు, కందులు, శనగలు, టమోటా, ఉల్లి వంటి అన్ని పంటలకూ మద్దతు ధర అమలు చేయాలని, రైతుల నుండి కొనుగోలుకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని, వ్యాపారుల మోసాల నుండి రైతులకు రక్షణ కల్పించాలని కోరారు.

భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతుల గుర్తింపు కార్డులు ఇవ్వడానికి నూతన కౌలు చట్టం చేయాలని, అన్ని సంక్షేమ పథకాలు కౌలు రైతులకు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, రోజు కూలీ రూ.600 చేసి పనిదినాలు 200కు పెంచాలని కోరారు. వలస కార్మికుల రక్షణ చట్టం చేయడంతోపాటు, వ్యవసాయ కార్మికులకు రూ.12 వేల కూలీబందు పథకం అమలు చేయాలని, కార్మికులకు కట్టుబానిసలుగా మార్చే నాలుగు లేబర్‌కోడ్లను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. వెనుకబడిన ప్రాంతాల్లో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు పూర్తిచేసి, కరువు నుండి కాపాడాలని, రాష్ట్ర ప్రభుత్వం సోలార్ ప్రాజెక్టులకు భూములు కేటాయింపులను రద్దు చేయాలని కోరారు. సోలార్ కంపెనీల నుండి రైతుల భూములను కాపాడాలని, సెకీతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందం రద్దు చేసుకోవాలని, కరెంటు ఛార్జీలు తగ్గించాలని, ఇళ్లకు, వ్యవసాయానికి స్మార్ట్‌మీటర్లు పెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. పాల రైతులకు పాలసేకరణ ధర లీటరుకు రూ.10 పెంచాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధరల చట్టం తెస్తామని, వ్యవసాయాన్ని కాపాడతామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, బిజెపి హామీ ఇచ్చిందని, రైతులు, కౌలు రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని తెలుగుదేశం ప్రభుత్వం, చంద్రబాబు ప్రకటించారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీ అమలు చేయకుండా మోసం చేశారని తెలిపారు. కౌలు రైతులకు భూ యజమాని సంతకం తొలగించి నూతన కౌలు చట్టం తెస్తామని రాష్ట్ర ప్రభుత్వం గతేడాది కాలంగా ఊరిస్తోంది తప్ప ఆచరణలో ఒక్క అడుగూ ముందుకు పడలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కౌలు రైతులను అసలు గుర్తించడం లేదని వివరించారు. కేంద్ర విధానాల వల్ల గత పదేళ్లలో నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. గ్రామాల్లో పనిలేక వలసలు పోతూ కార్మికులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 20వ తేదీన అన్ని మండల, గ్రామాల్లోనూ నిరసనలు, రాస్తారోకోలు చేపట్టి ప్రభుత్వ కళు తెరిపించాలని విజ్ఞప్తి చేశారు.



స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న జెఎసి నాయకులు

స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమ్మెకు సంఘీభావం

- జెఎసి తీర్మానం

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు ఈ నెల 20న చేపడుతున్న సమ్మెకు అఖిలపక్ష కార్మిక సంఘాల జెఎసి సంఘీభావం తెలిపింది. సిఐటియు జిల్లా కార్యాలయంలో విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు మద్దతుగా ఈ నెల 18న నిర్వాసిత గ్రామాల్లో పాదయాత్రలు, బైక్‌యాత్రలలో పాల్గొనాలని, 19న జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు, కార్మిక కేంద్రాల వద్ద నిరసన తెలపాలని, 20న ఉదయం పది గంటలకు విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన, సభ నిర్వహించాలని నిర్ణయించారు. సమ్మె పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పందనను బట్టి భవిష్యత్తు కార్యాచరణ చేపట్టాలని జెఎసి తీర్మానించింది. పర్మినెంట్ కార్మికులపై, యూనియన్ నాయకులపై అక్రమ సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసులు రద్దు చేయాలని, కాంట్రాక్టు కార్మికుల అక్రమ తొలగింపులు నిలిపివేయాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, స్టీల్ ప్లాంట్ లోపల, బయట రాష్ట్ర ప్రభుత్వ పోలీసుల నిర్బంధం నిలిపివేయాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు ఇవ్వాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం నిలిపివేయాలని, నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని, కార్మికుల జీతభత్యాలు వెంటనే చెల్లించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశానికి జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, వైఎస్‌ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు ఆర్.అనిల్‌కుమార్, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.తిరుపతిరావు, ఎపిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి కె.దేవసహాయం, ఎఐసిటియు జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్‌ఎన్.రాజు, కె.సంతోష్‌కుమార్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు తదితరులు హాజరై ప్రసంగించారు.

ఉపాధ్యాయుల పోరాటానికి సంపూర్ణ మద్దతు

- ఎపిసిపిఎస్ఇఎ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక చేస్తున్న పోరాటానికి ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎపిసిపిఎస్ఇఎ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె సతీష్, సిఎం దాస్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా జిఒ 117 రద్దు కాకుండా రెక్టిఫికేషన్ పేరుతో ఉన్న బడుల సంఖ్యను తొమ్మిది రకాలుగా మార్చి అస్తవ్యస్తమైన నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల విషయంలో అసంబద్ధమైన నిర్ణయాలు తీసుకుంటుందని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయ సంఘాలు కలిసి ఉపాధ్యాయ వేదికగా ఏర్పడి చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ నెల 21, 23 తేదీల్లో నిర్వహించే పోరాటాలకు సిపిఎస్ఇఎ సభ్యులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పవన్ సొంత శాఖలో సిబ్బందికి జీతాల వెతలు

- ఉపాధి సిబ్బందికి రెండు నెలలుగా కష్టాలు
- 7 వేల మందికి రూ.70 కోట్ల మేర బకాయిలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖలోని ఉపాధి హామీ పథకం సిబ్బంది రెండు నెలలుగా జీతాలు అందక అవస్థలు పడుతున్న పరిస్థితి నెలకొంది. పలు ఇతర శాఖల్లో సిబ్బంది సమస్యలు పరిష్కరించిన ఉప ముఖ్యమంత్రి తన సొంత శాఖలో సిబ్బందికి జీతాలు అందకపోయినా సమస్యను పరిష్కరించకపోవడంతో ఉపాధి హామీ సిబ్బంది ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో మొత్తం 7,066 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వీరిలో కాంట్రాక్ ప్రాతిపదికన వివిధ హోదాల్లో 4,703 మంది, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన 1,780 మంది, వాటర్ షెడ్, ఇతర విభాగాల నుంచి ఉపాధి పథకంలోకి వచ్చిన సిబ్బంది మరికొందరు ఉన్నారు. వీరికి మార్చి, ఏప్రిల్ నెలల జీతాలు ఇప్పటి వరకూ అందలేదు. . ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ పరిపాలనా ఖర్చులు (జీతభత్యాల కోసం) ఏటా సుమారు 400 కోట్లు కేటాయిస్తారు. ఈ నిధులను కేంద్రం విడతల వారీగా విడుదల చేస్తోంది. ఆ నిధులతో సిబ్బందికి జీతభత్యాలు చెల్లిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ నిధులు ఒక్క రూపాయి విడుదల కాకపోవడంతో గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధి పథకం సిబ్బందికి జీత భత్యాలు చెల్లించే పరిస్థితి లేకుండా పోయింది. సిబ్బంది పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లినా ఫలితం లేదు. కేంద్ర ప్రభుత్వం నుండి సాంకేతిక సమస్యల వల్ల నిధులు రాష్ట్రానికి విడుదల అవకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని ఉన్నతాధికారులు సిబ్బందికి వివరిస్తున్నారు. రాష్ట్రంలో పరిస్థితిని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెబుతున్నారు. నెలకు రూ.35 కోట్లు చొప్పున రెండు నెలలకు రూ.70 కోట్లు జీతభత్యాల బకాయిలు రాష్ట్ర వ్యాప్తంగా పేరుకుపోయాయి.

రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చేయాలి

ఉపాధి పథకంలో సిబ్బందికి జీత భత్యాల బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం ముందుగా చెల్లించి ఆ నిధులను కేంద్రం విడుదల చేసిన అనంతరం సర్దుబాటు చేసుకోవాలని ఎన్‌ఆర్ఇజిఎస్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమటీ డిమాండ్ చేస్తోంది. ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యాలయంలో ఆయన ఒఎస్‌డిని కలిసి సమస్యను జెఎసి నాయకులు వివరించారు. పరిష్కారానికి పలు సూచనలు ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని నిధులు కేటాయిస్తే సమస్య వెంటనే పరిష్కరం అవుతుందని జెఎసి అంటోంది.

లారీని ఢీకొట్టిన కారు

- ముగ్గురు ఫార్మసీ ఉద్యోగులు దుర్మరణం
- కాకినాడ జిల్లా తునిలో ఘటన

ప్రజాశక్తి - తుని(కాకినాడ జిల్లా)

జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో ముగ్గురు అపోలో ఫార్మసీ ఉద్యోగులు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కాకినాడ జిల్లా తునిలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అపోలో ఫార్మసీ సంస్థలో పని చేస్తున్న కాకినాడ రూరల్ మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన గోనా శివశంకర్, రాజమహేంద్రవరానికి చెందిన గెడ్డం రామరాజు (38), వెంకట సుబ్బారావు, షేక్ హజరత్ అలీ (35), తణుకు పట్టణానికి చెందిన వారాడ సుధీర్ (38) తోపాటు కొందరు యువకులు శుక్రవారం విశాఖలో జరిగిన కంపెనీ సమావేశానికి హాజరయ్యారు. అనంతరం స్వస్థలాలకు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. తుని వద్ద వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో రామరాజు, సుధీర్, షేక్ హజరత్ అలీ అక్కడికక్కడే మృతి చెందారు. వెంకట సుబ్బారావు, శివశంకర్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కాకినాడ జిజిహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలాన్ని డిఎస్‌పి శ్రీహరిరాజు, తుని రూరల్ సిఐ చెన్నకేశవరావు, ఎస్ఐ కృష్ణమాచార్యులు పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదానికి గురైన కారు



స్వామి వారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

వైభవంగా పెన్నహోబిలం రథోత్సవం

- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి - ఉరవకొండ

అనంతపురం జిల్లా పెన్నహోబిలం రథోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉరవకొండ సమీపంలో ఉన్న పెన్నహోబిలం లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రథోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వం తరపున రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పట్టు వస్త్రాలు అందజేశారు. మడుగు తెరు రథోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. రథోత్సవానికి ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన యాత్రికులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

సామాన్యుల చెంతకు అభివృద్ధి ఫలాలు

- అందుకు విద్యార్థులు కృషి చేయాలి : గవర్నర్
- ఘనంగా 'అనంత' జెఎన్‌టియు 14వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అభివృద్ధి ఫలాలు కార్పొరేట్ గదులు దాటి, గ్రామీణ ప్రాంతంలో ఉంటున్న సామాన్యుల చెంతకు చేర్చేందుకు కృషి చేయాలని విద్యార్థులకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఉద్బోధించారు. అనంతపురం జెఎన్‌టియు 14వ స్నాతకోత్సవం యూనివర్సిటీ ఆవరణంలోని ఎన్‌టిఆర్ ఆడిటోరియం హాలులో శనివారం జరిగింది. ఛాన్సలరు హోదాలో గవర్నర్ విచ్చేశారు. ఐఐటి కాన్పూర్ రిటైర్డు ప్రొఫెసర్ ఎంఆర్.మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లారోస్ ల్యాబ్స్ ఫౌండర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ సత్యనారాయణ చావకు గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ అందజేశారు. అనంతరం ఇంజనీరింగ్, ఫార్మసీ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన 41 మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 40,109 మంది విద్యార్థులకు యుజి, పిజి, డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం మనం నాలుగో పారిశ్రామిక విప్లవంలో ఉన్నామని, మిషన్ లర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలెజెన్స్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని ముందుకెళ్లేందుకు విద్యార్థులు సన్నద్ధమవ్వాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. ఆర్ఎం.మాధవ్ మాట్లాడుతూ.. సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు వస్తున్నాయన్నారు. తాము చదువుకుని బయటకొచ్చిన సమయంలో నిర్మాణ రంగంలో భవన నిర్మాణానికి 80 శాతం ఖర్చు అయితే, ఇంటీరియర్‌కు 20 శాతమే ఖర్చు అయ్యేదన్నారు. ఇప్పుడు అందుకు విరుద్ధంగా నిర్మాణం కంటే ఇంటీరియర్ ఖర్చు అధికమవుతోందని వివరించారు. అదే విధంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సులోనూ వేగంగా మార్పులొస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి ఎం.జవహర్‌లాల్, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఎమ్మెల్యేలు పల్లె సింధూరరెడ్డి, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.



స్నాతకోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

శ్రీశైలం డ్యాంపై నిర్లక్ష్యం తగదు

- ముఖ్యమంత్రికి ఇఎఎస్.శర్మ లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

శ్రీశైలం డ్యాం ప్రమాదకర పరిస్థితుల్లో ఉందని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) హెచ్చరించినా చర్యలు చేపట్టకపోవడం విచారకరమని, దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ శనివారం లేఖ రాశారు. శ్రీశైలం డ్యాం ప్రమాదకరంగా ఉందని ఎన్‌డిఎస్‌ఎ ఏడాది క్రితమే హెచ్చరించినా రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ఇంతవరకూ మరమ్మతులు చేపట్టలేదని, ఆలస్యం చేయకుండా మరమ్మతులు చేపట్టాలని తాను మార్చిలో ఒకసారి లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేశారు. శ్రీశైలం డ్యాం కింది వైపు పునాది దగ్గరలో పెద్ద ఎత్తున శిథిలమైన కారణంగా ముప్పు ఉందని సంస్థ ప్రతిపాదించిన కొన్ని తాత్కాలిక మరమ్మతులు 2025 వర్షాకాలం ముందే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టంగా తెలిసినా ఇంతవరకు పనులు చేపట్టకపోవడంపై ఎన్‌డిఎస్‌ఎ ఆందోళన వ్యక్తం చేస్తుందని తెలిపారు. సంబంధిత సంస్థ దీర్ఘకాలిక చర్యల్లో భాగంగా పునాది కింద భౌగోళిక మార్పులపై నిపుణులతో అధ్యయనం చేపట్టాలని సూచించిందని, ఇంతవరకు అటువంటి చర్యలూ లేకపోవడం ఆశ్చర్యంగా ఉందని పేర్కొన్నారు. 2012 వర్షాకాలంలో ఎన్నడూ లేని స్థాయిలో వరదలు వచ్చిన కారణంగా డ్యాం ప్రమాదస్థితికి చేరుకున్న విషయాన్ని గుర్తు చేశారు. గత సమస్యల దృష్ట్యా ఇప్పుడైనా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఒకవేళ శ్రీశైలం డ్యాంకు విపత్తు సంభవిస్తే విజయవాడ, గుంటూరు వంటి నగరాల్లో నివసించే ప్రజలే కాకుండా కొత్తగా నిర్మిస్తున్న అమరావతి కట్టడాలకు కూడా ముప్పు ఉంటుందని తెలిపారు. వాతావరణంలో మార్పుల కారణంగా రాష్ట్రంలో అన్ని నదులకు వర్షాకాలంలో ప్రమాద స్థాయి వరదలు వచ్చే అవకాశముందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని శ్రీశైలం డ్యాంకు వెంటనే మరమ్మతం చేపట్టాలని కోరారు. ఎన్‌డిఎస్‌ఎ హెచ్చరికలకు అనుగుణంగా శ్రీశైలం డ్యాంకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

భూ తగదాలతో దంపతుల దారుణహత్య

ప్రజాశక్తి-రాప్తాడు (అనంతపురం జిల్లా)

భూ తగాదాలతో దంపతులు దారుణ హత్యకు గురైన సంఘటన అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లికి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి (50), ముత్యాలమ్మ (45) దంపతులు. వీరికి గంగులకుంట గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 78/3లో 6.20 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించి గత 26 సంవత్సరాలుగా కోర్టులో కేసు నడిచింది. పొలం విషయంలో ప్రత్యర్థులతో తరచూ వివాదం జరుగుతోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం కొందరు వ్యక్తులు పొలం వద్దకు వెళ్లారన్న విషయం తెలుసుకున్న నారాయణరెడ్డి, ఆయన భార్య ముత్యాలమ్మ, నారాయణ బామ్మర్ది ప్రతాప్‌రెడ్డి పొలం వద్దకు వెళ్లారు. అక్కడ వారి మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో ప్రత్యర్థులు కర్రలు, కత్తులతో దాడి చేయడంతో ముత్యాలమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. నారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు గాయపడిన వారిని అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నారాయణరెడ్డి మరణించారు. ఈ దాడి చేసేందుకు వచ్చిన వ్యక్తులు ఎవరన్న విషయం ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలను పోలీసులు బాధిత కుటుంబ సభ్యులతో కలిసి సేకరిస్తున్నారు. నిందితులు ఎవరన్నిది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

పోలవరం ఎత్తు 45.7 మీటర్ల ప్రకారమే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు

- కాంగ్రెస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు ఎత్తు 45.7 మీటర్ల ప్రకారమే పునరావాస, పునర్నిర్మాణ ప్యాకేజీని ముంపు బాధితులందరికీ వర్తింపజేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ స్వార్ధ రాజకీయాలను పక్కనపెట్టి పోలవరం ప్రయోజనాలను కాపాడాలని కోరారు. ఈ విషయంలో కేంద్రానిది సవతి తల్లి ప్రేమగా పేర్కొన్నారు. ప్రాజెక్టును ఉద్ధరిస్తున్నామని చెబుతున్నవన్నీ పచ్చి అబద్ధాలన్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యాన్ని తగ్గించి విధ్వంసం చేశారని విమర్శించారు. నీటి నిల్వ సామర్థ్యం 119.4 టిఎంసిలకు కుదించి బహుళార్థ సాధక ప్రాజెక్టును కాస్త బ్యారేజీగా మార్చారని ఆరోపించారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీని ఎగ్గొట్టేందుకు ఈ చర్యకు పాల్పడ్డారన్నారు. కేవలం రూ.22 వేల కోట్లు మిగులు కోసం రాష్ట్ర ప్రయోజనాలను బిజెపి ఘోరంగా దెబ్బతీసిందని అన్నారు. 41.15 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేస్తే కుడి, ఎడమ కాలువలకు నీరు పారదనే నిపుణుల హెచ్చరికలు బేఖాతర్ చేస్తున్నారని అన్నారు. ఎత్తు తగ్గింపులో ప్రాజెక్టుకు తీవ్ర నష్టం జరుగుతుంటే కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రయోజనాల కంటే మోడీ ప్రయోజనాలే మిన్నగా మారాయన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఫేజ్-1, 2 వద్దని, డిపిఆర్ ప్రకారం 45.7 మీటర్ల ఎత్తుకు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని, పోలవరంపై ఈ నెల 28న సమీక్ష చేయనున్న ప్రధాని మోడీకి డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వాల్సిందే

- కోకో రైతుల దీక్షల్లో రిటైర్డ్ డిజిపి ఎబి వెంకటేశ్వరరావు డిమాండ్

ప్రజాశక్తి - దెందులూరు (ఏలూరు జిల్లా)

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ కోకో రైతులు ఏలూరు సమీపంలోని సోమవరప్పాడు జాతీయ రహదారి వద్ద ఉన్న మోండలీజ్ కంపెనీ కార్యాలయం, గోడౌన్ వద్ద శనివారం దీక్ష చేపట్టారు. ఎపి కోకో రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర వర్తింపజేసి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం వరకు అంతర్జాతీయ మార్కెట్ ధర అమలు చేసిన కంపెనీలు ఇప్పుడు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. చాక్లెట్ కంపెనీలు రూ.లక్షల కోట్లు లాభాలు గడిస్తూ కోకో పంట సాగు చేస్తున్న రైతులను నష్టాలకు గురిచేయడం దారుణమన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు మాట్లాడుతూ గత రెండున్నర నెలలుగా కోకో రైతులు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నా కంపెనీలు స్పందించకపోవడం అన్యాయమన్నారు. కోకో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. దీక్షల్లో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి అచ్యుతరామయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుడిబండి వీరారెడ్డి, మాజీ జడ్‌పిటిసి సభ్యులు కాసరనేని విద్యాసాగర్, రైతు సంఘం, సిఐటియు నాయకులు, కోకో రైతులు కూర్చున్నారు.



దీక్షల్లో పాల్గొన్న మాజీ డిజిపి ఎబి వెంకటేశ్వరరావు

తాత్కాలిక విరమణ విరమణ

కోకో రైతుల దీక్ష నేపథ్యంలో మోండలీజ్ కంపెనీ వద్ద తహశీల్దార్ సుమతి సమక్షంలో మోండలీజ్ కంపెనీ మేనేజర్ రాజేష్ రామచంద్రన్‌తో రిటైర్డ్ డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు, రైతు సంఘాల నాయకులు చర్చలు జరిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో ధర నిర్ణయంపై కంపెనీ యాజమాన్యం చర్చలకు వస్తారని, ఆందోళన విరమించాలని కోరారు. అయితే, అప్పటి వరకు కంపెనీ కార్యకలాపాలు నిలుపుదల చేయాలని రైతు సంఘాల నాయకులు కోరగా అందుకు కంపెనీ మేనేజర్ అంగీకరించారు. దీంతో రైతులు దీక్షలను తాత్కాలికంగా వాయిదా వేశారు.

ఎన్నికలకు ఏర్పాట్లు చేసుకోండి

- వైసిపి కో-ఆర్డినేటర్ సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడుతోందని, వాటన్నిటినీ దీటుగా ఎదుర్కోవాలని వైసిపి కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కార్యాలయం నుంచి ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో శనివారం మాట్లాడారు. సోమవారం స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు చేసుకోవాలని, పేపర్స్ సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. స్థానిక పరిస్థితులపై సూచనలు, సలహాలపై రీజనల్ కో-ఆర్డినేటర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. న్యాయపరమైన అంశాలపై ముందే నిపుణులతో మాట్లాడాలని చెప్పారు. అనంతరం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుల తోనూ మాట్లాడారు. అందరూ వారికి అప్పగించిన నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి కార్యక్రమాలు మొదలు పెట్టాలని పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎక్కడైనా పార్టీ పరమైన ఇబ్బందులు ఉంటే రీజనల్ కో-ఆర్డినేటర్లతో చర్చించాలని తెలిపారు. మే నెలాఖరు నాటికి పార్టీలో అన్ని స్థాయిల్లో కమిటీలు పూర్తి చేయాలన్నారు.

డిఎస్సీ ప్రత్యేకం-ఎస్ఎ/ఎస్‌జిటి

విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం: గార్డనర్ ప్రజ్ఞా పరీక్షలు



-కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083



యాంత్రిక ప్రజ్ఞ:

-భౌతిక సూత్రాల అవగాహనతో యంత్రాలు, వస్తువులను, పరికరాలను నేర్పుగా, నైపుణ్యంగా, వేగంగా ఉపయోగించ గలిగే సామర్థ్యం. అలాగే చలన కౌశలమును నేర్పుగా అభ్యసించగలిగే సామర్థ్యమే **- యాంత్రిక ప్రజ్ఞ**

హింట్ :

- కండరాలను ఉపయోగించి నైపుణ్యంగా, వేగంగా చేసే పనులన్నింటిలోను యాంత్రిక ప్రజ్ఞ ఉంటుంది.
  నోట్ : థారన్ డైక్ ప్రకారం యాంత్రిక ప్రజ్ఞకు కేంద్రస్థానం**-మధ్య మెదడు**
- వృత్తి పనివారు, క్రీడాకారుల్లో ఈ ప్రజ్ఞ అధికంగా ఉంటుంది. **ఉదా :** ఒక 10 సం॥ల పిల్లవాడు చెడిపోయిన తన కారు బొమ్మను విడదీసి బాగుచేసి మళ్లీ బిగించగలిగాడు. ఇది బాలునిలోని ఏ ప్రజ్ఞను సూచిస్తుంది **- యాంత్రిక ప్రజ్ఞ**
  ఉదా : ఒక క్రీడాకారుడు క్రీడలోని నైపుణ్యాన్ని సులువుగా గ్రహించి ప్రదర్శించడంలోని సామర్థ్యం అతనిలోని ఏ ప్రజ్ఞను సూచిస్తుంది **- యాంత్రిక ప్రజ్ఞ**

3. సాంఘిక ప్రజ్ఞ:

- వ్యక్తి సమాజంలోని ఇతరుల మనోభావాలను అర్థం చేసుకుంటూ నేర్పుగా, తెలివిగా ప్రతిస్పందిస్తూ తన వాక్చాతుర్యంతో ఇతరులను ఆకర్షిస్తూ, తన మాటలతో వారిని ఒప్పిస్తూ, మెప్పిస్తూ మానవ సంబంధాలను మెరుగుపరచుకోగలిగే సామర్థ్యమే **-సాంఘిక ప్రజ్ఞ**
  నోట్ : ఇతరులను ఆకర్షించి, ఒప్పించే సామర్థ్యమే సాంఘిక ప్రజ్ఞ.
- ఇది రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు, సంస్థల అధిపతుల్లో ఎక్కువగా కన్పిస్తుంది.
  ఉదా : ఒక సేల్స్‌మ్యాన్ తన మాటల చాతుర్యంతో కస్టమర్ను ఒప్పించి, తను అమ్మదలచుకున్న వస్తువును కొనిపించడంలో ఉన్న ప్రజ్ఞ/సామర్థ్యం**- సాంఘిక ప్రజ్ఞ**
  ఉదా: రాము అనే విద్యార్థి తన తరగతిలోని ఇతర విద్యార్థులను తన మాటలతో ఆకర్షించి వారిందరినీ ఒప్పించి తరగతి గది నాయకునిగా ఎంపిక కావడంలో ఇమిడి ఉన్న ప్రజ్ఞ**-సాంఘిక ప్రజ్ఞ**
- థారన్ డైక్ ప్రకారం అమూర్త ప్రజ్ఞను, యాంత్రిక ప్రజ్ఞను పరీక్షల ద్వారా మాపనం చేయగలం కానీ సాంఘిక ప్రజ్ఞను మాపనం చేయలేం.

గార్డనర్ బహుళ ప్రజ్ఞా సిద్ధాంతం:

- అమెరికాకు చెందిన హోవార్డ్ గార్డనర్ అనే ప్రముఖ మనోవిజ్ఞాన వేత్త 'బహుళ ప్రజ్ఞా సిద్ధాంతం' ను ప్రతిపాదించారు.
  నోట్ : వీరు అమెరికాలోని హార్వర్డ్ యూనివర్శిటీలో సైకాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ అనేకమంది వ్యక్తులపై పరిశోధనలు చేసి ఈ 'బహుళ ప్రజ్ఞా సిద్ధాంతం'ను ప్రతిపాదించారు.
- ఈ సిద్ధాంతానికిగాను స్వీడన్ ప్రభుత్వం ఇచ్చే 'ప్రిన్స్ ఆఫ్ ఆస్ట్రియా' అనే అవార్డును పొందారు. (నూతన పరిశోధనలు చేసినందుకు శాస్త్రవేత్తలకు ప్రోత్సాహంగా ఇస్తారు)
- 'గార్డనర్' బహుళ ప్రజ్ఞల గురించి వివరిస్తూ రచించిన గ్రంథం ఫ్రేమ్స్ ఆఫ్ ద మైండ్ : **ది థియరీ ఆఫ్ మల్టిపుల్ ఇంటెలిజెన్స్**
- గార్డనర్, ప్రతి వ్యక్తి అనేక అభ్యసన సామర్థ్యాలను, స్వతంత్ర సమాచార ప్రక్రియలను కలిగి ఉంటాడని అవి కాలక్రమంలో బహుళ ప్రజ్ఞలకు దారితీస్తాయని భావించాడు.

గార్డనర్ ప్రకారం ప్రజ్ఞ అనేది సమస్యా పరిష్కార సామర్థ్యమే కాకుండా ఒక సంస్కృతికి చెందిన ఉత్పత్తులను తయారు చేయగలిగే సామర్థ్యం.

గార్డనర్ చెప్పిన 8 రకాల ప్రజ్ఞలు :

1. భాషా ప్రజ్ఞ/శాబ్దిక ప్రజ్ఞ (వర్డ్ స్మార్ట్)
2. గణిత తార్కిక ప్రజ్ఞ (నంబర్ స్మార్ట్)
3. దృశ్య ప్రాదేశిక ప్రజ్ఞ (పిక్చర్ స్మార్ట్)
4. సంగీత ప్రజ్ఞ (మ్యూజిక్ స్మార్ట్)
5. స్వీయ/వ్యక్తంతర్గత ప్రజ్ఞ (సెల్ఫ్ స్మార్ట్)
6. శారీరక గతి సంవేదన ప్రజ్ఞ/కండర స్వర్శ ప్రజ్ఞ (బాడీ స్మార్ట్)
7. సాంఘిక ప్రజ్ఞ, వ్యక్తంతర ప్రజ్ఞ, పరస్పర వ్యక్తిత్వ ప్రజ్ఞ (సోషల్ స్మార్ట్)
8. ప్రకృతి ప్రజ్ఞ/ప్రాకృతిక ప్రజ్ఞ/ సహజ ప్రజ్ఞ (నేచర్ స్మార్ట్)

1.భాషాసంబంధ ప్రజ్ఞ :

- ఒక భాషకు సంబంధించిన సాహిత్యం, వ్యారణాంశాలు, మాండలికాలు మొదలైన వాటిని సులువుగా గ్రహించగలిగే సామర్థ్యం, అభ్యసించగలిగే సామర్థ్యమే భాషా సంబంధ ప్రజ్ఞ
- భాషా సంబంధ సమస్యలను సులువుగా పరిష్కరించగలిగే సామర్థ్యం, భాషా సంబంధ అంశాలను ఉత్పత్తి చేయలిగే సామర్థ్యం.
- పదాలను ప్రయోగించడంలో, ఉపయోగించడంలో, నూతన పదాలను ఉత్పత్తి చేయడంలో వీరు చాలా నేర్పరితనాన్ని కల్గివుంటారు. కనుకనే వీరిని 'పదనేర్పరులు' అంటారు. **ఉదా :** కవులు, రచయితలు, పండితులు, సాహితీవేత్తలు, భాషోపాధ్యాయులు.

2.గణిత తార్కిక ప్రజ్ఞ:

- అంకెలను, సంఖ్యలను, గణిత భావాలను, గణిత సూత్రాలను సులువుగా గ్రహించగలిగే సామర్థ్యం, అభ్యసించగలిగే సామర్థ్యమే గణిత తార్కిక ప్రజ్ఞ.
  -సంఖ్యా రూపంలో ఉండే గణిత సమస్యలను సులువుగా, సమర్థవంతంగా పరిష్కరించగలిగే సామర్థ్యం అలాగే గణిత సమస్యలను నూతనంగా ఉత్పత్తి చేయగలిగే సామర్థ్యం.
- వీరు అంకెలను, సంఖ్యలను ప్రయోగించడంలో సంఖ్యారూప సమస్యలను పరిష్కరించడంలో చాలా నేర్పరితనాన్ని కల్గివుంటారు. కనుక వీరిని సంఖ్యా నేర్పరులు అంటారు..
  ఉదా : గణిత శాస్త్రవేత్తలు, సాంఖ్యక నిపుణులు, అర్థశాస్త్రవేత్తలు, గణితోపాధ్యాయులు

దృశ్య ప్రాదేశిక ప్రజ్ఞ:

- చిత్రాలు, పటాలు, నమూనాలు, డిజైన్లు మొదలగు ద్విజ్యామితీయ, త్రి జ్యామితీయ (2డి, 3డి) రూపంలో ఉండే అంశాలను సులువుగా గ్రహించగలిగే సామర్థ్యం, సులువుగా అభ్యసించగలిగే సామర్థ్యమే దృశ్య ప్రాదేశిక ప్రజ్ఞ.
- పటరూపంలో/చిత్రరూపంలో ఉండే సమస్యలను సులువుగా పరిష్కరించగలిగే సామర్థ్యం. అలాగే సాధారణ సమస్యలను చిత్రరూపంలోకి మార్చగలిగే సామర్థ్యం, నూతన సమస్యలను చిత్రరూపంలో ఉత్పత్తి చేయగలిగే సామర్థ్యం,
  వీరు సమస్యా పరిష్కారంలో పటాలు, చిత్రాలను ఉపయోగించడంలో చాలా నేర్పురులు గనుక వీరిని చిత్రనేర్పరులు అంటారు.
  ఉదా: ఆర్కిటెక్చర్లు, డిజైనర్లు, సివిల్ ఇంజనీర్లు, సర్వేయర్లు, శిల్పులు మొదలగువారు.

4.సంగీత సంబంధ ప్రజ్ఞ:

- సంగీత స్వరాలైన సరిగమలను అలాగే సంగీతంలోని ముఖ్య అంశాలైన శృతి, లయ, రాగం, తాళం లాంటి వాటిని సులువుగా గ్రహించగలిగే, అభ్యసించగలిగే సామర్థ్యమే సంగీత ప్రజ్ఞ.
- సంగీత సంబంధమైన సమస్యలను పరిష్కరించగలిగే సామర్థ్యం, సంగీతంలో నూతన ధ్వనులను ఉత్పత్తి చేయగలిగే సామర్థ్యం
- సంగీత అంశాలను ప్రదర్శించడంలో వీరు చాలా నేర్పరులు కనుక వీరిని సంగీత నేర్పరులు అంటారు.
  ఉదా: గాయకులు, సంగీత కళాకారులు మొదలగువారు.

5. స్వీయ ప్రజ్ఞ / వ్యక్తంతర్గత ప్రజ్ఞ:

- అంతఃపరిశీలన, ఆత్మస్పందన' సామర్థ్యాలతో కూడుకుని వుండేది - వ్యక్తంతర్గత ప్రజ్ఞ.
- వ్యక్తి తన గురించి తాను లోతుగా పరిశీలించుకునే సామర్థ్యం.
- తన బలాలు, బలహీనతలు, శక్తియుక్తులను పూర్తిగా గుర్తెరిగి వాటిని సంపూర్తిగా వినియోగించుకోగలిగే సామర్థ్యం.
- తన మేధస్సును అత్యున్నత స్థాయిలో సమర్థవంతంగా ఉపయోగించుకోగలుగుతూ తన సమస్యలను తానే స్వతంత్రంగా పరిష్కరించుకోగలిగే సామర్థ్యం.
- వీరు తమను తాము అర్థం చేసుకోవటంలోనూ, తమకు అవసరమైన అంశాలను సాధించుకోవటంలోనూ చాలా నేర్పరులు గనుక వీరిని స్వీయ నేర్పులు అంటారు.
  ఉదా : మేధావులు, తత్వవేత్తలు

6. శారీరక గతి సంవేదన ప్రజ్ఞ:

- శారీరక కదలికలను సమర్థవంతంగా ఉపయోగించగలుగుతూ చాలక కృత్యాలు/ చలన కౌశలాలను సులువుగా, నైపుణ్యంగా, సమర్థవంతంగా నిర్వహించగలిగే సామర్థ్యం.
- కృత్యాలను నిర్వహించటంలో శరీరాన్ని చాలా నేర్పుగా ఉపయోగించగలిగే సామర్థ్యాన్ని కల్గివుంటారు. వీరిని శారీరక నేర్పరులు అంటారు.
  ఉదా : వృత్తి పని నిపుణులు, మెకానిక్‌లు, డ్యాన్స్ మాస్టర్స్, యోగా టీచర్లు, ఆపరేషన్ చేసే డాక్టర్లు మొదలైన వారు.

7.సాంఘిక ప్రజ్ఞ /వ్యక్తీంతర ప్రజ్ఞ:

- సమాజంలోని ఇతరుల మనోభావాలను అర్థం చేసుకుంటూ, ఇతరులతో తెలివిగా ప్రవర్తిస్తూ, ఇతరులను ఒప్పిస్తూ, ఇతరులను మెప్పిస్తూ, సాంఘిక సంబంధాలను సమర్థవంతంగా నిర్వహించుకోగలిగే సామర్థ్యమే సాంఘిక ప్రజ్ఞ-
- ఇతరులను అర్థం చేసుకోవటంలోనూ, ఇతరుల సమస్యలను తీర్చడంలో, సామాజిక బాధ్యతలను మోయడంలో, సభ్యులందరినీ ఒకే త్రాటిపైకి తీసుకురావడంలో వీరు చాలా నేర్పరులు గనుక వీరిని సాంఘిక నేర్పరులు అంటారు. ఉదా : రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు, సంఘ సంస్కర్తలు, క్లినికల్ సైకలాజిస్టులు, సంస్థల అధిపతులు,

8. ప్రాకృతిక ప్రజ్ఞ:

- ప్రకృతి నియమాలను, సూత్రాలను, సిద్ధాంతాలను, ప్రకృతిలోని జీవ, నిర్జీవ అంశాలను, వాటి స్థితిగతులను సులభంగా గ్రహించలిగే, అభ్యసించగలిగే సామర్థ్యం.
  'వీరు ప్రకృతి రహస్యాలను అర్థం చేసుకొనుటలో, ప్రకృతికి సంబంధించిన సమస్యలను పరిష్కరించుటలో చాలా నేర్పరులు గనుక వీరిని ప్రకృతి నేర్పరులు అంటారు.
  ఉదా : జీవ శాస్త్రజ్ఞులు, వృక్ష శాస్త్రజ్ఞులు, పర్యావరణ
  నోట్ : గార్డనర్ తన 8 ప్రజ్ఞలలో సాంప్రదాయక ప్రజ్ఞా పరీక్షల ద్వారా కొలవదగిన ప్రజ్ఞలుగా :
  1. భాషా సంబంధ ప్రజ్ఞ
  2. గణిత తార్కిక ప్రజ్ఞ
  3. దృశ్య ప్రాదేశిక ప్రజ్ఞలను భావించారు.

2.2(బి) ప్రజ్ఞా సిద్ధాంతాలు (థియరీ ఆఫ్ ఇంటెలిజెన్సీ)

1.ప్రజ్ఞా ఏక కారక సిద్ధాంతం (యూనిఫ్యాక్టర్-మోనార్కిక్)

- దీనిని
  సంప్రదాయక కారక సిద్ధాంతం
  సాధారణ కారక సిద్ధాంతం
  సామాన్య కారక సిద్ధాంతం
  నియంతృత్వ సిద్ధాంతం అని కూడా పిలుస్తారు
- ప్రజ్ఞా ఏక కారక సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది **-ఆల్ఫ్రెడ్ బినే (ఫ్రాన్స్)**
- దీనిని బలపర్చిన వారు **-లూయిస్ టెర్మన్, విలియం స్టెర్న్**
  నోట్ : -ప్రజ్ఞ గురించి వివరించిన సిద్ధాంతాల్లో మొదటి సిద్ధాంతంగా దీనిని చెప్పుకుంటారు. అందుకే దీనిని ప్రజ్ఞా సంప్రదాయసిద్ధాంతం అని కూడా అంటారు.
- ఈ సిద్ధాంతం ప్రకారం ప్రజ్ఞలో ఉండే కారకాల సంఖ్య-01
- ఈ కారకాన్నే జి-ఫ్యాక్టర్/ సాధారణ కారకం, సామాన్య కారకం అని అంటారు
- ఈ సాధారణ కారకమే అన్ని సామర్థ్యాల్లో కేంద్రకంగా ఉంటుంది. కాబట్టి వ్యక్తిలోని అన్ని సామర్థ్యాలు సమానంగా, ఒకేస్థాయిలో ఉంటాయని ఈ సిద్ధాంతం వివరిస్తుంది.
  ఉదా 1 : సంగీత సామర్థ్యం బాగా ఉన్న బాలసుబ్రహ్మణ్యంలో విద్యాసామర్థ్యం కూడా అదే స్థాయిలో ఉంటుందని భావించే ప్రజ్ఞా సిద్ధాంతం **-ప్రజ్ఞా ఏకకారక సిద్ధాంతం.**
  ఉదా 2 : శ్రీనివాస రామానుజన్ గణితంలో 100 శాతం మార్కులు తెచ్చుకున్నాడు కానీ ఆంగ్లభాషలో ఉత్తీర్ణతా మార్కులు కూడా తెచ్చుకోలేకపోయాడు. ఈ ఉదాహరణలో గణిత సామర్థ్యం, భాషా సామర్థ్యం ఒకేస్థాయిలో ఎందుకు లేవో వివరించలేకపోయిన ప్రజ్ఞాసిద్ధాంతం**-ప్రజ్ఞా ఏకకారక సిద్ధాంతం.**

2.ప్రజ్ఞా ద్వికారక సిద్ధాంతం (బిఐ ఫ్యాక్టర్ థియరీ ఆఫ్ ఇంటెలిజెన్సీ)

- ప్రజ్ఞా ద్వికారక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వారు - ఛార్లెస్ స్పియర్‌మన్ (ఇంగ్లాండ్)
- స్పియర్‌మన్ రచించిన గ్రంథం-ది ఎబిలిటీస్ ఆఫ్ మెన్(మానవ సామర్థ్యాలు)
- ప్రజ్ఞా ద్వికారక సిద్ధాంతం ప్రకారం ప్రజ్ఞలో ఉండే కారకాల సంఖ్య -02
  1.జి.ఫ్యాక్టర్/సాధారణ కారకం, సామాన్యకారకం
  2.ఎస్.ఫ్యాక్టర్/నిర్దిష్ట కారకం, ప్రత్యేక కారకం

1.సామాన్య కారకం

- దీనిని వ్యక్తిలో ఉండే సాధారణ ప్రజ్ఞగా చెప్పుకోవచ్చు
  ఇది అనువంశికంగా సంక్రమిస్తుంది. అనువంశికత వల్ల ప్రభావితమవుతుంది
- ఇది అన్ని సామర్థ్యాల్లో కేంద్రకంగా పనిచేస్తుంది.
- ఇది అన్ని సామర్థ్యాల్లో సమానంగా ఉంటుంది
- దీనిని శిక్షణ ద్వారా మెరుగుపర్చుకోలేము
- దీనిని సాధారణ ప్రజ్ఞా పరీక్షల ద్వారా మాపనం చేయొచ్చు

2.నిర్దిష్ట కారకం

- దీనిని వ్యక్తిలో ఉండే నిర్దిష్టమైన, ప్రత్యేకమైన ప్రజ్ఞగా గుర్తిస్తారు
  ఇది పరిసరాల వల్ల ప్రభావితమవుతుంది
- ఇది అన్ని సామర్థ్యాల్లో వేర్వేరుగా ఉంటుంది
- ఇది సామర్థ్యానికి, సామర్థ్యానికి మారుతూ ఉంటుంది
  దీనిని శిక్షణ ద్వారా మెరుగుపర్చుకోవచ్చు
- దీనిని నిర్దిష్ట, ప్రత్యేక పరీక్షల ద్వారా మాపనం చేయొచ్చు.
  ఎయిమ్ : ఈ సిద్ధాంతం ప్రకారం ప్రతి సామర్థ్యంలో జి.కారకం, ఎస్.కారకం రెండూ ఉంటాయి.

రేపు : వ్యాధి విజ్ఞాన శాస్త్రం

సంపాదకీయం

మాటల మాటున...!

హార్వర్డ్ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర ప్రొఫెసర్లు స్టీవెన్ లెవిట్స్కీ, డేనియల్ జిబ్లాట్ రచించిన 'హౌ డెమొక్రసీస్ డై (ప్రజాస్వామ్యాలు ఎలా పతనమవుతాయి)' అన్న పుస్తకంలో ప్రపంచ వ్యాప్తంగా సాగుతున్న ప్రజాస్వామ్య వ్యతిరేక పోకడలను, ప్రజాస్వామిక వ్యవస్థలను నిర్వీర్యం చేసే పాలకుల వ్యవహార శైలిని విశ్లేషించారు. ప్రజాస్వామ్యం పతనమౌతున్న ప్రతి చోటా పాలకుల విద్వేషం, అసహనం అనేక రూపాల్లో బట్టబయలౌతుంది. 'అసహనం.. అజ్ఞానం యొక్క మొదటి రూపం' అంటారు ఐన్‌స్టీన్. దేశం భావోద్వేగంలో వున్నప్పుడు కొందరు పనిగట్టుకొని సమాజంలో చీలికలు తెచ్చే ప్రయత్నం చేస్తుంటారు. ఉద్వేగపూరిత ప్రసంగాలతో భయంకరమైన విద్వేష బీజాలు నాటుతుంటారు. పైకి గౌరవంగా మాట్లాడినట్లు నటిస్తూనే తమ అసలు ఉద్దేశాన్ని విషపూరిత మోసకారి మాటల మాటున కప్పెడుతుంటారు. 'దేశమే ముందు..' అని నీతులు చెబుతూనే, మోడీ ముందు అందరూ బలాదూర్ అంటారు. దేశమైనా, సైన్యమైనా మోడీ పాదాలకు మొక్కాల్సిందేనని హుకుం జారీ చేస్తారు. నోటి తుత్తరతో విద్వేషం రగిలించే మాటలు విసరడం, ఆ తర్వాత దాన్ని సమర్థించుకోడం, మరీ తప్పుదు అంటే కంటితుడుపు క్షమాపణలతో సరిపెట్టడం పరిపాటిగా మారింది.

గోబెల్స్ తరచుగా ఒక నిర్దిష్ట వర్గాన్ని 'శత్రువులు', 'దేశద్రోహులు' అని ముద్ర వేసేవాడు. సాధారణ ప్రజల్లో భయాన్ని, ఆగ్రహాన్ని కలిగించడానికి తప్పుడు సమాచారాన్ని, అతిశయోక్తులను ప్రయోగించేవాడు. 'ఒక అబద్ధాన్ని పదే పదే చెబితే అది నిజం అవుతుంది' అన్న సూత్రాన్ని నమ్మి, నిరాధారమైన ఆరోపణలు, తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించేవాడు. అతడి మాటలు పైకి చాలా ఆకర్షణీయంగా అనిపించినా... ఆ మాటల మాటున భయంకరమైన విద్వేషం దాగివుండేది. గోబెల్స్‌కు జిరాక్స్ కాపీగా మారిన శక్తులు... ఇప్పుడు ఆ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. ప్రజల్లోని ఒక సెక్షన్‌ను దేశద్రోహులుగా, శత్రువులుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. చారిత్రక సంఘటనలను సైతం వక్రీకరించి విద్వేషాన్ని నింపుతున్నారు. తాజాగా ఆపరేషన్ సిందూర్‌లో కీలకంగా వ్యవహరించిన కల్నల్ సోఫియా ఖురేషీని అప్రతిష్టపాలు చేసేలా 'ఉగ్రవాదుల సోదరి' అంటూ మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి, బిజెపి సీనియర్ నేత విజయ్‌షా అనుచిత వ్యాఖ్యలు చేశారు. 'యావత్ దేశం, సైన్యం ప్రధాని మోడీకి శిరస్సు వంచి పాదాలకు నమస్కరించింది' అని మొత్తం సైన్యాన్ని అవమానించేలా ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరింత దిగజారుడుతనంగా, జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేశారు. షా వ్యాఖ్యలపై మధ్యప్రదేశ్ హైకోర్టు స్పందించినా, సుప్రీంకోర్టు నిందించినా బిజెపి గాని, ప్రధాని గాని స్పందించలేదు. ఈ వ్యాఖ్యలు చేసినవారిపై చర్య తీసుకోడానికి బదులు, ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం అంటూ బిజెపి 'తిరంగా యాత్రలు' చేస్తోంది.

గతంలో నసీరుద్దీన్ షా, కవి నిర్మాత గుల్జార్, హీరో షారుఖ్ ఖాన్ వంటి వారిపై బిజెపి ప్రముఖులే ఇదే తరహా విషం కక్కిన విషయం తెలిసిందే. ఈ అన్ని సందర్భాల్లోనూ ప్రధాని మోడీ మౌనం వహించడం ద్వారా వారి నాయకుల ప్రకటనలతో తాను ఏకీభవిస్తున్నట్లుగా సంకేతమిస్తున్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశవ్యాప్తంగా చెలరేగిన ఉద్వేగం, ఉద్రేకాన్ని అవకాశంగా తీసుకొని, మతోన్మాదులు, యుద్ధోన్మాదులు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టాలని ఎంత ప్రయత్నించినా... దేశమంతా ఒక్క తాటిపై నిలిచింది. 'భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ బలం' అన్న స్ఫూర్తిని ప్రపంచానికి చాటింది. ఈ ఐక్యత గిట్టని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్... విద్వేషాలు పెంచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రజల ఐక్యతను చీల్చే ఈ మాటలు, వాటి వెనుక దాగిన విషాన్ని గుర్తించడమే ప్రజల వివేకం. 'ఏ నినాదం వెనుక ఎవరి స్వార్థ ప్రయోజనాలు దాగి వున్నాయో తెలుసుకోలేనంత కాలం ప్రజలు మోసపోతూనే వుంటార'ని అంటారు లెనిన్. ప్రస్తుత పరిస్థితుల్లో కులం, మతం, ప్రాంతం, భాష వంటి ఏ తేడా లేకుండా భారతీయులందరమూ ఒక్కటే అన్న రీతిలో సమైక్యతా నాదం వినిపించాలి.

నివాళి



ప్రతి ఒక్కరి జీవితంలోనూ... ప్రతి ఒక్క సమస్య కూడా... రాజకీయాలతో ముడిపడి వుంటుంది. విడదీసి వేరుగా చూడడం సాధ్యం కాదు. అలా ప్రయత్నించడం వల్ల ప్రయోజనం లేదు. వాస్తవాన్ని దాచడానికి పూనుకోవడం తప్ప మరేమీ కాదు.

- పుచ్చలపల్లి సుందరయ్య

జననం : 1.5.1913

మరణం : 19.5.1985

రాష్ట్రాలపై స్వారీకే రాష్ట్రపతి లేఖ

ప్రస్తుతం





తెలకపల్లి రవి

రాజ్యాంగపరమైన అనిశ్చిత పరిస్థితికి కారణమవుతున్న ఒక సుదీర్ఘ సమస్యపై అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన నిర్దేశం చేస్తే దాని అమలుకు చర్యలు తీసుకోవాలి. కాని నరేంద్ర మోడీ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. గవర్నర్ల పాత్రపై సుప్రీంకోర్టు ఆదేశాల అమలుకు బదులు అలా తీర్పునిచ్చే అధికారం ఉందా లేదా తేల్చమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ద్వారా శరవేగంగా 14 ప్రశ్నలు సంధింపజేసింది. పేరుకు రాష్ట్రపతి రాసిందైనా ఈ వ్యవహారం మొత్తం కేంద్రం కనుసన్నల్లోనే జరిగింది. రాజ్యాంగపరంగా కూడా భారత రాష్ట్రపతి అలంకార ప్రాయమైన అధినేత మాత్రమే. ఏప్రిల్ 8వ తేదీన గవర్నర్ల విషయమై సుప్రీంకోర్టు తీర్పు రాగా ఆ మరుసటి రోజునే కేంద్రం దానికి ఎలా విరుగుడు చేయాలనే మంతనాలు ప్రారంభించింది. అటార్నీ జనరల్ ఆర్.వెంకట రమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఇంకా న్యాయశాఖ ప్రతినిధులతో విస్తారంగా చర్చలు సాగించారు. చివరకు మే ఏడవ తేదీ నాటికి రాష్ట్రపతి సుప్రీంకోర్టుకు సమర్పించే ప్రశ్నావళి ప్రస్తావనను ఖరారు చేశారు. మొదట ఈ తీర్పుపై సమీక్ష కోరాలా లేక మరింత విస్తృత ధర్మాసనం కోరాలా అని తర్జనభర్జనలు జరిపారు. రాజ్యాంగం 143(1) అధికరణం కింద రాష్ట్రపతి పేరిట సలహా కోరడమే ఉపయోగకరమని నిర్ణయానికి వచ్చారు. ఎందుకంటే రాష్ట్రపతి కోరిన అంశాన్ని పరిశీలించడానికి ఐదుగురు సభ్యుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేయటం పరిపాటి. అయితే అసలు ఈ అంశంపై అభిప్రాయం చెప్పాలా వద్దా అని కూడా సుప్రీంకోర్టు తన నిర్ణయానికి తాను రావచ్చు. ఉదాహరణకు బాబ్రీ మసీదు/రామ జన్మభూమి వివాదంలో విధ్వంసం తర్వాత పి.వి.నరసింహారావు ప్రభుత్వం సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరింది. అయితే ఈ విషయంలో తాము అభిప్రాయం చెప్పగలిగింది లేదని, రాజకీయ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్ధారించింది.

గత ఉదాహరణలు

1960లో సి జాబితాలోని రాష్ట్రాల ప్రతిపత్తిపై సూచనలు కోరింది కేంద్రం. పాకిస్తాన్‌తో ప్రాదేశిక భూభాగంపై ఒప్పందం చేసుకోవచ్చునన్న విషయం 1951లో సుప్రీంకోర్టు అభిప్రాయం కోరింది. 1978లో ఎమర్జెన్సీ తర్వాత ఆ అత్యాచార కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయవచ్చునా అన్న అంశంపై అభిప్రాయం కోరింది. వీటిపై చెప్పడం లేదా ఒకటి రెండుసార్లు నిరాకరించటం జరిగింది. రాజ్యాంగం 142 అధికరణం ప్రకారం సుప్రీంకోర్టు మాత్రమే అందులోని నిబంధనల అమలుకు చెల్లుబాటుపై తుది మాట చెప్పవలసి ఉంటుంది. రాజ్యాంగ మౌలిక స్వభావం అన్న తీర్పు తర్వాత ఇది మరింత బలపడింది. అదే సమయంలో 143(1) అధికరణం రాష్ట్రపతికి సుప్రీంకోర్టు అభిప్రాయం కోరే అధికారం ఇస్తుంది. కాకపోతే ప్రస్తుతం ద్రౌపది ముర్ము పంపిన ప్రస్తావన కేవలం రాజ్యాంగ నిబంధనల అనువర్తింపునకే కాక రాజకీయ సంఘర్షణకు, రాజ్యాంగ ప్రతిష్టంభనకు కూడా దారితీసే ప్రమాదం ఉంది.

తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి ఆ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన పది బిల్లులను అంతులేని జాప్యంతో అట్టి పెట్టుకోవడం సుప్రీంకోర్టు విచారించింది. తమ ముందుకు వచ్చిన బిల్లులపై మూడు మాసాలలోగా ఆమోదం లేదా నిరాకరణ చేయవలసి ఉంటుందని తేల్చి చెప్పింది. ఒకవేళ రాష్ట్రపతి పరిశీలనకు పంపేట్లయితే అప్పుడు కూడా మూడు మాసాల్లో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని నిర్దేశించింది. దాంతో రాష్ట్రపతికి సుప్రీంకోర్టు ఎలా ఆదేశాలిస్తుందని దీనిపై చాలామంది అభ్యంతరాలు లేవనెత్తారు. ఇప్పుడు రాష్ట్రపతి పంపిన 143(1) ప్రస్తావన కూడా అలాంటి ప్రశ్నలే ముందుకు తెచ్చింది. రాజ్యాంగంలోని 200వ అధికరణం గవర్నర్ పరిధిని చెప్తుంది. 21వ అధికరణం శాసనసభ ఆమోదించిన బిల్లుల అంగీకారం ముద్ర గురించి చెప్తుంది. ఇందుకు సంబంధించి మరి ఏ విధమైన నిర్దేశాలు లేనప్పుడు మూడు మాసాలలోనే పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ఎలా చెప్తుందనేది ప్రశ్నల సారాంశం.

> **వాస్తవానికి చాలా మంది వాదిస్తున్నట్టు ఇక్కడ సుప్రీంకోర్టు రాష్ట్రపతి లేదా గవర్నర్‌లను ఏం చేయాలో ఏ విధంగా నిర్ణయం తీసుకోవాలో ఆదేశించలేదు. తమకు నచ్చిన నిర్ణయం తీసుకోవడానికి మూడు మాసాల వ్యవధి ఉండాలని మాత్రమే చెబుతున్నది. ఈ విధంగా చేయడం రాజ్యాంగ స్ఫూర్తిని నొక్కి వక్కాణించేదే కానీ అందుకు భిన్నంగా చెప్పింది కాదు. ఈ గడువు కూడా గతంలో ఇందిరా గాంధీ హయాంలో సర్కారియా కమిషన్, వాజ్‌పేయి హయాంలో పూంచ్ కమిషన్ లకు ఆధ్వర్యం వహించిన మాజీ న్యాయమూర్తులు చెప్పిందే. ఇంతకంటే సూటిగా గతంలో రెండు మూడు సందర్భాల్లో ఉన్న అత్యున్నత న్యాయస్థానం రాష్ట్రపతి విధివిధానాలపై నిర్దేశాలు ఇచ్చాయి.**

పెత్తనానికి పగ్గాలు

వాస్తవానికి చాలా మంది వాదిస్తున్నట్టు ఇక్కడ సుప్రీంకోర్టు రాష్ట్రపతి లేదా గవర్నర్‌లను ఏం చేయాలో ఏ విధంగా నిర్ణయం తీసుకోవాలో ఆదేశించలేదు. తమకు నచ్చిన నిర్ణయం తీసుకోవడానికి మూడు మాసాల వ్యవధి ఉండాలని మాత్రమే చెబుతున్నది. ఈ విధంగా చేయడం రాజ్యాంగ స్ఫూర్తిని నొక్కి వక్కాణించేదే కానీ అందుకు భిన్నంగా చెప్పింది కాదు. 2016లో రాష్ట్రపతికి మూడు నెలల కాలపరిమితిని నిర్ణయిస్తూ జారీ చేసిన రెండు ఆఫీస్ మెమోరాండమ్ (ఓ.ఎం)ల ద్వారా హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంహెచ్ఎ) జారీ చేసిన మార్గదర్శకాల మేరకే అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి మూడు నెలల్లోగా ఆమోదించాలనే గడువు విధిస్తూ ఏప్రిల్ 8న తీర్పు ఇచ్చినట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ గడువు కూడా గతంలో ఇందిరా గాంధీ హయాంలో సర్కారియా కమిషన్, వాజ్‌పేయి హయాంలో పూంచ్ కమిషన్ లకు ఆధ్వర్యం వహించిన మాజీ న్యాయమూర్తులు చెప్పిందే. ఇంతకంటే సూటిగా గతంలో రెండు మూడు సందర్భాల్లో ఉన్న అత్యున్నత న్యాయస్థానం రాష్ట్రపతి విధివిధానాలపై నిర్దేశాలు ఇచ్చాయి. 1994లో ఎస్.ఆర్.బొమ్మై కేసులో రాష్ట్ర ప్రభుత్వాల రద్దు, రాష్ట్రపతి పాలన విధింపుకు సంబంధించి అప్పటివరకు జరిగిన ఏకపక్ష పోకడలకు సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేసింది. మరణశిక్ష పడిన ఖైదీల క్షమాభిక్ష దరఖాస్తులపై నిర్ణయం తీసుకోవడానికి కూడా నిర్ణీత గడువును సుప్రీంకోర్టు నిర్దేశించింది. ఆ తీర్పు తర్వాత అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ శరవేగంగా నిర్ణయాలు తీసుకోవటం మనం చూశాం. అప్పుడెప్పుడూ లేని అభ్యంతరం ఇప్పుడే ఎందుకు వచ్చినట్టు!

ఈ ప్రస్తావన పంపడానికి ముందే ఉపరాష్ట్రపతి జగదీప్ కోర్టుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రపతిని తక్కువ చేయటంలా చిత్రించారు. ఆయన మాటలు కేంద్రం వైఖరికి ప్రతిధ్వనులేనని ఇప్పుడు స్పష్టం అవుతున్నది. మోడీ హయాంలో అనేక రాష్ట్రాలలో నియమితులైన గవర్నర్లు అత్యుత్సాహంతో ప్రత్యక్ష రాజకీయ పాత్ర పోషిస్తూ అపర సైంధవుల్లా బిజెపి యేతర ప్రభుత్వాలను ముప్పుతిప్పలు పెడుతున్నారు. కేరళలో ఆరిఫ్ మహ్మద్ ఖాన్, తమిళనాడులో ఆర్.ఎన్.రవి, తెలంగాణలో లోగడ తమిళి సై, బెంగాల్‌లో ఇదే జగదీప్ ధంకర్, త్రిపురలో తథాగత రాయ్ వంటి గవర్నర్లు కేంద్రం ఏజంట్లుగా వ్యవహరించారు. అన్నిచోట్లా లెక్కలేనన్ని బిల్లులు కదలిక లేకుండా పడి ఉన్నాయి. కాంగ్రెస్ హయాంలోనూ గవర్నర్ల దుర్వినియోగం, ప్రభుత్వాల రద్దు జరిగినప్పటికీ మోడీ పాలనలో ఒక విధంగా అది పరాకాష్టకు చేరింది. ఎడతెగని ఈ సంఘర్షణకు సుప్రీంకోర్టు నిర్దేశం స్వస్తి పలుకుతుందని అందరూ ఆశించారు. కానీ రాష్ట్రపతి పదవిని ఉపయోగించుకుని కేంద్రం అందుకు చక్రం అడ్డువేస్తున్నది. ఈ విధంగా తన నిరంకుశ ఏకపక్ష పెత్తనాన్ని సాగించుకోవడమే బిజెపి ఉద్దేశంగా స్పష్టమవుతుంది. సమాఖ్యతత్వం భారత రాజ్యాంగం మౌలిక లక్షణాల్లో ఒకటైనప్పుడు ప్రజలు ఎనుకున్న ప్రభుత్వాలను శాసనసభల నిర్ణయాలను గౌరవించటం రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం. అందుకు పూర్తి భిన్నంగా కేంద్రీకత పద్ధతిలో ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే పార్టీ, ఒకే మోడీ, ఒకే మతం అన్న తరహాలో నడుస్తున్న విపరీత పరిస్థితికి ఇది తాజా ఉదాహరణ. రాజకీయాలకు అతీతంగా రాజ్యాంగపరమైన అత్యున్నత పదవిగా వారు చెబుతున్న రాష్ట్రపతి స్థానాన్ని ఉపయోగించుకొని రాజ్యాంగంపైన దాడికి తెర తీయడం మోడీ వ్యూహం. ఇప్పుడు దీనివల్ల అమలు ఆగిపోతుందనే సందేహం చాలా మందిలో ఉంది. కేంద్రం కోరుకునేది కూడా అదే. అనాలోచితంగా దీన్ని సుప్రీంకోర్టు సీమోల్లంఘన చేసినట్టు చిత్రించడం వాస్తవాలను తలకిందులు చేయటమే. అనేక అధ్యయనాలు, నివేదికలు నిబంధనలు ఉటంకిస్తూనే సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. ఆ తీర్పులోనే దాని అభిప్రాయం వుంది.

సంధి దశలో కీలక కేసులు

ఈ విషయంలో తుది నిర్ణయం ఎలా ఉంటుందన్న అంశం అట్టిపెట్టి ప్రస్తుత సందర్భాన్ని తీసుకుంటే మరింత తీవ్రమైన రాజకీయ సంకేతాలు గోచరిస్తాయి. మే 14వ తేదీన నూతన ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)గా జస్టిస్ బి.ఆర్.గవాయ్ ప్రమాణ స్వీకారం చేశారు. నవంబర్ 23వ తేదీ వరకు మాత్రమే ఆరు నెలల పాటు ఆయన పదవిలో ఉంటారు. గతంలో ఆయన 'న్యూస్ క్లిక్' కేసులను, ఢిల్లీ మాజీ మంత్రి శిశోడియా, తీస్తా సెతల్వాద్ తదితర కేసులలో ప్రాథమిక హక్కులకు అనుకూలమైన తీర్పునిచ్చారు. ఎన్నికల బాండ్ల రద్దు తీర్పులో పాలుపంచుకున్నారు. రాహుల్ గాంధీ పరువు నష్టం కేసులో ఉపశమనం ఇచ్చారు. తన కుటుంబ నేపథ్యం బట్టి రాహుల్ కేసు విచారణ నుంచి తప్పుకుంటాననంటే కేంద్రం అడిగిన మేరకు కొనసాగారు. మొత్తంపై సిజెఐ గవాయ్ సామాజిక న్యాయం ప్రాథమిక హక్కులకు అనుకూలంగా అనేక తీర్పులు ఇవ్వడం, ఆ ధర్మాసనాల్లో ఉండడం సంభవించింది. వ్యక్తిగతంగా ఆయన రిపబ్లికన్ పార్టీ వ్యవస్థాపకుడైన ఆర్కే గవాయ్ కుమారుడు. యుపిఎ హయాంలో ఎమ్మెల్సీగా, ఎంపీగా గవర్నర్‌గా అనేక బాధ్యతలు నిర్వహించిన ఆర్కే గవాయ్ దళిత ఉద్యమంలో ముఖ్య పాత్రధారి. తను దేశానికి మొదటి బౌద్ధ నేపథ్యంగల న్యాయమూర్తినని సిజెఐ గవాయ్ ప్రకటించారు. దళితుడిగా ఈ పదవిలోకి వచ్చిన రెండవ వ్యక్తి ఆయన. భారతదేశం బహుళ మతాలు, సంస్కృతులు, రాజకీయాలు, ప్రాంతాలు వంటి వైవిధ్యాలతో కూడిన దేశమని ఇది న్యాయ వ్యవస్థలో ప్రతిబింబించాలని నియామకం తర్వాత తొలుతనే ప్రకటించారు. సుప్రీంకోర్టు సూపర్ పార్లమెంటు కాకూడదని, పార్లమెంటు ఉత్కృష్టమైందని ఉపరాష్ట్రపతి చేసిన వ్యాఖ్యలను పదవి స్వీకారానికి ముందే తోసి పుచ్చారు. రాజ్యాంగమే అందరికీ సర్వోన్నతమైనదని నొక్కి చెప్పారు. అంబేద్కర్ వాదంతో ఆరంభం నుంచి కొనసాగుతున్న గవాయ్ ఆయన ఇచ్చిన రాజ్యాంగం వల్లనే మోడీ ప్రధానమంత్రి కాగలిగారని, తాను ప్రధాన న్యాయమూర్తినయ్యానని చెప్పారు.

ఇప్పుడు ఆయన ముందు కొత్త వక్ఫ్ చట్టం, ప్రార్థనా స్థలాల చట్టం కేసు ఇంకా అనేకం ఉన్నాయి. ఇవి దేశ రాజకీయాలనే కాక సామాజిక మత సంబంధాలను కూడా నిర్దేశించగలవే. వాస్తవానికి వక్ఫ్ చట్టంపై కేసు దిగిపోయిన సిజెఐ సంజీవ్ ఖన్నా ముందు వుండింది. ప్రాథమికంగా దానికి అభ్యంతరాలు చెప్పి కేంద్రం చర్యలు తీసుకోకుండా నిలవరించిన జస్టిస్ ఖన్నా తన పదవీ కాలం ముగుస్తుంది కనుక ఈ కేసు విచారణ రాబోయే వారికి అప్పగిస్తానని ప్రకటించారు. మరి ఆరు మాసాల వ్యాధిలో సిజెఐ దాన్ని పూర్తి చేయగలరేమో చూడాలి. కీలకమైన ఇన్ని కేసులు చూడవలసిన తరుణంలో రాష్ట్రపతి ప్రస్తావన రూపంలో కేంద్రం తన ప్రతికూలతను ప్రకటించడం ముందరి కాళ్ళకు బంధం వేస్తుందా అనే ప్రశ్న తప్పక వస్తుంది. రాజ్యాంగంపై దాడి అన్నది మోడీ ప్రభుత్వానికి పరిపాటి. కానీ ఇప్పుడు ఈ విషయంలో ఏకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునే ఆక్షేపించటం అంటే రాష్ట్రాల హక్కులను అనుమతించడానికి కేంద్రం సిద్ధంగా లేదన్న మాట. రాష్ట్రపతి ప్రశ్నల పేరుతో రాష్ట్రాల హక్కులను గవర్నర్ల చేతిలో పెట్టడం మాత్రం సరైనది కాదు. ఇన్ని అంశాలపైన భవిష్యత్ సవాళ్లపైన సిజెఐ గవాయ్ ఎలా స్పందిస్తారో, న్యాయ వ్యవస్థ గమనం ఎలా ఉంటుందో చూద్దాం.

> **మోడీ హయాంలో అనేక రాష్ట్రాలలో నియమితులైన గవర్నర్లు అత్యుత్సాహంతో ప్రత్యక్ష రాజకీయ పాత్ర పోషిస్తూ అపర సైంధవుల్లా బిజెపి యేతర ప్రభుత్వాలను ముప్పుతిప్పలు పెడుతున్నారు. కేరళలో ఆరిఫ్ మహ్మద్ ఖాన్, తమిళనాడులో ఆర్.ఎన్.రవి, తెలంగాణలో లోగడ తమిళి సై, బెంగాల్‌లో ఇదే జగదీప్ ధంకర్, త్రిపురలో తథాగత రాయ్ వంటి గవర్నర్లు కేంద్రం ఏజంట్లుగా వ్యవహరించారు. అన్నిచోట్లా లెక్కలేనన్ని బిల్లులు కదలిక లేకుండా పడి ఉన్నాయి. కాంగ్రెస్ హయాంలోనూ గవర్నర్ల దుర్వినియోగం, ప్రభుత్వాల రద్దు జరిగినప్పటికీ మోడీ పాలనలో ఒక విధంగా అది పరాకాష్టకు చేరింది. ఎడతెగని ఈ సంఘర్షణకు సుప్రీంకోర్టు నిర్దేశం స్వస్తి పలుకుతుందని అందరూ ఆశించారు కానీ రాష్ట్రపతి పదవిని ఉపయోగించుకుని కేంద్రం అందుకు చక్రం అడ్డువేస్తున్నది. ఈ విధంగా తన నిరంకుశ ఏకపక్ష పెత్తనాన్ని సాగించుకోవడమే బిజెపి ఉద్దేశంగా స్పష్టమవుతుంది.**

సందర్భం

అవగాహనే ఔషధం

హెచ్ఐవి-ఎయిడ్స్‌కు కొంత వరకు చికిత్స, నివారణ మార్గాలు ఉన్నప్పటికీ నేటికీ ఒక నిర్దిష్టమైన టీకా అందుబాటులోకి రాలేదు. ఏ క్షణంలోనైనా హెచ్ఐవి-ఎయిడ్స్ టీకా అందుబాటులోకి రావచ్చని పరిశోధకులు, వైద్యులు, వైద్య ఆరోగ్య నిపుణులు వాగ్దానం చేస్తున్నప్పటికీ ఆ టీకా వార్త మాత్రం వాస్తవ రూపం దాల్చడం లేదు. నేటికీ ఇదొక ప్రధాన ప్రజారోగ్య సమస్యగా పౌర సమాజాన్ని పట్టి పీడిస్తున్నది. ఇవాళ్టికీ దక్షిణ ఆఫ్రికాలో 7.7 మిలియన్ల హెచ్ఐవి-ఎయిడ్స్ రోగులు ఉన్నారని, ప్రపంచవ్యాప్తంగా 39.9 మిలియన్ల అభాగ్యులు దీని విష వలయంలో చిక్కి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నారని తెలుసుకోవాలి. నేటికీ హెచ్ఐవి-ఎయిడ్స్ రోగంతో పాటు క్యాన్సర్, డెమెన్షియా, పార్కిన్సన్, ఆస్తమా లాంటి పలు వ్యాధులకు నిర్దిష్టమైన చికిత్సలు కాని, టీకాలు కాని అందుబాటులో లేవు. ఉపశమన దక్షత మాత్రమే కలిగించే చికిత్సలు ఉన్నాయి. హెచ్ఐవి-ఎయిడ్స్ టీకా రూపొందిం చడంలో ప్రతిబంధకాలు నిధుల కొరత, అపోహలు, సమాచార కొరత లాంటివి నిలుస్తున్నాయి. శాస్త్రజ్ఞుల సమాజం పట్టుదలతో టీకా పరిశోధనలు కొనసాగుతున్నప్పటికీ పౌర సమాజ సంఘీభావం, వ్యాప్తిని అడ్డుకోవడం, అందుబాటులో ఉన్న చికిత్సలను విధిగా తీసుకోవడం, టీకా రూపొందించడానికి అవసర పాలసీలను తీసుకురావడం, వ్యాధి పట్ల నెలకొన్న అపోహలను రూపుమాపడం, రోగులకు భరోసా కల్పించడం, పరీక్షలు చేయించుకోవడం, టీకా రూపకర్తల కృషిని గుర్తించడం నిరంతరం కొనసాగాలి. హెచ్ఐవి-ఎయిడ్స్‌కు సరైన నిర్దిష్టమైన చికిత్సలు, టీకాలు లేకపోయినప్పటికీ ఉపశమన లేదా నియంత్రణకు వైద్యం జరుగుతోంది. మన వంతు కర్తవ్యాలను నిర్వహిద్దాం. హెచ్ఐవిని అడ్డుకొని, ఎయిడ్స్‌కు చరమగీతం పాడే రోజు రావాలని ఆశిద్దాం.

(18 మే 'ప్రపంచ ఎయిడ్స్ టీకా దినం')

- డా॥ బుర్రా మధుసూదన్ రెడ్డి

'ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్' రద్దు చేయాలి

సమస్య



పి. అశోకబాబు

ఇప్పుడున్నది పర్మనెంట్ ఉద్యోగాల వ్యవస్థ. పర్మనెంట్ పనికి పర్మనెంట్ పోస్టులు, ఆ పోస్టులలో పర్మనెంట్ ఉద్యోగులు వుండాలనేది ఈ వ్యవస్థ సూత్రం. కానీ ఇప్పుడు మోడీ ప్రభుత్వం పర్మనెంట్ ఉద్యోగాల వ్యవస్థ స్థానంలో 'ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్' పేరుతో తాత్కాలిక ఉద్యోగాల వ్యవస్థను తీసుకొచ్చే పనిలో వున్నది.

మోడీ ప్రభుత్వం చేసిన 4 లేబర్ కోడ్‌లలో పారిశ్రామిక సంబంధాల కోడ్ ఒకటి. ఈ కోడ్ ప్రకారం మేనేజ్‌మెంటుకు-ఉద్యోగికి మధ్య కుదిరే కాంట్రాక్ట్ ప్రకారం ఉద్యోగం ఎంత కాలం అనేది ముందుగా నిర్ణయించబడుతుంది. సంవత్సరం, నాలుగు సంవత్సరాలు, ఐదు సంవత్సరాలు ఇలా ఉద్యోగం గడువు ముందే నిర్ణయించబడుతుంది. గడువు తీరిన తరువాత ఉద్యోగం కొనసాగదు. మేనేజ్‌మెంటు ఇంకొక టర్మ్ పొడిగించవచ్చు. లేదా అక్కడ దొరక్కపోతే ఇంకొక చోట ఉద్యోగం కోసం వెతుక్కోవాలి. కాబట్టి ఒక ఉద్యోగిని పర్మనెంట్ చేయకుండా అదే పోస్ట్‌లో ఎన్ని టరమ్‌లైనా వినియోగించుకోవచ్చు.

ఈ కోడ్ గనుక అమలులోకి వస్తే ఈ విధంగా పర్మనెంట్ ఉద్యోగాలలో ఎప్పటికీ తాత్కాలికంగా మాత్రమే ఉండే ఉద్యోగులను నియమించుకునే అధికారం యాజమాన్యాలకు లభిస్తుంది. పర్మనెంట్ ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో తాత్కాలిక ఉద్యోగులను నియమించే పరిస్థితి వస్తుంది. దీని వలన పర్మనెంట్ ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు ముప్పు వస్తుంది.

ఇంతేగాక ఈ 'ఫిక్స్‌డ్ టర్మ్' ఉద్యోగులు టర్మ్ అయిన తరువాత అదే సంస్థలో మరో టర్మ్ ఉద్యోగం దొరుకుతుందా లేక మరొక చోట ప్రయత్నించాలా అనే ఆందోళనతో నిరంతరం ఉంటారు కాబట్టి మేనేజ్‌మెంటు తమ హక్కులను అమలు చేయక పోయినా భరించటమే గాని ఎదిరించలేని పరిస్థితిలో వుండరు. యూనియన్లు, డిమాండ్లు, డిమాండ్లపై మేనేజ్‌మెంట్లతో చర్చలు,



> **ఈ కోడ్ గనుక అమలులోకి వస్తే ఈ విధంగా పర్మనెంట్ ఉద్యోగాలలో ఎప్పటికీ తాత్కాలికంగా మాత్రమే ఉండే ఉద్యోగులను నియమించుకునే అధికారం యాజమాన్యాలకు లభిస్తుంది. పర్మనెంట్ ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో తాత్కాలిక ఉద్యోగులను నియమించే పరిస్థితి వస్తుంది. దీని వలన పర్మనెంట్ ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు ముప్పు వస్తుంది.**

ప్రదర్శనలు, సమ్మెలు నామమాత్రం అవుతాయి. పర్మనెంట్ ఉద్యోగులు, యూనియన్లు, డిమాండ్లు, వాటిపై చర్చలు, ఆందోళనలు సమ్మెలు లేని పరిస్థితి కావాలనే కార్పొరేట్ల కోరిక నెరవేరుతుంది. 'ఫిక్స్‌డ్ టర్మ్' ఎంప్లాయ్‌మెంట్‌లో రిజర్వేషన్లు ఉండవు. కాబట్టి ఈ తాత్కాలిక ఉద్యోగాల వ్యవస్థలో సామాజిక న్యాయం కరువవుతుంది.

'ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్'కు వీలుగా అందుకు సంబంధించి ఎటువంటి చట్టం చేయకుండానే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా వాజ్‌పేయి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తరువాత వచ్చిన యుపిఎ-1 ప్రభుత్వం...కార్మిక సంఘాల ఒత్తిడి వలన, మద్దతిస్తున్న వామపక్షాల ఒత్తిడి వలన ఈ ఉత్తర్వును ఉపసంహరించింది. కానీ మోడీ ప్రభుత్వం 2018లో ఈ 'ఫిక్స్‌డ్ టర్మ్' ఎంప్లాయ్‌మెంట్‌కు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు జారీ చేసింది. 2019లో స్వంత మెజారిటీతో రెండవసారి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ నాలుగు లేబర్ కోడ్‌లను పార్లమెంట్‌లో ఆమోదింపజేసి చట్టాలుగా చేసింది.

ఈ నాలుగు లేబర్ కోడ్‌లు (1) వేతనాల కోడ్ 2019 (2) పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020, (3) సాంఘిక భద్రత కోడ్ 2020, (4) వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, వర్కింగ్ కండిషన్స్ కోడ్. ఇప్పుడు ఈ పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020లో చేర్చి ంది. 'ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్'ను చట్టబద్ధం చేసింది.

మొత్తం నాలుగు లేబర్ కోడ్‌లను మోడీ ప్రభుత్వం 2019, 2020 లోనే చట్టాలుగా చేసినప్పటికి కార్మిక వర్గ ప్రతిఘటన వలన వీటిని అమలు చేసే తేదీ ప్రకటించకుండా పెండింగ్‌లో వుంచింది. కానీ స్వంత మెజారిటీ లేనప్పటికీ కొందరు మిత్రుల మద్దతుతో 2024లో మూడవసారి అధికారంలోకి వచ్చినప్పటి నుండి కార్మిక వ్యతిరేక ప్రజా వ్యతిరేక విధానాలను ఉధృతంగా అమలు చేస్తున్నది. ఈ క్రమంలో భాగంగానే ఈ లేబర్ కోడ్‌ల అమలుకు తేదీలు ప్రకటించేందుకు సంసిద్ధమవుతున్నది.

కాబట్టి ఈ 4 లేబర్ కోడ్‌లను, అందులో భాగంగా వున్న 'ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్'ను రద్దు చేయాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు అందరూ ఐక్యంగా పోరాడితేనే ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేయించటం సాధ్యమవుతుంది. ఈ బాధ్యత కార్మికులు, ఉద్యోగులు అందరికీ వున్నది.

/ వ్యాసకర్త 'బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్' పూర్వ ఉప ప్రధాన కార్యదర్శి, సెల్ : 7901533111 /

కవిత్వం

అమ్మలూ!

భ్రమల నుంచి
విభ్రమల నుంచి
దిగ్భ్రమల నుంచీ..
తేరుకొని కన్నీరు మున్నీరుగా
ఎన్ని నదులవయ్యావు?
సృష్టీ.. ఉత్పత్తీ .. కౌగిలింతల
కలబోతల.. తలపుల జలపాతం నువ్వు!
సమస్త ఉద్వేగాల సిరిసిరి
సిరిగిరి పాదం నువ్వు!
సముద్రాలు నిండిపోయినంత..
కెరటాలు పగిలిపోయినంత..
గర్భస్రావాలు దు:ఖమైనంత..
విచ్ఛిన్న వివాహమైనంత..
విధ్వంస కవిత్వమైనంత..
మనసు దీరా ఏడవడానికి
మరో మనిషి లేనంత!
లోపల, బయట కొనసాగుతున్న యుద్ధం..
ఎన్ని కొలనులు.. నీ కనులు?
ఎన్ని కలువలు నీ విలువలు?
ఉదయముల కనుబొమల మధ్య
శ్రమల కుంకుమలు!
విచిత్రాలు కాదు, వివస్త్రల లోయలు!
అందిస్తాయి లోకానికి భూపాల రాగాలు!
దిక్కులకు అక్కడ నుంచే
ఎగబాకుతాయి దీపక రాగాలు!
అమ్మల్ని బొమ్మల్లా
చూపించే వ్యవస్థలో..
కృత్రిమ సింధూరాలు కరిగిపోతాయి..
సహజ సౌగంధాలు లేని
మందారాల అందాలు తరిగిపోతాయి.
సోదరీ.. సోఫియా!
ఇక్కడ రాజ్యమేలుతున్నది
మగ ఖడ్గమృగాల మాఫియా!

- నల్లి ధర్మారావు

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @gmail.com

ప్రధాని మోడీతో లోకేష్ కుటుంబం భేటీ

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన విశేషాలతో రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ని ప్రధాని ఆవిష్కరించారు. ఆ పుస్తకంపై సంతకం చేసి లోకేష్‌కు అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ఆశీస్సులు, మార్గదర్శకత్వం కావాలని మోడీని లోకేష్ కోరారు. ఇదివరకు అందించిన మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ భద్రత, దేశాభివద్ధిలో మోడీ కీలక పాత్ర పోషిస్తున్నారని లోకేష్ తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో సహకారం అందించేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని, ఈ దిశగా మార్గదర్శకత్వం చేయాలని మోడీని ఆయన కోరారు.

రేషన్‌కార్డుల కష్టాలు..!

- ఉదయం నుంచి సాయంత్రం వరకూ సర్వర్ డౌన్‌లోనే
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి విసుగెత్తిపోతున్న జనం
- అందుబాటులోకి రాని 'మనమిత్ర' వాట్సప్ సేవలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు చేసుకునేందుకు జనం పడుతున్న కష్టాలు వర్ణాతీతంగా మారాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సర్వర్ పనిచేయకపోవడంతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రిపూట, లేక తెల్లవారుజామున సర్వర్ పనిచేయడంతో ఆ సమయంలో వచ్చి పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నెల ఏడో తేదీన నుంచి కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. అప్పటి నుంచి సర్వర్ సమస్య వెంటాడుతున్నా పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చాలా కాలంగా కొత్త రేషన్‌కార్డుల జారీ లేకపోవడం, రేషన్ కార్డులు చేర్పులు, తొలగింపు వంటివి చేయకపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అర్జీదారులంతా గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న పరిస్థితి నెలకొంది. ఈనెల 15వ తేదీ నుంచి మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం చెప్పినా అమల్లోకి రాలేదు. దీంతో రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునే వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త రేషన్‌కార్డులతోపాటు మొత్తం ఏడు సేవలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ 9,142 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో కొత్త రైస్ కార్డుల దరఖాస్తులు 959, ఉన్నకార్డులో విభజనకు సంబంధించి 658, కొత్త సభ్యుల చేర్పుల దరఖాస్తులు 6,673, మరణించిన సభ్యుల తొలగింపు 260, తప్పు ఆధార్ సీడింగ్ సరిచేసేవి 93, కార్డుల సరెండర్‌కు సంబంధించి 11, చిరునామా మార్పు దరఖాస్తులు 177 వరకూ వచ్చాయి. సర్వర్ సరిగ్గా పనిచేస్తే ఈపాటికి రేషన్‌కార్డుల దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యే పరిస్థితి ఉండేది. సర్వర్ పనిచేయకపోవడంతో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. జూన్‌లో కొత్త రేషన్‌కార్డుల మంజూరు ఉంటుందని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. సర్వర్ సమస్యతో కొత్త రేషన్‌కార్డులు ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఒంటరి మహిళకు సంబంధించి స్పష్టత కరువు

కొత్త రేషన్‌కార్డుల ప్రక్రియ సాగుతుండడంతో ఒంటరి మహిళలు దరఖాస్తులు చేసుకునేందుకు వెళ్తున్నా నిరాశే మిగులుతోంది. ముఖ్యంగా వివాహమై భర్తకు ఏళ్ల తరబడి దూరంగా ఉంటున్న ఒంటరి మహిళలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ జరగడం లేదు. విడాకులకు సంబంధించి న వివరాలు ఉండాలంటూ చెబుతున్న పరిస్థితి నెలకొంది. భర్త నుంచి దూరమయ్యే అనేక మంది మహిళలు ఒంటరిగా పిల్లలతో జీవిస్తున్నారు. విడాకుల కోసం తిరగలేక, ఆర్థిక స్తోమత లేక అలానే ఉండిపోయారు. అలాంటి ఒంటరి మహిళలకు కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించకుండా ఆంక్షలు విధించడం ఏంటన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా 'పశ్చిమ' పౌరసరఫరాల శాఖ అధికారులు

కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ సాగుతోంది. ఈ ప్రక్రియను పర్యవేక్షించే ప్రక్రియ అంతా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోంది. పశ్చిమగోదావరి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు మాత్రం తమకు సంబంధం లేదన్నట్లు మాట్లాడుతున్నారు. కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల వివరాలు తమకు తెలీదని, రాష్ట్ర కేంద్రంలో ఉంటాయంటూ సమాధానం చెబుతున్నారు. మిగిలిన జిల్లాల పౌర సరఫరాల శాఖ కార్యాలయాల్లో సమాచారం ఉన్నప్పుడు పశ్చిమగోదావరి జిల్లా అధికారుల వద్ద ఎందుకు ఉండదో తెలియని పరిస్థితి నెలకొంది. రేషన్ కార్డుల దరఖాస్తులకు సంబంధించిన సమాచారం మీడియాకు చెప్పకుండా దాటవేత ధోరణితో మాట్లాడుతున్నారు. ఇది ఒకరకంగా ప్రభుత్వానికి చెడ్డపేరు తేవడమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్త రేషన్ కార్డులకు సంబంధించిన ప్రక్రియ ఏవిధంగా సాగుతుందో ప్రభుత్వం ఏంచేస్తుందో వంటి వివరాలు ప్రజలకు తెలిసినప్పుడే పాలనపై జనంలో ఒక అభిప్రాయం ఏర్పడుతోంది. లేకపోతే ప్రభుత్వం ఏం చేస్తుందో ప్రజలకు తెలియకుండా పోనుంది.

పార్ట్ టైం ఉద్యోగం పేరుతో మోసం..

- రూ.10 లక్షలు మోసపోయిన వివాహిత

ప్రజాశక్తి - నరసాపురం (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణంలోని 8వ వార్డుకు చెందిన ఓ వివాహిత ఆన్‌లైన్‌లో టాస్క్‌ల పేరుతో రూ.10 లక్షలు మోసపోయింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ జయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. నరసాపురానికి చెందిన ఓ వివాహిత ఇన్‌స్టాగ్రాంలో పార్ట్ టైం ఉద్యోగం అంటూ, ఉద్యోగం చేసుకుని ఇంటి వద్దే సంపాదించవచ్చంటూ అనే రీలును చూశారు. దీనికి సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు అందులో ఇచ్చిన ఫోన్ నెంబరుకు ఫోన్ చేశారు. వాళ్లు జాబ్ పేరుతో కొన్ని టాస్క్‌లు ఇచ్చి మేము పెట్టిన పోస్టుకు లైక్‌లు కొట్టాలని, ఇలా కొట్టినా డబ్బులు వస్తాయని నమ్మించారు. ఇందుకు కొంత మొత్తం ముందుగా కట్టాలని నమ్మపలికారు. ఇది నిజమని నమ్మిన బాధితురాలు వారు పంపించిన యుపిఐ నెంబర్‌కు రూ.10,44,200 పంపించారు. రేటింగ్ పెరుగుతున్నా డబ్బులు రాకపోవడంతో బాధితురాలకు అనుమానం వచ్చి నిలదీశారు. మీ సొమ్ము తిరిగి ఇవ్వాలంటే మరో రూ.10 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని ఇంకా నమ్మించే ప్రయత్నం చేశారు. చివరికి తాను మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. బాధితులరాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జయలక్ష్మి తెలిపారు.

మళ్లీ మట్టి తవ్వకాలతో ఉద్రిక్తత

- రైతులకు అండగా నిలిచిన సిపిఎం



ఎక్సవేటర్‌ను అడ్డుకుంటున్న రైతులు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- పిఠాపురం (కాకినాడ జిల్లా)

రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న పిఠాపురంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. ఎఫ్‌కె.పాలెంలో పాపిడిదొడ్డి చెరువులోని మట్టి అక్రమ తవ్వకాలకు మట్టి మాఫియా శనివారం మరోసారి సిద్ధపడింది. దీంతో, స్థానిక రైతులు యంత్రాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు, మట్టి మాఫియాకు మధ్య తీవ్ర స్థాయిలో తోపులాట జరిగింది. ఎఫ్‌కె.పాలెం గ్రామానికి సంబంధం లేని ఇటుక బట్టీల వ్యాపారులు రైతులపై దౌర్జన్యానికి దిగారు. దాడికి ప్రయత్నించారు. తోపులాటలో కొందరు రైతులు కిందకు పడిపోయారు. అక్కడకు చేరుకున్న పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. రైతులు మాట్లాడుతూ ఇటుకల బట్టి వ్యాపారులు ఈ చెరువులో మట్టిని అక్రమంగా తొవ్వకుని పోయేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇటీవల యంత్రాలను చెరువులోకి దింపే ప్రయత్నం చేయగా అడ్డుకుని బయటకు పంపించేశామని తెలిపారు. ఒక రైతు పేరుతో అనుమతి తీసుకుని ఆ రైతు పొలాన్ని మెరక చేసుకునేందుకు అంటూ బట్టీ వ్యాపారులు తమ వ్యాపార ప్రయోజనాల కోసం తమ గ్రామంలోని చెరువు మట్టిని అక్రమంగా తరలించుకుపోయేందుకు సిద్ధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని అధికారులకు చెబుతున్నప్పటికీ పట్టించుకోకుండా ముందుకు సాగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు డి.శేషబాబ్జి, స్థానిక నాయకులు కుంచె చిన్న, కోనేటి రాజు చెరువు దగ్గరికి పరిశీలించడానికి వచ్చారు. రైతుల ఆందోళనకు మద్దతు ఇచ్చి వారితో కలిసి ఆందోళనలో పాల్గొన్నారు. మట్టి తవ్వకాలకు అనుమతులు ఉన్నాయంటూ, అడ్డుకుంటే కేసులు పెడతామంటూ పోలీసులు రైతులను పరోక్షంగా హెచ్చరించారు. మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడే వారికి రెవెన్యూ, పోలీస్ అధికారులు వత్తాసు పలకడం ఏమిటని గ్రామస్తులు ప్రశిస్తున్నారు. సిపిఎం నాయకులు గ్రామస్తులను, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శేషబాబ్జి మాట్లాడుతూ గ్రామస్తులతో చర్చించకుండా అధికారులు ఏకపక్షంగా తవ్వకాలకు అనుమతులు ఇవ్వడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. భారీగా పోలీసులు మోహరించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. రైతుల ఆందోళన నేపథ్యంలో ఎఫ్‌కె.పాలెం, కందరాడ గ్రామస్తులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డిఒ మల్లిబాబు, పాడా పీడీ చైత్రవర్షిణి, డ్వామా ఎపిడి వసంత మాధవి, ఏలేరు ఇరిగేషన్ ఇఇ డి.శేషగిరిరావు, తహశీల్దార్ పి.గోపాలకృష్ణ, సిఐ శ్రీనివాసు, ఎస్ఐ జాన్ బాషా సమావేశం ఏర్పాటు చేశారు. నిబంధనలు అతిక్రమించి మట్టిని తరలిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.



విశాఖ జూ పార్కులో కొత్తగా జన్మించిన తోడేలు, నక్క, లేమూర్ కూనలు

విశాఖ జూ పార్కులో కొత్త నేస్తాలు!

- కూనలకు జన్మనిచ్చిన అరుదైన జంతు జాతులు : సంతానోత్పత్తి కేంద్రంగా జంతు ప్రదర్శనశాల

ప్రజాశక్తి - ఆరిలోవ

ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో అరుదైన జాతులకు చెందిన జంతువులు కూనలకు జన్మనిచ్చాయి. ఒక తోడేలు పిల్ల, ఒక బెంగాల్ జాతికి చెందిన ఒక నక్క పిల్ల, మడగాస్కర్‌కు చెందిన లేమూర్ పిల్లలు కొత్తగా జన్మించాయి. అంతరించిపోతున్న షెడ్యూల్ -1 జాతికి చెందిన తోడేలు ఒక పిల్లకు జన్మనివ్వడం చాలా సంతోషంగా ఉందని జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఇటీవల కాలంలో జూపార్కులో వివిధ జాతుల జంతువులు పిల్లలను కంటున్నాయని, జూ పార్కులో జంతువుల సంతోనోత్పత్తికి, వాటి పరిరక్షణ వైపు ఒక ప్రధాన అడుగు పడిందన్నారు. దీనికోసం జూ అధికారులు, పశువైద్య బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. దీని వెనుక జూ సిబ్బంది అంకితభావంతో కూడిన కృషి, జంతు సంరక్షణ, సంతానోత్పత్తి కార్యక్రమంలో వారి నైపుణ్యం ఉందన్నారు. అందమైన కొత్త జంతువులను త్వరలో చూడవచ్చన్నారు.

సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ రద్దు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ (విశాఖ)

ఆగ్నేయ రైల్వేలోని చక్రధర్‌పూర్ డివిజన్‌లో భద్రతా పనుల కోసం గమ్హారియా-సిని విభాగంలో మెగా బ్లాక్‌ల కారణంగా, 18005 హౌరా-జగదల్‌పూర్ సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 20, 27, జూన్ 3, 10, 17, 24 తేదీల్లో, 18006 జగదల్‌పూర్-హౌరా సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్‌ను మే 22, 29, జూన్ 6, 12, 19, 26 తేదీల్లో రద్దుచేస్తున్నట్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

యుపిలో దళిత బాలికపై అత్యాచారం

- పాఠశాలకు వెళ్తుండగా యువకుల ఘాతుకం

సుల్తాన్‌పూర్ : బిజెపి పాలిత ఉత్తర ప్రదేశ్‌లో దళితులపై అత్యాచారాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. తాజాగా సుల్తాన్‌పూర్‌లో 14 ఏళ్ల బాలికపై ముగ్గురు యువకులు అత్యాచారం చేసిన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పదో తరగతి చదువుతున్న బాధితురాలు స్కూల్‌కు వెళ్తుండగా, కారులో తీసుకెళ్తామంటూ 15 ఏళ్ల నిందితుడు ఆమెను పిలిచి కారులో ఎక్కించుకున్నాడు. మార్గమధ్యలో మరో ఇద్దరు నిందితులు, ప్రదీప్ (18), సౌరబ్ (18) కారులో ఎక్కారు. నిందితులు ముగ్గురూ కలిసి ఆమెను ఒక గదికి తీసుకెళ్ళి, కట్టివేసి, నోరు మూసి, అత్యాచారం చేశారని పోలీసులు తెలిపారు. గంట తర్వాత స్పృహలోకి వచ్చిన బాధితురాలు కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం సహా పలు సెక్షన్ల కింద నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎఎస్‌పి అఖండ ప్రతాప్ సింగ్ తెలిపారు. ఇద్దరు నిందితులకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి, మరో నిందితుడైన 15 ఏళ్ల బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించినట్లు ఆయన చెప్పారు.

అమెరికాలో టోర్నడో బీభత్సం

- 21 మంది మృతి



మిస్సోరీలోని సెయింట్ లూయిస్‌లో ఈదురుగాలులకు రోడ్డుకు అడ్డంగా నేలకూలిన వృక్షం

వాషింగ్టన్ : అమెరికాలోని పలు రాష్ట్రాల్లో టోర్నడోలు, తుపానులు బీభత్సం సృష్టించాయి. వీటి ధాటికి 21 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి కెంటకీలోని లారెల్ కౌంటీలో టోర్నడో బీభత్సం వల్ల 14 మంది మరణించినట్లు కెంటకీ గవర్నర్ ఆండీ బెషియర్ శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. మిసోరీలో తుపాను బీభత్సంతో ఐదుగురు మరణించారని, ఐదు వేల కుటుంబాలు ప్రభావితమయ్యాయని సెయింట్ లూయిస్ మేయర్ కారా స్పెన్సర్ మీడియాకు తెలిపారు. స్కాట్ కౌంటీలో మరొకరు మరణించారని, పలువురు గాయపడ్డారని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. విస్కాన్సిన్, ఇండియానా తదితర రాష్ట్రాల్లో తుపాను వల్ల భారీ విధ్వంసం చోటుచేసుకుంది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

తిరుపతిలో దారుణం

- దళిత విద్యార్థి కిడ్నాప్, ఆపై హత్యాయత్నం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి నగరంలో దళిత విద్యార్థిని ఓ రౌడీ షీటర్ కిడ్నాప్ చేసి, ఆపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు జేమ్స్ తిరుపతి సమీపంలోని విద్యానికేతన్ ఇంజనీరింగ్ కాలేజీలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. నగరంలో రౌడీ షీటర్‌గా ఉన్న సాయి రూపేష్, చోటా భీమ్ గ్యాంగ్, జేమ్స్‌ను కులం పేరుతో దూషించారు. దీన్ని ప్రశ్నించినందుకు రెండు రోజుల క్రితం జేమ్స్‌ను కిడ్నాప్ చేసి, చిత్రహింసలు పెట్టారు. ఆపై చంపేందుకు ప్రయత్నించారు. ఎలాగోలా వారినుంచి తప్పించుకున్న జేమ్స్ రుయా హాస్పటల్‌లో చేరి చికిత్స పొందుతున్నాడు. తనను కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడి, చిత్రహింసలకు గురిచేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



డోలీపై రోగిని తీసుకొస్తున్న గిరిజనులు

తప్పని డోలిమోత

ప్రజాశక్తి- శృంగవరపుకోట (విజయనగరం జిల్లా)

గిరిశిఖర గ్రామాల గిరిజనులకు డోలీ మోతలు నిత్యకృత్యమవుతున్నాయి. విజయనగరం జిల్లా శృంగవరపుకోట పంచాయతీ రేగపుణ్యగిరి గ్రామానికి చెందిన పాంగి లింబయ్యమ్మ విషజ్వరంతో బాధపడుతోంది. శనివారం ఆమె భర్త పాంగి నర్సింగరావు తోటి గిరిజనుల సహాయంతో డోలీ కట్టి మోసుకుంటూ కొండ దిగువకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి స్థానిక ప్రభుత్వాస్పత్రికి 108 వాహనంలో ఆమెను తరలించారు.

మిస్ ఈస్టోనియాకు పసిడి

- మిస్ వరల్డ్ స్పోర్ట్స్ చాలెంజ్



హైదరాబాద్ : మిస్ వరల్డ్ 2025 స్పోర్ట్స్ చాలెంజ్‌లో మిస్ ఈస్టోనియా ఎలిసి రాండ్‌మా చరిత్ర సృష్టించింది. శనివారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన స్పోర్ట్స్ చాలెంజ్‌లో అగ్రస్థానంలో నిలిచిన ఎలిసి..1999 తర్వాత ఈస్టోనియా నుంచి క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుని చరిత్ర సృష్టించింది. స్పోర్ట్స్ చాలెంజ్‌లో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ నాకౌట్, షాట్ పుట్, చెస్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ పెనాల్టీ షుటౌట్, షటిల్ రన్స్ అండ్ స్ప్రింట్స్ సహా జుంబా సెషన్స్ పోటీలు నిర్వహించారు. ఈ చాలెంజ్‌లో పోటీదారుల ఫిజికల్ ఫిట్‌నెస్, ఓవరాల్ హెల్త్, అథ్లెటిక్ ఎబిలిటీ సహా పాజిటివ్ మైండ్‌సెట్‌ను అంచనా వేస్తారు. మిస్ వరల్డ్ మార్టినిక్ ఆరెలి జావోచిమ్ సిల్వర్ సాధించగా, మిస్ వరల్డ్ కెనడా ఎమ్మా మారిసన్ కాంస్యం అందుకుంది. ట్రినిడాడ్ అండ్ టొబాగో అనా లిసె నాంటన్ నాల్గో స్థానంలో నిలిచింది.

మిస్ వరల్డ్ పోటీల్లో స్పోర్ట్స్ చాలెంజ్ కీలకం. 108 దేశాల నుంచి పోటీదారులు నాలుగు గ్రూపులుగా (అమెరికన్స్ అండ్ కరీబియన్, ఆఫ్రికా, యూరోప్, ఆసియా, ఓసియానా) పోటీపడ్డారు. పోటీల్లో అగ్రస్థానంలో నిలిచిన వారికి మిస్ వరల్డ్ స్పోర్ట్స్ లేదా స్పోర్ట్స్‌ఉమెన్ అవార్డును ప్రదానం చేస్తారు. స్పోర్ట్స్ చాలెంజ్ విజేత నేరుగా టాప్-40లో నిలిచి క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన మిస్ వరల్డ్ స్పోర్ట్స్ చాలెంజ్ సందడిగా సాగింది. సాంస్కృతిక కళారూపాలతో ముద్దుగుమ్మలకు ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్రం నుంచి అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులు సహా పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, శాట్జ్ చైర్మెన్ కే. శివసేనా రెడ్డి సహా తదితరులు స్పోర్ట్స్ చాలెంజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

పోలవరం, అమరావతి పేరుతో కాలయాపన

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పింఛన్లు, డిఎస్‌సి విడుదల తప్ప సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడా అమలు కావడం లేదని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండానే మరోవైపు రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి స్థానంలో కేవలం అమరావతి, పోలవరం జపం చేస్తూ ఈ ప్రభుత్వం కాలం వెళ్లదీస్తుందన్నారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలిచి అమరావతి శంకుస్థాపన చేయించారన్నారు. పోయినసారి శంకుస్థాపన చేయించినప్పుడు పిడికెడు మట్టి, నీళ్లు మొహానా కొట్టారని విమర్శించారు. ఈసారి అది కూడా లేదని, ఉత్త మాటలే చెప్పారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదన్నారు. సభలో నరేంద్ర మోడీ చంద్రబాబును పొగడడం, చంద్రబాబు మోడీని పొగడడం తప్ప కేంద్రం నుంచి రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని విమర్శించారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీ ప్రత్యేక హోదా, రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధుల కేటాయింపు మాటలు లేవన్నారు. జాతీయ విద్యా సంస్థల ఏర్పాటుపై స్పష్టత లేదన్నారు. విశాఖ ఉక్కు రక్షణ, కడప ఉక్కు పరిశ్రమకు నిధులు ఇస్తామన్న స్పష్టత ఇవ్వలేదని చెప్పారు. గడచిన సంవత్సర కాలంలో రైతాంగం తీవ్రమైన ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ఒక ఎకరా మిర్చి వేసిన రైతు లక్ష నుంచి రెండు లక్షల వరకు అప్పుల్లో కూరుకుపోయారన్నారు. పొగాకు వేసిన రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. అగ్రిమెంట్ ఇచ్చిన కంపెనీలు పొగాకును కొనుగోలు చేయడం లేదన్నారు. జొన్న, సెనగ, మినుములు, పెసలు ఇలా ఏ ఒక్క పంటకు గిట్టుబాటు ధర లేదని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని అన్నారు. రాయలసీమ జిల్లాలో లక్షల ఎకరాల పొలాలు సోలార్ కంపెనీలకు కట్టబెడుతున్నారన్నారు. ఒక పక్క ప్రతి రైతు కుటుంబంలో లక్షాధికారిణి చేస్తానంటూ చెబుతూ మరోవైపు రైతులను బిక్షాధికారి చేస్తున్నారంటూ విమర్శించారు. సోలార్ కంపెనీల మోజులో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఉందన్నారు. సోలార్ కంపెనీలు రావడమంటే కారు చౌకగా రైతుల భూములను కొలగొట్టడమేమన్నారు. ప్రజలపై భారాన్ని మోపే విద్యుత్‌రంగ సంస్కరణలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కదిరిలో వైసిపికి షాక్

13 మంది కౌన్సిలర్లు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కదిరి టౌన్

శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజవకర్గం వైసిపికి భారీ షాక్ తగిలింది. వైసిపికి చెందిన 13 మంది కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. శనివారం ఎమ్మెల్యే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో వారు టిడిపి కండువాలు కప్పుకున్నారు. మరో రెండు రోజుల్లో కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక ఉన్న నేపథ్యంలో వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరడంతో ఛైర్మన్ గిరి టిడిపి వశం కావడం లాంఛనమే అయ్యింది. కదిరి మున్సిపాల్టీలో మొత్తం 36 మంది ఉండగా ప్రస్తుతం వైసిపిలో చేరిన వారితో కలిపి టిడిపికి 25 మంది కౌన్సిలర్లు అయ్యారు. వైసిపికి 11 మంది కౌన్సిలర్లు మిగిలారు. సోమవారం నాడు ఛైర్మన్ ఎన్నిక నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నోటిఫికేషన్ జారిచేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం టిడిపికి ఉన్న సంఖ్యా బలంతో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ స్థానాలను సులువుగా ఆ పార్టీ ఖాతాలో వేసుకోనుంది.

వైసిపిది అవినీతి పాలన : కందికుంట

గత వైసిపి పాలనలో మితిమీరిన అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. వార్డుల్లో అభివృద్ధి జరగక కౌన్సిలర్లు విసిగిపోయారన్నారు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని గ్రహించి వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరారన్నారు.

హత్య కేసు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - పాణ్యం

నంద్యాల జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించిన గడివేములలో జరిగిన హత్య కేసును పాణ్యం సిఐ కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అతి తక్కువ కాలంలోనే కేసును విచారించి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. శనివారం పాణ్యం సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడారు. గడివేముల గ్రామానికి చెందిన గువ్వల రాజు (38) కనబడడం లేదని ఆయన తమ్ముడు గువ్వల జనార్ధన్ ఈనెల 9న గడివేముల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడన్నారు. ఈనెల 10న గడివేముల విఆర్వో ఫిర్యాదు మేరకు గ్రామ పొలిమేరలో అబ్దుల్ రహీం మొక్కజొన్న పొలంలో గుర్తుతెలియని చిన్న చిన్న ఎముకలు ఉన్నాయని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు అందిందన్నారు. గడివేముల ఎస్సైతో కలిసి పొలం వద్దకు వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి కొన్ని ఎముకలను రెవెన్యూ అధికారుల సమక్షంలో ఫోరెన్సిక్‌కు పంపగా మిస్సింగ్ కేసులో కనబడకుండా పోయిన గువ్వల రాజు అస్థికలుగా తేలిందన్నారు. గత నెల 23న గడివేముల మండలం కే బొల్లవరం గ్రామానికి చెందిన మేకల మహేంద్ర, అతని స్నేహితుడు బిలకల గూడూరు గ్రామానికి చెందిన కొత్త లోకేష్ కలిసి గువ్వలరాజును మోటార్ సైకిల్‌పై ఎక్కించు కొని మద్యం సేవిస్తూ గతంలో వారికి ఉన్న అక్రమ సంబంధాల విషయం మాట్లాడు కుంటూమాట పెరిగి క్షణికావేశంతో ఐరన్ రాడ్డుతో రాజును మహేంద్ర చంపాడన్నారు. శవాన్ని ఎవరు గుర్తుపట్టకూడదని గత నెల 24, 26న రెండు రోజులు రాత్రిపూట వెళ్లి శవంపై యాసిడ్ పోసి ఎముకలను ఏరి అక్కడే ఉన్న రాళ్లతో దంచి పొడి చేసి పెట్రోల్ పోసి కాల్చారని, పొడిని దగ్గరలో ఉన్న కుందువాగులో వేశారని దర్యాప్తులో తేలిందన్నారు. నిందితుల నుండి నేరానికి ఉపయోగించిన రెండు మోటార్ సైకిళ్ళు, ఐదు సెల్ ఫోన్లు, ఐరన్ రాడ్డును స్వాధీనం చేసుకున్నా మన్నారు.

ఇంత జరుగుతున్నా.. ఏం చేస్తున్నారు..

- లింగ నిర్ధారణ పరీక్షలపై కలెక్టర్ సీరియస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు సమాచారం మీకు ఎందుకు తెలియడం లేదని, శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా తెలుస్తోందని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో పిసిపిఎన్ డిటి యాక్ట్ 1994 డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వయిజరీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్, ఛైర్మన్ అధ్యక్షతన నిర్వహించగా మొదటి అదనపు జిల్లా జెడ్జ్ ఎస్.రమేష్, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..... చిత్తూరు జిల్లా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దుగా ఉండడంతో పిసిపిఎన్ డిటి యాక్ట్ నియమ నిబంధనలకు విరుద్ధంగా జిల్లా కేంద్రంలో చాలా కాలంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎందుకు తెలుసుకోలేకపోయారని, క్షేత్ర స్థాయిలో గల ఆశా, ఎఎన్ఎంలు స్థానికంగా ఉన్నప్పటికీ మొదటి, రెండు సంతానాలలో ఆడపిల్లలు ఉండి మూడవ సారి ఆ మహిళ గర్భం దాల్చిన విషయాన్ని ఎందుకు తెలుసుకోలేకపోతున్నారని, ఆ సమాచారం ఎందుకు రావడం లేదన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖలు కలసి సిడిపిఓలు, మెడికల్ ఆఫీసర్లతో కలసి గత 10 సంవత్సరాలలో ఎప్పుడైనా సమన్వయ సమావేశాలు నిర్వహించారా, అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణీలకు అందించే పోషకాహారం వారు స్వయంగా వచ్చి తీసుకుని వెళ్లకపోవడం ద్వారా కూడా వారి ఆరోగ్య పరిస్థితి తెలుస్తుందని, ఈ విషయంలో రెండు శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా తెలుస్తున్నదన్నారు. ఈ విషయంలో జిల్లా స్థాయి అధికారులు ఇద్దరు వ్యక్తిగతంగా ఆశా, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడడం ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితులు కొంత వరకు అర్థం అవుతాయని ఈ దిశగా పనిచేయాలన్నారు.

చిత్తూరు జిల్లాకు సంబంధించి 2024 జనాభా లెక్కల ప్రకారం ప్రతి వెయ్యి మంది పురుషులకు 947 మంది స్త్రీలు ఉన్నారని, ఈ నిష్పత్తి ఇతర జిల్లాలతో పోలిస్తే చాలా తక్కువగా ఉందని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో పని చేసే అధికారులు, సిబ్బంది భాద్యతాయుతంగా పని చేయడం ద్వారా మాత్రమే లింగ నిర్ధారణ పరీక్షల నిర్వహణను అరికట్టవచ్చునన్నారు. జిల్లాలో ప్రధానంగా ఇతర రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న నగరి, పలమనేరు, పుంగనూరు, వి.కోట మండలాలలో ప్రైవేట్ ఆసుపత్రులలో అనుమతి లేకుండా జరుగుతున్న అబార్షన్‌ల శాతం మిగిలిన మండలాలతో పోలిస్తే ఎక్కువగా ఉన్నదన్నారు. డివిజన్‌ల వారీగా ఆర్‌ఎంపి డాక్టర్లతో సమావేశాలు నిర్వహించాలని డిఎం అండ్ హెచ్‌ఓను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలని ఆదేశించారు. మెడికల్ షాపులో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేనిదే మందులు ఇవ్వరాదనే విషయాన్ని అందరికీ స్పష్టంగా తెలియజేయాలని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు.

కేంద్రం మార్గదర్శకాల మేరకే !

- రాష్ట్రపతికి గడువు విధించడంపై సుప్రీంకోర్టు తీర్పులోనే వివరాలున్నాయి
- 201వ అధికరణ లక్ష్యాలు, ఉద్దేశాలకు అనుగుణంగానే తీర్పు



న్యూఢిల్లీ : తమిళనాడు అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులకు ఆమోద ముద్ర వేయకుండా గవర్నర్, రాష్ట్రపతి తొక్కిపెట్టడంపై సుప్రీంకోర్టు ఏప్రిల్ 8న సంచలనాత్మక తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. గవర్నర్ పరిశీలనకు పంపిన బిల్లులను మూడు నెలల్లోగా రాష్ట్రపతి ఆమోదించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై రాష్ట్రపతి అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రపతికే గడువు విధించవచ్చా? అంటూ సుప్రీంకోర్టుకు తాజాగా పలు ప్రశ్నల్ని సంధించారు. గతంలో కేంద్రం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారమే రాష్ట్రపతికి కాలపరిమితి విధిస్తూ తీర్పు ఇచ్చిందని విదితమవుతుంది.

2016లో రాష్ట్రపతికి మూడు నెలల కాలపరిమితిని నిర్ణయిస్తూ జారీ చేసిన రెండు ఆఫీస్ మెమోరాండమ్ (ఓఎం)ల ద్వారా హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంహెచ్ఎ) జారీ చేసిన మార్గదర్శకాల మేరకే అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి మూడు నెలల్లోగా ఆమోదించాలనే గడువు విధిస్తూ ఏప్రిల్ 8న తీర్పు ఇచ్చినట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. మార్గదర్శకాల్లో హోంశాఖ నిర్దేశించిన కాలపరిమితి సముచితమైనదని తాము భావించామని, గవర్నర్ పరిశీలన కోసం రిజర్వ్ చేయబడిన బిల్లులపై కూడా ఆ విధమైన మార్గదర్శకాలను పాటించాలని, రాష్ట్రపతి కూడా మూడు నెలల్లోగా బిల్లులపై నిర్ణయం తీసుకోవాలని నిర్దేశించినట్లు సుప్రీంకోర్టు తీర్పులో జస్టిస్ జె.బి పార్ధివాలా పేర్కొన్నారు.

ఆర్టికల్ 201 కింద గవర్నర్లు రాష్ట్రపతికి చేసిన నివేదనలను సత్వరమే పరిష్కరించాలని గతంలో సర్కారియా, పూంచి కమిషన్లు చేసిన సిఫార్సులు కూడా పేర్కొన్నాయి. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలు కూడా అదే విషయాన్ని స్పష్టం చేశాయి. స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ బిల్లులపై తుది నిర్ణయం తీసుకోవడంలో జరిగిన అనవసర జాప్యాన్ని ఫిబ్రవరి 4, 2016న జారీ చేసిన మొదటి ఆఫీస్ మెమోరాండమ్ హైలైట్ చేసింది. తీర్పు పేజీల్లో దీన్ని కూడా తిరిగి పొందుపరిచారు. రాష్ట్ర ప్రభుత్వాల నుండి అందిన తర్వాత బిల్లులను ఖరారు చేయడానికి గరిష్టంగా మూడు నెలల కాలపరిమితికి కట్టుబడి వుండాలని ఆఫీస్ మెమోరాండం (ఓఎం) పేర్కొంది. గవర్నర్ రాష్ట్రపతికి నివేదించిన తర్వాత జరగాల్సిన ప్రక్రియను పైన పేర్కొన్న మెమోరాండం సూచిస్తోందని, దీని ప్రకారమే రాష్ట్రపతికి బిల్లుల ఆమోదానికి కాలపరిమితి విధిస్తూ తీర్పును వెలువరించింది.

మొదటగా నోడల్ మంత్రిత్వ శాఖగా వ్యవహరించే కేంద్ర హోం శాఖ రాష్ట్ర బిల్లులో ఉన్న ముఖ్యమైన అంశాలను కేంద్రంలో తగిన మంత్రిత్వశాఖకు నివేదిస్తుందని వివరించింది. బిల్లులో ఉపయోగించిన భాష, బిల్లు రూపకల్పన లేదా రాజ్యాంగ చెల్లుబాటుకు సంబంధించిన అంశాలను కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖకు సూచిస్తారు. ఆయా అంశాలపై ఆయా మంత్రిత్వశాఖలు 15 రోజుల్లోగా కేంద్ర హోం మంత్రిత్వశాఖకు తిరిగి నివేదించాల్సి వుంటుంది. ఒకవేళ ఆలస్యం జరిగితే, సంబంధిత మంత్రిత్వశాఖ అందుకు కారణాలను కూడా తెలియజేయాల్సి వుంటుంది. గరిష్టంగా నెల రోజుల వ్యవధిలోగా ఇలా చేయడంలో విఫలమైతే ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని అర్థం చేసుకోవాల్సి వుంటుంది.

రాష్ట్రపతికి రిజర్వ్ చేసిన బిల్లులపై నిర్ణయం కోసం మూడు మాసాల కాలపరిమితి నిర్దేశించారని ఒఎంను పరిశీలిస్తే స్పష్టమవుతోంది. అత్యవసర ప్రాతిపదికన ఆర్డినెన్స్‌ల పరిష్కారానికి మూడు వారాల గడువును నిర్దేశించారని జస్టిస్ పార్ధివాలా ఆ తీర్పులో పేర్కొన్నారు.

రాష్ట్ర బిల్లుకు సంబంధించి అభ్యంతరాలు ఏవైనా వుంటే వాటిని తదుపరి వివరణల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాల్సి వుంటుందని ఫిబ్రవరి 4, 2016న జారీచేసిన రెండో ఆఫీస్ మెమోరాండం పేర్కొంటోంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వివరణలను కేంద్ర మంత్రిత్వశాఖ తెలుసుకోవాలన్నదే లక్ష్యమని సుప్రీం తీర్పు పేర్కొంది. అందుకు ఒకనెల కాలపరిమితి నిర్దేశించబడిందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ఆ ఒక నెల కాలపరిమితికి సహకరించాల్సి వుంటుందని కోర్టు పేర్కొంది. అలా కాకుండా ఆలస్యం జరిగితే, ఈ విషయమై కేంద్రం నిర్ణయాన్ని వాయిదా వేసే పరిస్థితి వస్తుందని పేర్కొంది.

వివిధ పక్షాలకు ఇలా కాల పరిమితులు విధించాలనే ఆలోచన అనైతికమైనదేమీ కాదు. లేదా 201 అధికరణ కింద పేర్కొన్న రాజ్యాంగ విధుల నిర్వహణకు సంబంధించి ప్రక్రియకు విరుద్ధమూ కాదు. ఈ రెండు ఆఫీస్ మెమోరాండాలు కూడా ఇదే భావనను మరింత స్పష్టం చేస్తున్నాయి. త్వరితంగా లేదా కచ్చితమైన కాలపరిమితితో కూడిన చర్య తీసుకోవాలన్నది 201వ అధికరణ లక్ష్యాలు, ఉద్దేశాలకు అనుగుణంగానే వుందని జస్టిస్ పార్ధివాలా ఆ తీర్పులో వివరించారు.



సిపిఎం సీనియర్ నేత రఘుపాల్ పరిస్థితి విషమం

- బివి రాఘవులు, డిజి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి -హైదాబాద్ బ్యూరో

సిపిఎం సీనియర్ నేత, హైదరాబాద్ నగర మాజీ కార్యదర్శి జి.రఘుపాల్ పరిస్థితి విషమంగా ఉంది. కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్ సిటీ న్యూరో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం ఆయనను సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సిపిఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ డిజి నరసింహారావు, నగర మాజీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు బి.గోపి, జోగు ప్రకాష్, సుంచు విజేందర్ తదితరులు పరామర్శించారు. రఘుపాల్ భార్య భారతి, కుమారుడు డాక్టర్ గోపాల్‌రెడ్డి, కోడలు డాక్టర్ విజయలక్ష్మి, అల్లుడు ఎం.శ్రీనివాస్, కూతురు తిరుమలతో బివి రాఘవులు మాట్లాడారు.

నీట్-యుజి ఫలితాలను వెల్లడించవచ్చు

- మధ్యప్రదేశ్ హైకోర్టు అనుమతి

భోపాల్ : దేశవ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో నీట్-యుజి ఫలితాలను వెల్లడించడానికి మధ్యప్రదేశ్ హైకోర్టు అనుమతించింది. ఈ ఫలితాల వెల్లడిపై తాత్కాలికంగా స్టే విధిస్తూ ఈ నెల 15న జారీ చేసిన ఆదేశాలను హైకోర్టు సవరించింది. విద్యార్థులు విద్యుత్ అంతరాయాన్ని ఎదుర్కొన్న ఇండోర్‌లో 11 కేంద్రాల్లో మాత్రం ఫలితాలు వెల్లడించరాదని పేర్కొంది. విద్యుత్ అంతరాయం వల్ల ఇబ్బందిపడిన కేంద్రాల వివరాలను రెండు రోజుల్లోగా అందజేస్తామని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయస్థానానికి హామీ ఇవ్వడంతో శుక్రవారం జస్టిస్ సుబోధ్ అభ్యంకర్ ఈ ఆదేశాలను సవరించారు.

వైద్య విద్యనభ్యసించాలని భావిస్తున్న విద్యార్థిని ఒకరు ఈనెల 15న వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ అభ్యంకర్ దేశవ్యాప్తంగా ఫలితాల వెల్లడిపై తాత్కాలికంగా స్టే విధించారు. ఈ నెల 4న జరిగిన ఎంట్రన్స్ పరీక్ష సందర్భంగా సదరు విద్యార్థినికి సరైన వసతులు అందించడంలో అధికారులు విఫలమయ్యారని పేర్కొంది. వాతావరణం అననుకూలంగా వుండడంతో ఈ నెల 4వ తేదీన ఇండోర్‌లో చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దాంతో ఆ విద్యార్థిని హైకోర్టును ఆశ్రయించింది. తాను పరీక్ష రాసే కేంద్రంలో రెండు గంటలపాటు విద్యుత్ లేకపోవడంతో తాను సరిగా పరీక్ష రాయలేకపోయానని ఆమె పేర్కొంది. ఇండోర్‌లో మొత్తంగా 11 కేంద్రాల్లో ఈ పరిస్థితి నెలకొందని తుషార్ మెహతా చెప్పారు. ఇతర కేంద్రాల్లో ఫలితాలను వెల్లడించేందుకు ఎన్‌టిఎను అనుమతించాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో 15వ తేదీ తీర్పును సవరిస్తూ నీట్ ఫలితాల వెల్లడికి న్యాయస్థానం పచ్చజెండా ఊపింది.

అమెరికా పౌరసత్వం కోసం రియాల్టీ టివి షో !

- ట్రంప్ ప్రభుత్వ యోచన

వాషింగ్టన్ : అమెరికా పౌరసత్వం కోసం రియాల్టీ టివి షోను నిర్వహించాలని అమెరికా ప్రభుత్వం భావిస్తోంది. ఈ షోలో వలసదారులు అమెరికా పౌరసత్వం కోసం పోటీపడతారు. అమెరికా హోం ల్యాండ్ భద్రతా విభాగం (డిహెచ్‌ఎస్) ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ఈ ఆలోచన గురించి డిహెచ్‌ఎస్‌ను సంప్రదించగా, ఆలోచన చేస్తున్న మాట వాస్తవమేనని, ఇంతవరకు ఇది ఎలాంటి ఆమోదం లేదా తిరస్కరణ పొందలేదని తెలిపింది. ఆమోదించడం లేదా తిరస్కరణకు ముందుగా దీనిపై కూలంకషంగా పరిశీలన జరపాల్సిన అవసరం వుందని పేర్కొంది. ఈ దేశంలో దేశభక్తిని, పౌర బాధ్యతలను పునరుద్ధరించాల్సిన అవసరం వుందని, అందుకోసం ఇలాంటి అంశాలను పరిశీలిస్తున్నామని ప్రజా వ్యవహారాల సహాయ మంత్రి ట్రిసియా మెక్ లాఫ్లిన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కెనడియన్ అమెరికన్ రాబ్ వోర్స్‌ఫ్ ఈ షో ఆలోచనను ప్రతిపాదించారు. ఇందులో పోటీ పడేవారు తాము అమెరికన్ అని నిరూపించుకోవాల్సి వుంటుంది. ఇందులో ఓడిపోతే వెంటనే దేశం నుండి బయటకు పంపివేస్తారు. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి వలసదారులను బయటకు పంపాలని చూస్తున్నారు. ఇందులో భాగంగా ఆఫ్ఘనిస్తాన్, హైతి, వెనిజులా వంటి దేశాలకు చెందిన పౌరులకు కల్పించిన టిపిఎస్ (తాత్కాలిక రక్షణ హోదా)ను తొలగించాలని ప్రయత్నిస్తున్నారు.

వీసా గడువు దాటితే తిరిగి వెళ్లిపోండి..

- భారతీయులకు అమెరికా ఎంబసీ హెచ్చరిక

వాషింగ్టన్ : వీసా గడువు ముగిసినా అమెరికాలో ఉంటున్న భారతీయులు వెంటనే స్వదేశానికి వెళ్లిపోవాలని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం కీలక అడ్వైజరీ జారీచేసింది. ఈ అంశంలో ఉల్లంఘనలకు పాల్పడితే ఎదుర్కోవాల్సిన తీవ్ర పరిణామాలను స్పష్టంగా వెల్లడించింది. వీసా రూల్స్‌ను ఉల్లంఘిస్తే బహిష్కరణ ముప్పు తప్పదని, భవిష్యత్తులో అమెరికాకు ప్రయాణంపై శాశ్వత నిషేధం ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టింది.

టూరిస్ట్, స్టూడెంట్స్, వర్క్ పర్మిట్స్ సహా వివిధ వీసాలపై అమెరికాలో నివసిస్తున్న భారతీయులను ఉద్దేశించి అమెరికా ఎంబసీ ఈ హెచ్చరిక చేసింది. అమెరికా ప్రయాణంపై నిషేధం పడితే భవిష్యత్తులో అక్కడ చదువు, వృత్తి, వ్యక్తిగత అవకాశాలపై గణనీయమైన ప్రభావం పడనుంది. నిర్దేశిత గడువు ముగిసినా అనుకోని పరిస్థితుల కారణంగా దేశాన్ని వీడటంలో ఇబ్బందులు ఏర్పడితే.. చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోకుండా ఉండేందుకు యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యుఎస్‌సిఐఎస్) ను సంప్రదించాలని ఎంబసీ అధికారులు సూచించారు.

పోలీసుల అదుపులో ఇద్దరు వ్యక్తులు

ప్రజాశక్తి- విజయనగరం కంటోన్మెంట్

ఇంటెలిజెన్సుకు వచ్చిన సమాచారం మేరకు విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఇచ్చిన సమాచారంతో ఒక ఇంట్లో తనిఖీలు నిర్వహించగా పేలుళ్లకు వినియోగించే అమ్మోనియా, సల్ఫర్, అల్యూమినియం పౌడర్ లభించినట్లు పోలీసులు తెలిపారు. విచారణలో రెహ్మాన్ ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. వీర్దిద్దని కోర్టులో హాజరు పర్చనున్నట్లు పోలీసులు తెలిపారు.

గూఢచర్య ఆరోపణలతో హర్యానా యూట్యూబర్ అరెస్టు

- పంజాబ్, హర్యానాలో ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

హిసార్ : పాకిస్తాన్ నిఘా సంస్థలకు సున్నితమైన సమాచారాన్ని చేరవేశారనే ఆరోపణలతో హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఆమెపై అధికార రహస్యాల చట్టం, భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కోర్టు ఆమెకు ఐదు రోజులు పోలీస్ రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. 'ట్రావెల్ విత్ జో' యూట్యూబ్ చానెల్ నడుపుతున్న హర్యానాలోని హిసార్‌కు చెందిన జ్యోతి మల్హోత్రా ఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌లో పనిచేస్తున్న సిబ్బందితో సంప్రదింపులు జరిపినట్లు ఆరోపణలున్నాయి. గూఢచర్యానికి పాల్పడుతున్నారనే ఆరోపణలతో భారతదేశం ఆ పాకిస్తాన్ అధికారిని ఈ నెల 13న బహిష్కరించింది. ఇవే ఆరోపణలతో మాలెర్‌కోటకు చెందిన ఓ మహిళతో సహా ఇద్దరిని పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు.

ముంబైలో ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదులు అరెస్టు

ముంబై : ముంబై విమానాశ్రయంలో ఉగ్రవాద సంస్థ ఐసిస్ స్లీపర్ సెల్‌లో భాగమైన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అధికారులు శనివారం తెలిపారు. 2023లో మహారాష్ట్రలోని పూణేలో ఐఈడీల తయారీ, పరీక్షలకు సంబంధించిన కేసులో వీరిద్దరూ వాంటెడ్‌గా ఉన్న అబ్దుల్లా ఫయాజ్ షేక్ అలియాస్ 'డైపర్‌వాలా', తల్హా ఖాన్‌లను అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరు ఇండోనేషియాలోని జకార్తా నుండి భారత్‌కు తిరిగి వచ్చారని.. గత రాత్రి ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ 2 వద్ద ఇమ్మిగ్రేషన్ అధికారులు వారిని అరెస్టు చేశారని తెలిపారు. అనంతరం ఎన్ఐఎ బృందం వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఇద్దరు నిందితులు రెండేళ్లకు పైగా పరారీలో ఉన్నారని.. వారిపై ముంబైలోని ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్లు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

అప్పుల ఊబిలో జెన్‌కో

(మొదటి పేజీ తరువాయి)

చెబుతున్నారు. కొరత వల్ల ప్లాంట్‌లో ఉత్పత్తి కూడా తగ్గింది. ప్లాంట్ సామర్థ్యం 1650 మెగావాట్లు కాగా శనివారం 900 మెగావాట్ల ఉత్పత్తే వచ్చినట్లు సమాచారం.

తెలంగాణ బకాయిల సంగతేంటి?

తెలంగాణ ప్రభుత్వం నుంచి జెన్‌కోకు సుమారు రూ.7,703కోట్లు రావాల్సి ఉంది. రాష్ట్రవిభజన సమయంలో తెలంగాణ డిస్కమ్‌లకు అందించిన విద్యుత్‌కు గాను ఆ రాష్ట్రం ఆ మొత్తాన్ని చెల్లించాల్సిఉంది.. పదేళ్లు దాటినా ఈ బకాయిల అంశం అపరిష్కృతంగానే ఉంది. 10 నెలల క్రితం రెండు రాష్ట్రాల్లో కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు పెండింగ్ అంశాలతో పాటు జెన్‌కో బకాయిలపై చర్చించాయి. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమయ్యి మంత్రులు, అధికారులతో కలిసి కమిటీని కూడా ఏర్పాటు చేశాయి. మంత్రులు, అధికారులు పలుసార్లు సమావేశమయ్యారు. అయినా ఈ బకాయిల పరిస్థితి స్పష్టత రాలేదు.

తక్షణమే దాడులు ఆపండి

- గాజాలో కాల్పుల విరమణకు అరబ్ దేశాల పిలుపు


అరబ్ దేశాల నేతలు

బాగ్దాద్ : గాజాలో దాడులకు స్వస్తి పలకాలని, తక్షణమే కాల్పుల విరమణ జరిగేలా చర్యలు తీసుకోవాలని అరబ్ నేతలు పిలుపునిచ్చారు. గాజాలో ఉధృతంగా బాంబు దాడులు జరుపుతూ మొత్తంగా విధ్వంసం చేసిన ఇజ్రాయిల్ ఇప్పుడు అక్కడ నుండి పాలస్తీనియన్లను బయటకు పంపేయాలని చూస్తోందని అరబ్ నేతలు విమర్శించారు. గాజాలో యుద్ధమంటూ ఆగితే ఆ ప్రాంతంలో పునర్నిర్మాణ కార్యకలాపాలు చేపట్టడానికి సాయమందిస్తామని అరబ్ నేతలు హామీ ఇచ్చారు. శనివారం బాగ్దాద్‌లో జరుగుతున్న అరబ్ నేతల సదస్సులో ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతాహ్ అల్ శిశి మాట్లాడుతూ, ఇజ్రాయిల్ చర్యలు వ్యవస్థాగతమైన నేరాలని విమర్శించారు. పాలస్తీనియన్ల జాతిని నిర్మూలించడమే వారి ఉద్దేశమని అన్నారు. గాజా శాంతి చర్చలకు ప్రధాన మధ్యవర్తుల్లో ఒకరుగా ఈజిప్ట్ అధ్యక్షుడు వ్యవహరించారు. ఈ సదస్సుకు ఆతిధ్యమిచ్చిన ఇరాక్ ప్రధాని మహ్మద్ షియా అల్ సుదాని మాట్లాడుతూ, ఇజ్రాయిల్ మారణకాండకు పాల్పడుతోందని విమర్శించారు. గాజా, లెబనాన్‌లకు చెరో రెండు కోట్ల డాలర్లను సాయంగా అందిస్తామని హామీ ఇచ్చారు. సదస్సునుద్దేశించి ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ ప్రసంగిస్తూ, పాలస్తీనియన్లను సామూహికంగా ఇలా శిక్షించడాన్ని ఎవరూ సమర్ధించబోరని వ్యాఖ్యానించారు. ఊచకోతను నివారించడానికి చర్యలు తీసుకుంటారా? లేదా? అని యుఎన్ ఎయిడ్ చీఫ్ టామ్ ఫ్లెచర్... భద్రతా మండలిని ప్రశ్నించారు.

ఇజ్రాయిల్ దాడుల్లో వందమంది మృతి

ఆరు వారాల పాటు కాల్పుల విరమణ అమలు చేసిన ఇజ్రాయిల్, మార్చిలో కాల్పుల విరమణను ఉల్లంఘించి తిరిగి సైనిక చర్యలకు పాల్పడడం ఆరంభించింది. గాజాలో అత్యంత దారుణంగా బాంబు దాడులకు తెగబడుతోంది. శుక్రవారం నాటి దాడుల్లో వందమంది మరణించారు. గత కొన్ని రోజులుగా జరుగుతున్న దాడుల్లో వందలాదిమంది మరణించారు.

గాజాలో మొత్తంగా ఆహారం అందకుండా దిగ్బంధనం చేసింది. కాల్పుల విరమణకు చర్చలను పునరుద్ధరించి, ఆహారం, మందుల సరఫరాలు గాజాకు అందేలా చూడాలని ఇజ్రాయిల్‌పై అంతర్జాతీయంగా ఒత్తిడి పెరుగుతోంది. మిగిలిన బందీలను విడిచిపెట్టేలా హమాస్‌పై ఒత్తిడి తీసుకువచ్చేందుకు గానూ పెద్ద ఎత్తున మిలటరీ ఆపరేషన్ చేపట్టినట్లు ఇజ్రాయిల్ రక్షణమంత్రి శనివారం తెలిపారు. అరబ్ దేశాల్లో ట్రంప్ పర్యటన ముగిసిన వెంటనే ఈ మిలటరీ ఆపరేషన్ ప్రారంభించారు.


డిస్కంల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎస్ విజయానంద్

గాలివానల పట్ల అప్రమత్తం

- విద్యుత్ సరఫరా సమస్యలపై తక్షణమే స్పందించాలి
- డిస్కంల అధికారులతో సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముందస్తు రుతుపవనాల ప్రభావంతో ఏర్పడే గాలివానల నేపథ్యంలో రాష్ట్ర విద్యుత్ సంస్థలు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆదేశించారు. ట్రాన్స్‌కో, డిస్కంల అధికారులతో విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల ఒకటి నుంచి 16వ తేదీ మధ్య గాలివనలు వల్ల విద్యుత్ మౌలిక సదుపాయాలపై తీవ్రమైన ప్రభావం పడిందని విజయానంద్ చెప్పారు. డిస్కంలు త్వరితంగా స్పందించి 684 ఫీడర్లు, 3,611 స్తంభాలు, 844 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు పునరుద్ధరించడంలో మంచి పనితీరు కనపరిచాయని అభినందించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం వచ్చినా, తక్షణమే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని చెప్పారు. డిస్కంల సిఎమ్‌డిలు రోజువారి పరిస్థితిని సమీక్షించాలని, ఎఇ నుంచి ఎస్ఇ వరకు ఫీల్డ్ స్థాయిలో సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. 24 గంటలు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, తద్వారా ఎమర్జెన్సీ సమయంలో తక్షణ స్పందన, ఫిర్యాదుల పరిష్కారం వేగంగా జరుగుతాయని తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనులు, షట్‌డౌన్‌ల విషయంలో వినియోగదారులు, ప్రజా ప్రతినిధులకు ముందుగా మీడియా, మొబైల్‌కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరంతర విద్యుత్ సరఫరా, వేగవంతమైన స్పందన, పారదర్శక సమాచారం ఇచ్చే విధంగా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రతి డిస్కం డైరెక్టర్‌కు జిల్లాల బాధ్యతలు అప్పగించాలని ఆయన ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో, విద్యుత్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. డిస్కంలు పీక్‌లోడ్ మేనేజ్‌మెంట్ బలోపేతం చేయాలని తెలిపారు. ఈ నెల 13న రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 12,600 మెగావాట్లుగా నమోదైందన్నారు. జూన్ నుంచి నవంబర్ మధ్యకాలంలో రోజువారీ డిమాండ్ 218 నుంచి 235 మిలియన్ యూనిట్ల వరకు ఉండే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు డిస్కంలు పీక్ సమయంలో పవర్ స్వాపింగ్, పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా విద్యుత్ కొనుగోలు వంటి వ్యూహాత్మక చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. వ్యవసాయ రంగానికి 9 గంటల విద్యుత్ సరఫరా అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిస్కంల సిఎమ్‌డిలు ఐ పృథ్వీతేజ్, కె సంతోషరావు, పి పుల్లారెడ్డి, ట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టర్ ఎకెవి భాస్కర్, టెక్నికల్ డైరెక్టర్ జెవి రావు తదితరులు పాల్గొన్నారు.

ఒడిశాలో పిడుగుపాటుకు తొమ్మిది మంది మృతి

భువనేశ్వర్ : రాష్ట్రంలో వేర్వేరు సంఘటనల్లో పిడుగుపాటుకు తొమ్మిది మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో ఆరుగురు మహిళలు ఉన్నట్లు సమాచారం. కోరాపుట్ జిల్లాలో ముగ్గురు, జాజ్‌పూరు, గంజాం జిల్లాల్లో ఇద్దరు చొప్పున, డెంకనల్, గజపతి జిల్లాల్లో ఒక్కొకరు చొప్పున మరిణించనట్లు పేర్కొన్నారు. అధికారుల కథనం ప్రకారం... కోరాపుట్ జిల్లాలోని లక్ష్మీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పరిడిగూడ గ్రామంలో ముగ్గురు మహిళలు మరణించారు. ఒక వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. పరిడిగూడ గ్రామాలోని ఒకే కుటుంబానికి చెందిన హింగు మండింగా, బ్రూధి మండింగా (60), ఆమె మనవరాలు కాసా మండింగా (18), కుంభార్గూడ గ్రామానికి చెందిన అంబికా కాశి (35) పొలంలో పనిచేస్తుండగా భారీ వర్షం పడింది. దగ్గరలోని గుడిసెలో తలదాచుకోవడానికి వెళ్లగా, పిడుగు పడటంతో ఈ సంఘటన చేటుచేసుకున్నట్లు తెలిపారు. హింగు మండింగా తీవ్రంగా గాయపడగా, మిగిలిన ముగ్గురు మరణించారు. జాజ్‌పూర్ జిల్లాలోని నార్వేబియన్ ధర్మశాల ప్రాంతంలో పిడుగుపాటుకు గురై ఇద్దరు బాలురు మరణించారు. మృతులను జెనాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బురుసాహి గ్రామానికి చెందిన తారే హెంబ్రం (15), తుకులు చట్టర్ (12) గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. గంజాం జిల్లాలోని కటిసూర్యనగర్ తహసీల్‌లోని బరిదా గ్రామంలో ఓం ప్రకాష్ ప్రధాన్ అనే 7వ తరగతి విద్యార్థి పిడుగుపాటుకు మరణించాడు. బెలగుంత ప్రాంతంలోని 23 ఏళ్ల మహిళ ఇలాంటి సంఘటనలో మరణించింది. ధెంకనాల్‌లోని దాశిపూర్ పంచాయతీ పరిధిలోని కుసుముండియా గ్రామంలో పిడుగుపాటుకు గురై సురుషి బిష్వాల్ (40) అనే మహిళ మరణించింది. గజపతిలోని మోహన ప్రాంతంలో ట్రాక్టర్ నుండి ఇటుకలను దించుతుండగా పిడుగుపాటుకు గురై ఒక మహిళ మరణించింది.

ప్రపంచానికి 'సిందూర్' సందేశం

(మొదటి పేజీ తరువాయి)

చెందిన సర్ఫరాజ్ అహ్మద్, ఆప్ పార్టీకి చెందిన విక్రమ్‌జిత్ సాహ్నే, బిజెపికి చెందిన అనురాగ్ ఠాకూర్, అపరాజిత సారంగి, రాజీవ్ ప్రతాప్ రూడీ, సమిక్ భట్టాచార్య, బ్రిజ్ లాల్ కూడా వివిధ బృందాల్లో ఉన్నారు. ఏడు ప్రతినిధి బృందాల్లో నాలుగింటికి అధికార ఎన్‌డిఎ, మూడింటికి ప్రతిపక్ష ఇండియా బ్లాక్ సారథ్యం వహించనున్నాయి.

కేంద్రానిది దుర్మార్గపు మనస్తత్వం : జైరామ్ రమేష్

కేంద్రప్రభుత్వం "దుర్మార్గపు మనస్తత్వం"తో "గేమ్స్ ఆడుతోందని" కాంగ్రెస్ రేత జైరామ్ రమేష్ పేర్కొన్నారు. ఎక్స్‌లో చేసిన పోస్టులో ఆయన నలుగురు ఎంపీల పేర్లను ప్రతిపాదించాలని కేంద్రం కోరిందని, ఆ మేరకు శుక్రవారం మధ్యాహ్నం కాంగ్రెస్ పార్టీ ఆనంద్ శర్మ, గౌరవ్ గొగోయ్, సయ్యద్ నసీర్ హుస్సేన్, రాజ బ్రార్ పేర్లను పంపినట్లు జైరాం రమేష్ చెప్పారు. వీరిలో ఎవరికి అవకాశం లభించలేదుని,జాబితాలో లేని శశిథరూర్‌ను అనూహ్యంగా ఎంపిక చేశారని ఆయన పేర్కొన్నారు.

వరుణుడి జోరు

- బెంగళూర్, కొల్‌కత మ్యాచ్‌కు ఆటంకం

బెంగళూర్ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో భాగంగా బెంగళూర్‌లోని చిన్నస్వామి స్టేడియంలో శనివారం రాయల్ చాలెంజర్స్ బెంగళూర్, కొల్‌కత నైట్‌రైడర్స్ మ్యాచ్‌కు వరుణుడు ఆటంకం కలిగించాడు. భారత్, పాకిస్థాన్ సరిహద్దు ఉద్రిక్తతలతో ఐపీఎల్18 మే 9న వాయిదా పడగా.. శనివారం నుంచి మళ్లీ మొదలైంది. రీ షెడ్యూల్‌లో తొలి మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు మ్యాచ్ ఆరంభం కావాల్సి ఉండగా.. భారీ వర్షంతో టాస్ వేయడానికి కూడా సాధ్యపడలేదు. రాత్రి పది గంటల వరకు కుండపోత కొనసాగటంతో ఇక ఆట జరిగేది అనుమానంగానే మారింది!. గ్రూప్ దశలో 11 మ్యాచుల్లో 8 విజయాలతో బెంగళూర్ ప్లే ఆఫ్స్ బెర్త్ లాంఛనం చేసుకోగా.. కొల్‌కత నైట్‌రైడర్స్ 12 మ్యాచుల్లో ఐదు విజయాలతో ప్లే ఆఫ్స్ రేసులో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమవుతోంది.

దళితుల ఓట్లే కీలకం..

- బీహార్ అసెంబ్లీ ఎన్నికలపై పార్టీల వ్యూహం
- నితీశ్ సర్కార్‌పై మైనార్టీలో అసంతృప్తి

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో దళితుల ఓట్లు కీలకంగా మారనున్నాయి. ఎన్నడూలేని విధంగా అంబేద్కర్ చిత్రపటాలు, విగ్రహాలవైపు రాజకీయ పార్టీలు దౌడుతీస్తున్నాయి. దళితులంటే ఎనలేని ప్రేమను ఒలకబోస్తున్నాయి. మరోవైపు అధికారం దగ్గరికి వచ్చినట్టే వచ్చి చేజారటంతో ఈసారైనా గద్దెనెక్కాలని ఆర్‌జెడి ప్రయత్నాలు చేస్తోంది. కేంద్రంలోని బిజెపి, బీహార్‌లోని నితీశ్ సర్కార్‌ను టార్గెట్ చేయటంతో రాజకీయం మరింత వేడెక్కుతోంది. ఎన్‌డిఎ కూటమిలోని నితీశ్ సర్కార్ మాత్రం మోడీకి తానా..అంటే తందానా అనటం బీహార్ ఓటర్లకు మింగుడు పడటం లేదు.

దర్భంగా : బీహార్ అసెంబ్లీ ఎన్నికలు రసవత్తరంగా మారబోతున్నాయి. ఇక్కడ ముస్లింలు, దళితుల ఓట్లే కీలకంగా మారటంతో..రాజకీయ పార్టీలు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. ఇప్పటికే ఎన్‌డిఎ సంకీర్ణ పార్టీ అయిన జెడియు అధినేత, సిఎం నితీశ్ సర్కార్ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండగా స్థానిక ఓటర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నితీశ్‌కు ఉన్న నిరాదరణను పసిగట్టిన బిజెపి.. పహల్గాం దాడి కన్నా ముందే అగ్రనేతల్ని రంగంలోకి దింపింది. దీన్ని ఓట్లుగా మలుచుకునే ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

రంగంలో దిగిన కాంగ్రెస్

అక్టోబర్-నవంబర్‌లలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ముఖ్యమైన రాష్ట్రం బీహార్ కావటంతో.. గత ఐదు నెలల్లోనే రాహుల్ గాంధీ బీహార్‌లో నాలుగుసార్లు పర్యటించారు. తరచుగా ఆయన బీహార్‌లో పర్యటిస్తున్న తీరుతో కాంగ్రెస్ ఆర్‌జెడితో కలిసి దూకుడుగా ఎన్నికల వ్యూహాన్ని అనుసరించబోతోందని స్పష్టమైన సంకేతాలిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కుల గణనను ప్రకటించి, ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఎస్సీ-ఎస్టీ కమ్యూనిటీ విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేసిన తర్వాత దర్భంగాలో జరిగిన శిక్షా న్యాయ్ సంవాద్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మళ్ళీ ఈ అంశాన్ని లేవనెత్తారు. ఎస్సీ-ఎస్టీ సబ్ ప్లాన్ కింద నిధులు ఇవ్వనందుకు నితీశ్ కుమార్ ప్రభుత్వంపై కూడా ఆయన దాడి చేశారు.

ఎస్సీ-ఎస్టీ సబ్ ప్లాన్ ఫండ్ అనేది ఒక రాష్ట్ర ప్రణాళిక బడ్జెట్‌లో ఒక స్థిర భాగం. ఇది షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సామాజిక-ఆర్థిక అభివృద్ధికి కేటాయించబడింది. రాహుల్ గాంధీ డిమాండ్ ప్రకారం బలహీన వర్గాలకు బీహార్‌లో ఈ నిధి అందడం లేదు. దీన్ని రాజకీయ అస్త్రంగా మలుచుకున్నట్టు తెలుస్తోంది.

కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీని చేరుకోవడానికి దూకుడుగా ప్రయత్నిస్తోంది. ఈ ప్రయత్నంలో భాగంగా... కొన్ని నెలల కిందట అక్కడి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అఖిలేశ్ ప్రసాద్ సింగ్‌ను తొలగించి, దళిత నాయకుడు రాజేశ్ రామ్‌కు ఈ బాధ్యతను అప్పగించింది. దళిత సమాజానికి చెందిన సుశీల్ పాసినిని బీహార్ సహ-ఇన్‌చార్జిగా కూడా పార్టీ నియమించింది. రాష్ట్రంలో కార్యక్రమాలు కాంగ్రెస్ తన సాంప్రదాయ దళిత ఓటు బ్యాంకును తిరిగి పొందడానికి ప్రయత్నిస్తున్నట్టు సూచిస్తున్నాయి. బీహార్‌లో దళితుల జనాభా దాదాపు 19 శాతం. ఒకప్పుడు దళితులు కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంకుగా ఉండేవారు.

2005 తర్వాత నితీశ్ కుమార్ పార్టీ అయిన జెడియు వైపు మొగ్గు చూపారు. తాజా ఎన్నికల్లో దళితులు, ఒబిసిలు మహా కూటమి వైపు మొగ్గుచూపేలా ఇప్పటి నుంచే ఆర్‌జెడి ప్రయత్నాలు చేస్తోంది. బీహార్ శాసనసభలోని 243 స్థానాలు ఉండగా.. 38 స్థానాలు షెడ్యూల్డ్ కులాలకు , 2 స్థానాలు షెడ్యూల్డ్ తెగలకు రిజర్వ్ చేయబడ్డాయి.

వేసవి విడిది



చాలా బహుమతులు వచ్చాయి..

హాయ్ ఫ్రెండ్స్..

మేము సిద్ధిపేట జిల్లా అనంత సాగర్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాం మాకు మా బడి అంటే చాలా ఇష్టం. మేము కథలు, కవితలు రాస్తాం. పాటలు బాగా పాడతాం. చెస్ ఆడతాం. భరత నాట్యం, డ్యాన్స్ చేస్తాం. అల్లరి చేసినా, పోటీ పడి చదువుతాం. మేము రాసిన కథలు చాలా పత్రికల్లో ప్రచురితమయ్యాయి. విశ్వతేజ -15, అక్షర -2, రవిత్రేయని -2, విఘ్నేష్ -2, హిమబిందు -1 రాశారు.

మాకు బహుమతులు కూడా చాలా వచ్చాయి. విశ్వతేజ కథల్లో, వర్షిణి కవితల్లో హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్ వారి బహుమతులు తీసుకున్నారు. రవిత్రేయని కవితల్లో సిద్ధిపేటలో పెందోట బహుమతి తీసుకున్నది. అక్షర సేద్యం ఫౌండేషన్ నిర్వహించిన వ్యాస రచన పోటీలో అక్షర ప్రథమ బహుమతిగా వేయి రూపాయలు గెలుచుకుంది. హిమ బిందు అటెండెన్స్ టాపర్‌గా బహుమతి తీసుకుంది. దివ్య డ్రాయింగ్‌లో, శ్రీనిత్ సైన్స్ ప్రాజెక్టులో, మనోజ్ పాటల్లో బహుమతులు అందుకున్నారు. పాఠశాలలో నిర్వహించే ప్రతి కార్యక్రమంలో మేము ఉత్సాహంగా పాల్గొంటాం.

మా ఉపాధ్యాయులు మమ్మల్ని అన్ని విషయాల్లో ప్రోత్సహిస్తారు. కథల పుస్తకాలు తెచ్చి ఇస్తారు. ఖాళీ సమయంలో గ్రంథాలయానికి వెళ్ళి పుస్తకాలు చదువుతాం. ఈ సెలవుల్లో చేతి రాత అభ్యసనం చేస్తున్నాం. బాగా చదివి తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నది మా కోరిక.

- రవిత్రేయని, అక్షర, హిమబిందు, వర్షిణి, దివ్య, విశ్వతేజ, విఘ్నేష్, శ్రీనిత్, మనోజ్, ఆరవ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అనంత సాగర్, సిద్దిపేట జిల్లా.

బొమ్మల కొలువు



జవాన్

తన కుటుంబాన్ని లెక్క చేయక
దేశం కోసం పనిచేసేవాడు జవాన్
తన ప్రాణాన్నే పణంగా పెట్టి
బార్డర్‌లో కాపుకాసేవాడు జవాన్
మనం కంటి నిండా నిద్రపోవడానికి
తన నిద్ర మానుకునేవాడు జవాన్
శత్రువులకు ఎదురు నిలిచి
ధైర్యంగా పోరాడేవాడు జవాన్
తిండి తిప్పలు లేక
ప్రజల ప్రాణాలను కాపాడువాడు జవాన్
అలాంటి జవాన్లకు నా సెల్యూట్!



- ఎం.వెంకట సుప్రజ, 8వ తరగతి, జి.ప.ఉ.పా. నర్సింహుల పల్లి, పెద్దపల్లి జిల్లా.



ఎం. నితీష్, 5వ తరగతి, పదిరికుప్పం, కర్వేటినగర్, చిత్తూరు జిల్లా.





పి.జాహ్నవి సాయి, 8వ తరగతి, ఎస్.కె.వి.టి. ప్రభుత్వ ఉన్నతపాఠశాల, రాజమహేంద్రవరం.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496



'థగ్‌లైఫ్' ట్రైలర్ విడుదల

తమిళ కథానాయకుడు కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో నిర్మితమైన సినిమా 'థగ్‌లైఫ్'. ఈ సినిమా ట్రైలర్‌ను చిత్ర యూనిట్ ప్రతినిధులు శనివారం ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రంలో శింబు, త్రిషా కృష్ణన్, ఐశ్వర్యా లక్ష్మీ, జోజూ జార్జ్ ఇతర కీలకపాత్రల్లో నటించారు. కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్, మణిరత్నం, శివ అన్నాత్తే, ఉదయనిధి స్టాలిన్ ఈ సినిమాను నిర్మించారు. జూన్ 5న ఈ సినిమా విడుదల కానుంది. కమల్‌హాసన్ 'విక్రమ్', శివకార్తికేయన్ 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన ఎన్.సుధాకర్ రెడ్డి, ఈ సినిమాను శ్రేష్ఠ్ మూవీస్ బ్యానర్‌పై తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈనెల 24న హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ఆడియో లాంచ్, 29న విశాఖపట్టణంలో తెలుగు వెర్షన్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నట్లుగా మేకర్లు అధికారికంగా వెల్లడించారు. ఈ రెండు ప్రమోషనల్ ఈవెంట్స్‌కు ముందు చెన్నైలోని సాయిరామ్ కాలేజీలో సంగీత దర్శకుడు ఎఆర్ రెహమాన్ లైవ్ ఫెర్ఫార్మెన్స్‌తో ఆడియో లాంచ్ ఈవెంట్ ఉంటుందని వివరించారు. పాన్ ఇండియా స్థాయిలో ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో నాయకుడు అనంతరం దాదాపు 38 సంవత్సరాల తర్వాత 'థగ్‌లైఫ్' రానుంది.

నాన్నకు చెడ్డ పేరు రానీయను

మంచు విష్ణు



'నేను, ప్రభాస్ బాగుండే మంచి స్నేహితులం. అతడు ఎంత గొప్ప నటుడో అతడికి కూడా తెలియదు. ప్రభాస్‌లా చాలా తక్కువమంది ఉంటారు. ఇంత పెద్ద స్టార్ అయ్యాక కూడా సింపుల్‌గా ఉండటం అతడి గొప్పతనం. మేం ఎప్పటికీ సోదరులమే. రక్తం పంచుకుని పుట్టినవాళ్లే ఈ రోజు నా పతనాన్ని కోరేటప్పుడు.. ప్రభాస్-నేను రక్తం పంచుకుని పుట్టలే కానీ నా మంచి కోరి, నా సక్సెస్ కోరుతున్నాడు. ఎన్ని జన్మలకైనా నేను అతడికి రుణపడి ఉంటా. మా నాన్న (మోహన్‌బాబు) ఆనందమే నాకు ముఖ్యం. దాని కోసం ఏదైనా చేస్తాను. ఆయన సంతోషంగా లేకపోతే నాకు ఏది అక్కర్లేదు. ఆయనకు చెడ్డ పేరు తీసుకొచ్చినరోజు నేను బతికున్నా చచ్చినట్లే. ఆ రోజు ఎప్పటికీ తీసుకురాను. ఆయన పేరు నిలబెట్టడానికే ప్రయత్నిస్తాను. కానీ చెడగొట్టేలా ఎప్పుడు చేయను' అని కథానాయకుడు మంచు విష్ణు అన్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తూ భారీ బడ్జెట్‌తో తీసిన సినిమా 'కన్నప్ప'. జూన్ 27న థియేటర్లలోకి రానుంది. ప్రమోషన్ కార్యక్రమంలో భాగంగా ఆయన పై విధంగా మాట్లాడారు.




చిరంజీవికి జోడీగా నయనతార

చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వస్తోన్న సినిమాలో కథానాయికగా నయనతార నటించనున్నారంటూ గత కొన్ని రోజుల నుంచి వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఆ వార్తలను నిజం చేస్తూ తాజాగా చిత్రబృందం హీరోయిన్‌ను ప్రకటించింది. ఇందులో నయనతార కథానాయికగా నటిస్తున్నారని చెబుతూ ఒక ఆసక్తికర వీడియోను షేర్ చేశారు. వీడియో చివర్లో చిరంజీవి మేనరిజంలో 'హలో మాస్టారు.. కెమెరా కొద్దిగా రైట్ టర్నింగ్ ఇచ్చుకోమ్మా' అంటూ నయనతార డైలాగ్ చెప్పారు. టీమ్‌లోకి ఆమెను స్వాగతిస్తూ చిరు సైతం పోస్టు పెట్టారు. 'హ్యాట్రిక్ మూవీకి స్వాగతం. ఆమెతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంద'న్నారు. సాహు గారపాటి, సుస్మిత సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో ఇద్దరు కథానాయికలు కనిపించే అవకాశం ఉందని ఓ పాత్ర కోసం అదితిరావు హైదరిని సంప్రదించారని సమాచారం. భీమ్స్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాని వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేసేందుకు దర్శక, నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



'డాన్ బాస్కో' షూటింగ్ మొదలు

సూర్యదేవర నాగవంశీ బావమరిది రుష్య హీరోగా 'డాన్ బాస్కో' చిత్రం వస్తోంది. ఇప్పటికే ఈ సినిమా ప్రారంభమైంది. తాజాగా సెట్స్ పైకి వెళ్ళింది. వినోదమే ప్రధానంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మలయాళీ నటి మిర్నా మీనన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. క్లాస్ మేట్స్ రీ-యూనియన్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో మురళీ శర్మ ప్రిన్సిపాల్‌గా నటిస్తుండగా, లెక్చరర్ సుమతి పాత్రను మిర్నా మీనన్ చేస్తున్నారు. ఇతర ప్రధాన పాత్రలను మౌనిక, రాజ్ కుమార్ కసిరెడ్డి, విష్ణు ఓయ్ చేస్తున్నారు. శంకర్ గౌరి రచన చేసి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను శైలేష్ రమ నిర్మిస్తున్నారు. మార్క్ కె రాబిన్ సంగీతం సమకూర్చుతున్నారు.



నాకు ఆ రెండూ ఒకటే!

కోలీవుడ్ హీరో అజిత్ కుమార్ ఓ వైపు కార్ రేసుల్లో పాల్గొంటూనే వరుస సినిమాల్లో నటిస్తున్నారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అజిత్ కుమార్ తన రిటైర్‌మెంట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'నాకు రేసింగ్ అంటే ఇష్టం కాబట్టి దానికోసం ఫిట్‌గా ఉండాలని నిర్ణయించుకున్నాను. స్విమ్మింగ్, సైక్లింగ్‌తో పాటు ఇతర వర్కౌట్లు, డైట్ చేసి ఎనిమిది నెలల్లోనే ఏకంగా 42 కిలోల బరువు తగ్గాను. రేసింగ్, సినిమా ఒకే సమయంలో ఉంటే, ఆ రెండింటికీ సరైన న్యాయం చేయలేకపోతున్నాను. దీనివల్ల ఎన్నో ఒడిదుడుకులు చూడాల్సి వచ్చింది. అందుకే నేను ఓ కీలక నిర్ణయం తీసుకున్నాను. రేసింగ్ సీజన్ ఉన్నప్పుడు సినిమాలకు కాస్త దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నా. రేసింగ్ సమయంలో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. సినిమాల్లో యాక్షన్ సీన్స్ వల్ల కూడా చాలా సర్జరీలు చేయించుకున్నా. అలా అని రేసింగ్, మూవీస్ వదిలేయలేను. నా దృష్టిలో అవి రెండూ ఒకటే' అని చెప్పారు.

JEEVANA జీవన the family

జీవన సౌరభం

లక్ష్యం అవకాశం కాదు..
ఎదురు చూడాల్సింది
కాదు.. ఎన్నుకోవాల్సింది.

అమ్మలూ.. ఆరోగ్యం జాగ్రత్త!

ఇంటికి ఆరోగ్యం ఇల్లాలే.. ఆమె బాగుంటేనే కుటుంబమంతా బాగుంటుంది. కొద్దిగా జాగ్రత్త వహిస్తే చాలా జబ్బులు మహిళల దగ్గరకు చేరకుండా నివారించొచ్చు. ఆమెకు చిన్న సుస్తీ చేసినా కుటుంబంలోని మిగతా సభ్యులంతా కకావికలమవుతుంటారు. కాబట్టి ఆమె ఆరోగ్యం విషయంలో మిగతావారు ఏమాత్రం అశ్రద్ధ చూపకూడదు. ఆడైనా, మగైనా ఆరోగ్యం విషయంలో అంతా ఒకటే కావొచ్చు. కానీ మహిళలకు ప్రత్యేకమైన సమస్యలు ఎక్కువగానే ఉంటాయని చెప్పొచ్చు.



మహిళలు ఇప్పుడు ఇంట్లో పనీ, బయట ఉద్యోగాలకు వెళ్లి అక్కడ విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఇవన్నీ సమన్వయం చేసుకోవటంలో మహిళల పాత్ర గురుతరమైనదే. అయినా ఎన్ని ఒత్తిడులు ఉన్నా మహిళలు తమ ఆరోగ్యం పట్ల కొద్దిగా దృష్టి సారించి జాగ్రత్త పాటిస్తే చాలా రకాల రోగాలకు దూరంగా ఉండొచ్చు. అవి త్వరగా దాడిచేయకుండా కాపాడటంతోపాటుగా తీవ్రం కాకుండా చూసుకోవటం, నివారించుకోవటానికి కూడా అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

మహిళల్లో సహజంగా వచ్చే అనారోగ్య సమస్యలు చాలా ఉన్నాయి. వయస్సు, జీవనశైలి, జన్యుపరమైన అంశాల ఆధారంగా అవి వేర్వేరుగా ఉంటాయి. బాలిక, యువతి దశలో ఒకరకమైన సమస్యలుంటే.. 40-50 ఏళ్ల మధ్య వయసుల్లో ఉన్న మహిళలు మరికొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా 40 ఏళ్లు దాటిన తర్వాత ఆడవారిలో గుండె సమస్యలు, అధిక బరువు, రొమ్ము క్యాన్సర్, హైబీపీ, విటమిన్ డి లోపం, మూత్రాన్ని ఆపుకోలేకపోవటం, ఆస్టియోపోరోసిస్, డయాబెటిస్ వంటి సమస్యలు సాధారణంగా కనిపిస్తుంటాయి.

ఆరోగ్య సమస్యలు

గుండెపోటు : గుండెపోటుతో మరణించే వారిలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉంటున్నారని పలు అధ్యయనాలు తెలుపుతున్నాయి. మహిళలు తమ ఆరోగ్యంపై తక్కువ శ్రద్ధ చూపుతుంటారు. కొలెస్ట్రాల్ నియంత్రణపై శ్రద్ధ చూపకపోతే గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. వయస్సు పెరగడం కారణంగా ఆడవారిలో గుండె సమస్యలు వస్తాయి. రుతు సంబంధ సమస్యలతో బాధపడుతున్న వారిలో గుండె వేగం ఎక్కువగా ఉంటుంది. మానసిక ఆందోళనకు గురయ్యే మహిళలకు ఇది వచ్చే అవకాశాలు ఎక్కువ.

రుతుక్రమ సమస్యలు : మహిళలు నెలసరికి ముందు ఎన్నో శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటుంటారు. వీటినే ప్రీ మెనుస్ట్రుల్ సిండ్రోమ్ (పీఎంఎస్) అంటారు. ఈ ఇబ్బందులు అందరికీ ఒకేలా ఉండవు. వారి శరీరతత్వానికి అనుగుణంగా వేర్వేరుగా ఉంటాయి. కొందరికి మానసిక ఆందోళన ఎక్కువగా ఉంటే.. మరికొందరికి అలసట, చికాకు, నిరాశగానూ అనిపిస్తూ ఉంటుంది. ఇంకొందరిలో శరీరం బరువు తగ్గుతుంది.

మానసిక ఒత్తిడి: డిప్రెషన్ పురుషుల కంటే మహిళల్లోనే ఎక్కువగా కన్పిస్తుంది. 39 శాతం మంది మానసిక ఒత్తిడికి గురౌతున్నారు. గర్భం, పిల్లల సంరక్షణ, కుటుంబ బాధ్యతలు అన్నీ ఆమె మానసిక ఒత్తిడిని పెంచడానికి దారి తీస్తున్నాయి. ఇంట్లో ఆర్థిక ఒడిదుడుకులు వస్తుంటే మహిళలు ఒత్తిడికి గురవుతుంటారు. అలాగే చాలామంది మహిళలు తమ భావాలను స్వేచ్ఛగా చెప్పుకోలేరు. మనసులోనే బాధ అణచుకొని ఒత్తిడికి గురౌతుంటారు. ప్రశాంతంగా ఉండటాన్ని అలవాటు చేసుకుంటే ఈ సమస్య నుంచి బయట పడొచ్చు.

అధిక బరువు : మహిళలు గర్భధారణ సమయంలోనూ, ప్రసవం తరువాత అధిక బరువు పెరుగుతారు. కొంతమందిలో అది అలా కంటిన్యూ అయిపోతుంది. ఆఫీసులు, ఇతర పని ప్రదేశాల వద్ద కూర్చుని చేసే పనులతో అధిక బరువుకు గురౌతుంటారు. ప్రతిరోజూ ఉదయమో, సాయంత్రమో నడవటం ద్వారా ఈ సమస్య నుంచి బయటపడొచ్చు. అధిక బరువు అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది.

ఆర్థరైటిస్ : ఇది స్త్రీలను బాగా వెంటాడే అనారోగ్య సమస్య. మోకాళ్ల నొప్పులు, కండరాలు పట్టేయడం, వాపు వంటి సమస్యలు తలెత్తుతాయి. ప్రసవ సమయంలో బరువు పెరగడం, కాల్షియం మాండినోవైరస్కి ప్రధాన కారణాలు.

పక్షవాతం : ఆడవారైనా, మగవారైనా ఇద్దరికీ పక్షవాతం వచ్చే అవకాశం ఉంటుంది. వంశపారంపర్యత, అధిక మానసిక ఒత్తిడి, అధిక రక్తపోటు ఇలాంటివన్నీ పక్షవాతానికి సాధారణ కారణాలు. గర్భ నిరోధక మాత్రలు వేసుకోవటం, గర్భవతిగా ఉన్నప్పుడు, హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ,

తరచుగా మైగ్రేన్ సమస్య, విపరీతమైన ఊబకాయం, యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ వంటివి కూడా కారణాలు కావొచ్చు.

రొమ్ము క్యాన్సర్ : ఒకప్పుడు మహిళల్లో గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ ఎక్కువగా వస్తుండేది. ప్రస్తుతం రొమ్ముక్యాన్సర్ కేసులు బాగా కన్పిస్తున్నాయి. చిన్న వయస్సుల వారు కూడా రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. రొమ్ముల్లో ఏర్పడే మార్పులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. 40 ఏళ్లు దాటిన మహిళలంతా క్రమం తప్పకుండా రెండేళ్లకు ఒకసారైనా మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలి.

మూత్ర ఇన్ఫెక్షన్లు : మహిళలను తరచూ వేధించే సమస్య మూత్రంలో బ్యాక్టీరియా ఇన్ఫక్షన్. సుమారు 60 శాతం మంది జీవితంలో ఎప్పుడో ఒకసారి వీటి బారినపడుతూనే ఉన్నారు. నెలసరి నిలిచిపోయిన తర్వాత వీటిముప్పు మరింత ఎక్కువ. మూత్ర విసర్జన చేస్తున్నప్పుడు మంట, నొప్పి, ఎక్కువసార్లు మూత్రానికి వెళ్లటం, మూత్రంలో రక్తం, పొత్తి కడుపులో నొప్పి, చలి, జ్వరం, చెమటలు పట్టడం వంటివి కూడా ఇన్ఫెక్షన్‌లో భాగమే.

ఇవే కాకుండా హైబీపీ, విటమిన్ డి లోపంతో ఎముకల సమస్యలు, ఇతర ఆరోగ్య సమస్యలు రావొచ్చు. డాక్టరు సలహా మేరకు మందులు వాడితే ఎలాంటి అనారోగ్య సమస్యలైనా నయమవుతాయి.



**- డాక్టర్ ఎస్‌వి మోబీన్‌తాజ్
స్త్రీ, ప్రసూతి, గర్భకోశ వైద్య నిపుణురాలు,
కెజిఎన్ హాస్పిటల్స్, అనంతపురం .
సెల్ : 78422 75939**

కొత్త కెప్టెన్ ఎవరు?

• రేసులో శుభ్‌మన్, జస్‌ప్రీత్ బుమ్రా • సోమవారం భేటీ కానున్న సెలక్షన్ కమిటీ



ప్రజాశక్తి-న్యూఢిల్లీ

విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వీడ్కోలుతో టెస్టు క్రికెట్‌లో అనూహ్యంగా తరం మార్పిడికి రంగం సిద్ధమవగా.. ఊహించని రిటైర్‌మెంట్ నిర్ణయాలతో సెలక్షన్ కమిటీ ముంగిట సరికొత్త సవాల్ నిలిచింది. కోహ్లి, రోహిత్ స్థానంలో బ్యాటర్లను ఎంపిక చేయటంతో పాటు టెస్టు జట్టుకు కొత్త సారథిని ఎంపిక చేయాల్సి ఉంది. సోమవారం ముంబయిలో సమావేశం కానున్న సెలక్షన్ కమిటీ భారత టెస్టు క్రికెట్‌పై చర్చించనుంది!. భారత్, ఇంగ్లాండ్ ఐదు మ్యాచుల టెస్టు సిరీస్ జూన్ 20 నుంచి ఆరంభం కానుంది. భారత్-ఏ జట్టు ఈ నెలాఖరు నుంచే ఇంగ్లాండ్ పర్యటన షురూ కానుండగా.. టీమ్ ఇండియాలో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ టెస్టు క్రికెట్ నుంచి తప్పుకోవటంతో బ్యాటింగ్ లైనప్‌లో రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. విరాట్ కోహ్లి, రోహిత్ స్థానంలో కొత్త బ్యాటర్లను ఎంపిక చేయటం, టెస్టు జట్టుకు కొత్త కెప్టెన్‌ను ఎంచుకోవటం అజిత్ అగార్కర్ సారథ్యంలోని సీనియర్ సెలక్షన్ కమిటీ ముందున్న సవాళ్లు. ఈ నెల 19న ముంబయిలోని బిసిసిఐ ప్రధాన కార్యాలయంలో సీనియర్ సెలక్షన్ కమిటీ సమావేశం కానుంది. ఈ నేపథ్యంలో భారత టెస్టు క్రికెట్ ఎదుర్కొంటున్న సవాళ్లను అజిత్ అగార్కర్ ప్యానల్ ఏ విధంగా ఎదుర్కొంటుందో చూడాలి.

నయా నాయకుడు ఎవరు? : టెస్టు కెప్టెన్సీ రేసులో శుభ్‌మన్ గిల్ ముందంజలో ఉన్నాడు. పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా సైతం రేసులో నిలువగా.. కెఎల్ రాహుల్ పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. శుభ్‌మన్ గిల్ వయసు 25 ఏళ్లు.. బ్యాటర్‌గా గిల్ ప్రతిభపై ఎవరికీ ఎటువంటి అనుమానాలు లేవు. సెలక్షన్ కమిటీ, సహాయక సిబ్బంది నుంచి మద్దతు ఉంది. విదేశీ గడ్డపై గిల్ బ్యాటింగ్ గణాంకాలు తీసికట్టుగానే ఉన్నప్పటికీ.. భవిష్యత్‌లో అతడు మంచి నాయకుడిగా ఎదుగుతాడనే నమ్మకం అందరిలోనూ కనిపిస్తోంది. మరోవైపు జస్‌ప్రీత్ బుమ్రా.. నాయకుడిగా నిరూపించుకున్నాడు. 2022లో ఇంగ్లాండ్‌తో ఐదో టెస్టులో తొలిసారి కెప్టెన్సీ వహించిన బుమ్రా.. ఇటీవల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో రెండు టెస్టుల్లో కెప్టెన్సీ చేపట్టాడు. ఒత్తిడి సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్న బుమ్రా ఇంగ్లాండ్ పర్యటనలో వరుసగా ఐదు టెస్టుల్లో ఆడకూడదని వైద్యులు సూచించారు. సెలక్షన్ కమిటీ మరో ఆప్షన్‌ను పరిశీలించే అవకాశం లేకపోలేదు. గిల్‌ను కెప్టెన్‌గా, పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించే ఆలోచన విరమించుకుని.. బుమ్రాకు సారథ్య పగ్గాలు అప్పగించి.. గిల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించటం. బుమ్రా విశ్రాంతి తీసుకున్న టెస్టులో గిల్ నేరుగా కెప్టెన్సీ బాధ్యతలు తీసుకోవడంతో తదుపరి సారథిగా జట్టుపై అవగాహన పెంచుకునేందుకు వీలు కలుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రెండో ఓపెనర్ రేసులో.. : కెఎల్ రాహుల్ ఆస్ట్రేలియా పర్యటనలో ఓపెనర్‌గా విజయవంతం అయ్యాడు. రాహుల్ ఓపెనర్‌గా రాణించటంతో రోహిత్ శర్మ మిడిల్ ఆర్డర్‌కు పరిమితం అయ్యాడు. మిడిల్ ఆర్డర్‌లో అదనపు బ్యాటర్‌గా ఆసీస్‌కు వెళ్లిన రాహుల్ ఓపెనర్‌గా నిలదొక్కుకున్నాడు. ఇంగ్లాండ్ టూర్‌లో రాహుల్‌ను ఓపెనర్‌గా, మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌ను సెలక్టర్లు చూస్తున్నారు. ఇంగ్లాండ్ గడ్డపై రాహుల్‌కు మంచి అనుభవం ఉంది. 2018, 2021-22 పర్యటనల్లో రాహుల్ తొమ్మిది టెస్టులు ఆడాడు. 37.31 సగటు, రెండు సెంచరీలతో 597 పరుగులు సాధించాడు. అభిమన్యు ఈశ్వరన్, బి. సాయి సుదర్శన్ రూపంలో ఇద్దరు కొత్త ఆటగాళ్లు అందుబాటులో ఉన్నారు. దేశవాళీ క్రికెట్‌లో అభిమన్యు ఈశ్వరన్ (29)కు విశేష అనుభవం ఉంది. 100కు పైగా ఫస్ట్ క్లాస్ మ్యాచుల్లో ఆడిన అభిమన్యు గతంలో పలు సిరీస్‌లకు రిజర్వ్ ఓపెనర్‌గా ఎంపికయ్యాడు. అయినా, అభిమన్యు టెస్టుల్లో అరంగ్రేటం చేయలేదు. తమిళనాడు బ్యాటర్ సాయి సుదర్శన్ 2022లో ఫస్ట్ క్లాస్ అరంగ్రేటంలోనే సెంచరీతో సెలక్టర్లను ఆకర్షించాడు. ఐపిఎల్‌లో నిలకడగా రాణిస్తున్న బ్యాటర్లలో సాయి సుదర్శన్ ఒకడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఓపెనర్‌గా సాయి సుదర్శన్ 33 ఇన్నింగ్స్‌ల్లో 1,397 పరుగులు చేయగా.. సగటు 42.33, నాలుగు సెంచరీలు బాదాడు. అభిమన్యు ఈశ్వరన్, సాయి సుదర్శన్ ఇద్దరూ భారత్-ఏ తరఫున ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపికయ్యారు. అభిమన్యు ఈశ్వరన్‌కు కెప్టెన్సీ పగ్గాలు సైతం దక్కాయి.

నెం.4 స్థానం ఎవరిది? : భారత టెస్టు జట్టులో నెం.4 స్థానానికి అప్పటికప్పుడు ప్రత్యామ్నాయం ఉండదని చతేశ్వర్ పుజారా అభిప్రాయం. 2013లో సచిన్ టెండూల్కర్ వీడ్కోలు తీసుకున్న సమయంలో విరాట్ కోహ్లి ఆ స్థానం భర్తీ చేశాడు. అప్పటివరకు కోహ్లి నెం.4 స్థానంలో ఆడలేదు. ఒక్కసారిగా నాల్గో స్థానంలో క్రీజులోకి వచ్చిన తర్వాత అదరగొట్టాడు. నాల్గో స్థానంలో బ్యాటింగ్ చేసేందుకు అనుభవం అవసరం లేదని కోహ్లి నిరూపించాడు. భారత జట్టులో భవిష్యత్ కోహ్లిగా పేరొందిన శుభ్‌మన్ గిల్ నెం.4 స్థానాన్ని తీసుకుంటాడనే అంచనాలు ఉన్నాయి. గిల్‌తో పాటు రాహుల్ సైతం ఈ స్థానం రేసులో నిలిచారు. ఇంగ్లాండ్‌తో హైదరాబాద్ టెస్టుకు విరాట్ కోహ్లి దూరమవగా కెఎల్ రాహుల్ ఆ స్థానంలో వచ్చి 86, 22 పరుగులు చేశాడు. గిల్ ముందెన్నడూ నాల్గో స్థానంలో ఆడలేదు. భారత్-ఏ తరఫున మూడు ఇన్నింగ్స్‌ల్లో 287 పరుగులు చేశాడు. సగటు 143.50 కాగా అత్యధిక స్కోరు 204 నాటౌట్. కెఎల్ రాహుల్ ఓపెనింగ్ చేస్తే.. శుభ్‌మన్ గిల్ నాల్గో స్థానంలో రావచ్చు. సాయి సుదర్శన్ మూడో స్థానంలో ఆడేందుకు అవకాశం ఉంటుంది.



నితీశ్ కుమార్ రెడ్డికి అవకాశం ఉంటుందా? : 2024-25 బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో నితీశ్ కుమార్ రెడ్డి గొప్పగా రాణించాడు. బంతితో నిరాశపరిచినా.. బ్యాట్‌తో మెల్‌బోర్న్‌లో మెరుపు సెంచరీతో ఆకట్టుకున్నాడు. సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన జాబితాలో నాల్గో స్థానంలో నిలిచాడు. ఇంగ్లాండ్ పిచ్‌లు సీమ్‌కు అనుకూలిస్తాయి. ఈ పరిస్థితుల్లో నితీశ్ బంతితో మెరిస్తే టెస్టు జట్టులో అతడి చోటు పదిలమే. ఈ ఏడాది రంజీ ట్రోఫీ సహా గతంలో ఆల్‌రౌండర్‌గా సత్తా చాటిన శార్దుల్ ఠాకూర్ రేసులోకి వచ్చాడు. భారత్-ఏ జట్టులో నిలిచిన శార్దుల్ ఠాకూర్‌కు ఇంగ్లాండ్ గడ్డపై మంచి గణాంకాలు ఉన్నాయి. భారత్-ఏ తరఫున రెండు వార్మప్ మ్యాచుల్లో నితీశ్, శార్దుల్ ప్రదర్శన కీలకం కానుంది. ఇద్దరిలో ఎవరు టెస్టు జట్టుకు ఎంపికైనా.. మరొకరు రిజర్వ్ ప్లేయర్‌గా నిలువనున్నారు.

పేస్ దళం పరిస్థితి ఏమిటీ? : భారత టెస్టు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో పేస్ బౌలింగ్ ఒకటి. జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమి పూర్తి ఫిట్‌నెస్‌తో లేరు. ఈ ఇద్దరు ఐదు టెస్టుల్లో ఆడలేరు. మహ్మద్ సిరాజ్ అందుబాటులో ఉన్నాడు, కానీ నిలకడ లేమి ప్రదర్శన అతడిపై అంచనాలు తగ్గేలా చేస్తోంది. ప్రసిద్ కృష్ణ, ఆకాశ్ దీప్, ముకేశ్ కుమార్, ఖలీల్ అహ్మద్, అర్షదీప్ సింగ్, యశ్ దయాల్ సహా హర్షిత్ రానా పేస్ విభాగంలో చోటు కోసం పోటీపడుతున్నారు. బుమ్రా, షమిలకు విశ్రాంతి లభించనుండగా.. టెస్టు జట్టులో మరో ఇద్దరు పేసర్లను అదనంగా తీసుకునే వీలుంది.



కుల్దీప్ యాదవ్‌కు చోటుందా? : భారత క్రికెట్ బౌలింగ్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రాకు ఉన్న ప్రాధాన్యత చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు సైతం ఉంటుంది. రవిచంద్రన్ అశ్విన్ వీడ్కోలు తర్వాత భారత జట్టు తొలి విదేశీ పర్యటన ఇది. రవీంద్ర జడేజాతో పాటు మరో స్పిన్నర్‌ను ఎంపిక చేయనుండగా.. కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్ రేసులో ఉన్నారు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో వాషింగ్టన్ సుందర్‌కు పిలుపు రాగా.. బ్యాటింగ్ ఆల్‌రౌండర్‌గా ఆడాడు. ఆస్ట్రేలియాలోనూ మూడు టెస్టుల్లో సుందర్ ఆడినా.. బంతితో పెద్దగా బాధ్యతలు లేవు. హెర్నియా సర్జరీతో ఆస్ట్రేలియా పర్యటనకు దూరమైన కుల్దీప్ యాదవ్.. స్వదేశంలో ఇంగ్లాండ్‌పై 4-1 విజయంలో కీలక పాత్ర పోషించాడు. 36.05 స్ట్రయిక్‌రేట్‌తో 19 వికెట్లు పడగొట్టాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68